సంపుటి 54 సంచిక 133 డిశెంబర్ 2020

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



వెండితెర మహానటి సావిత్రి

# విషయ సూచిక

**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి**.......................................................................................1

సెక్రెటరీ రిపోర్ట్ – **అపర్ణ సుసర్ల**..... ......................................................................................................2

## శీర్షికలు

శ్రీమద్భగవద్గీత – రంగారావు పెయ్యేటి ..................................................................................................4

వినువీధిలో విన్యాసం- మూర్తి జొన్నలగెడ్డ...... ..........................................................................................9

పట్టుచీరలు-అనురాధ నేదునూరి........... .......................................................................................11

ఉత్తరాల స్టాండు-శ్రీదేవి పెయ్యేటి...........................................................................................................12

మాతృత్వం శాపమా-జానకీదేవి షామీరు..................................................................................................17

ధనుర్మాస వైశిష్ట్యం-లలితరాంభట్ల........................................................................................................19

ఘంటసాల గుడి- వంశీ రామరాజు.......................,...............................................................................21

తెలుగు గజల్-కె.టి.పద్మజ...........................................................................................................27

బాలుతో నా అనుబంధం- రామమూర్తి కోడూరు.....................................................................................31

శ్రీధర వేంకటప్పయ్య – రంగారావు పెయ్యేటి..........................................................................................35

పరిశుభ్రగొట్టాల కథ-చిట్టెన్ రాజు వంగూరి..........................................................................................40

సంగీతనాదామృతం-పద్మ మల్లెల...................................................................................................43

ఒకే ఒక బాలు-అపర్ణ చెన్నాప్రగడ.............. ..................................................................................46

మహిమ – డి. కామేశ్వరి........................................................................................................................53

మానవత్వానికి చిరునామా-విజయ గొల్లపూడి.........................................................................................58

నేను- చాందినీ బళ్ళా..........................................................................................................................64

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |

# సంపాదకీయం

డిశెంబర్ నెలలో తెలుగువాహిని మాసపత్రిక పాఠకులకు శుభాభివందనాలు. ఈ నెలలో తెలుగువారి అభిమాన నటి సావిత్రి జయంతి సందర్భంగా, ఆమె ముఖచిత్రంతో వాహిని మాసపత్రిక మీకు అందిస్తున్నాము.

అనుకోని రీతిలో కరోనా వైపరీత్యం వలన ఈ 2020 సంవత్సరం ప్రపంచమంతా ఒకే రీతిన నడచింది. దేశదేశాలకు మధ్య రాకపోకలు స్తంభించాయి.ఒకరకంగా చెప్పాలంటే ప్రతికుటుంబంలో ఇంట్లోని సభ్యులతో, నివశిస్తున్న ఇంటితో చక్కని అనుబంధం పెనవేసుకోని, స్వీట్ హోమ్ గా మలుచుకోవటానికి ఇదొక అవకాశంగా భావించాలి. పెద్దలు పెట్టే పేర్లు సరిగ్గా అతికినట్లు సరిపోతాయేమో అనిపిస్తుంది.

మన తెలుగుసంవత్సరాలలో శార్వరి అనగా చీకటి ప్రవేశించి మన జీవితాలలో కరోనా పేరుతో గృహనిర్బంధం తీసుకువచ్చి, తన పేరును నిలుపుకున్నట్లు ఉంది. ఏది ఏమైనా ఈ 2020 సంవత్సరంలో మహామహుల నిష్క్రమణం కొంత నిరాశను నింపింది.

ఇటువంటి సమయాలలో మనకున్న సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతం, సాహిత్యం, సమావేశాలు కొంతవరకు ఉపశమనాన్ని కలిగిస్తాయి.

ఎట్టి పరిస్థితులలోనూ కాలం మటుకు స్థంభించదు. మనిషి వయస్సు ఆగిపోదు. దానికి మనం రోజు పేపరు పై వ్రాసే తేదీ, డైరీ దినచర్యలు,వార్తాపత్రికలలాంటివే సాక్ష్యాలు. గడించిన అనుభవాలు రాబోవు భవిష్యత్ జీవితానికి పునాది వేసి, ఏ బాటలో నడవాలో గమ్యాన్ని నిర్దేశిస్తాయి.

తెలుగువాహిని ప్రోత్సాహకులకు, పాఠకులకు, రచయితలకు, శీర్షికలు అందచేస్తున్న అందరికీ, ప్రకటనదారులకు క్రిస్మస్ మరియు రానున్న నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు. రాబోవు నూతనసంవత్సరం ప్రతిఒక్కరి జీవితాలలో ఆనందాలు తీసుకురావాలని ఆశిస్తూ......

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ కుమార్ పరుసు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


తెలుగు వాణి కన్వీనర్ :
రాజా తల్లాప్రగడ
0422 953 668


తెలుగు వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు బడి కోఆర్డినేటర్
రావు పెద్దాడ 0456 226 000


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు


మూర్తి పోతుకూచి-రిటర్నింగ్ ఆఫీసర్


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

Greetings from Secretary's desk!
November was full of action for Executive Committee (EC) with our flagship Deepavali Sambaralu 2020 event celebrated on 21 Nov 2020. This event was facilitated as a Zoom webinar session. The webinar session has been viewed by 80-90 life member households.
An event like this cannot happen overnight. The wheels started rolling weeks ago. It requires planning and a bird's eye for details. We have been fortunate enough to be backed by a committed executive committee who know their job and are result oriented.

I would like to share some of the feedback on the event:

*"Congratulations for presenting such a beautiful program with local talent. Promoting local talent was one of the main objectives of the founders of Telugu association and you fulfilled it. I hope your committee will maintain this stance under your leadership." – Smt. Sarala Chalasani*

*"I would like to say congratulations to all of you for an outstanding job yesterday with the Webinar. Excellent variety of programs having classical music, mridangam, kollatam, Kuchipudi dances and film songs etc.It was also very well MCed, and overall video quality and sound quality was also very good. It was indeed very professional. Interjecting with the Quiz questions was a welcome addition.I felt that this approach without audience distractions and chatter was very good as we could focus on the programs and the artists.*
*I would suggest even after we see through COVID, we should still do some programs via Zoom." – Sri. Varaprasad Gollakota*

*"Congratulations and my Best wishes to all of you in organising the Deepavali Utsavalu in a new fashion to suit this COVID-19 environment. You did with A Great Success. Most items of the program was interesting to the audience. In particular, I liked the debate conducted for Senior Citizens which is really useful for the seniors like me. Though all the speakers were good in presenting their views, I finally and totally agreed to the version of Sri Madhu Vennelakanti garu. A good thought and efforts gone into organising the Zoom event thou' some telecast quality problems were there. Smt. Vudata Kameswari garu as MC presented well and my wishes to her." - Sri.Kodur Ramamurthy*

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- A new three member Telugu Badi committee has been formed with the appointment of Mr. Narasimha Rao Peddada as the Convenor, Mrs. Bharati Parasu and Mr. Ramesh Manne as Co-ordinators.

- A new three member Telugu Vani committee has been formed with the appointment of Mrs. Raja Tallapragada as the Convenor, Mr. Sai Gollapudi and Mr. Chandrashekar Raghavaraju as Co-ordinators.

- Vanitha Mandali is organising a virtual Home Gardening information session on 5$^{TH}$ Dec 2020. Mrs. Jyothy Voleti who has been active member of Vanitha Mandali organising group has resigned due to personal commitments.

- EC is working closely with Public Officer Dr. Ravi Seethamraju and seeking his advice and guidance on governance and compliance changes.

The EC have added the below new members to our Life Member pool. EC welcomes the life members
Mrs. Prabha Prayaga; Mr. Kishore Prayaga; Mr. Sreekanta Brahmapuram; Mr. Venkata Prasad Rambhatla; Mr. Dussa Radha Manohar; Mrs. Jyothy Karna; Mr. Amalla Surya Vamshi Krishna; Mr. Madhu Bhushan Papala

The EC is undertaking a major initiative to drive youth participation and involvement within the association. As a first step, we are gathering and collecting information about Life member children, their interests, and skillsets. This information is useful to tailor STA events and communications to our children and their interests. Soon you will be receiving an email to register your children details. I am sure all our members are looking forward to Christmas and New Year Break. Wish you all a very safe and relaxing holiday.

Best Regards,
Aparna Susarla
Secretary Sydney Telugu Association

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)

11.

శ్రీభగవాన్ ఉవాచ:

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే |

గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ||

త్వం = నీవు

అశోచ్యాన్ = (సద్వృత్తులగుటచే, లేక, సద్రూపులగుట వలన నిత్యులగుటం బట్టి) దుఃఖింపదగని వారిని (భీష్మద్రోణాదులను) గూర్చి

అన్వశోచః = దుఃఖించుచుంటివి.

ప్రజ్ఞావాదాంశ్చ = ప్రజ్ఞావంతుల వాక్యములను (బుద్ధివాదముతో కూడిన వాక్యములను గూడ)

భాషసే = పలుకుచుంటివి.

పండితాః = ఆత్మజ్ఞానులు

గతాసూన్ = మరణించిన వారి గుఱించియు,

అగతాసూంశ్చ = బ్రతికియున్నవారిని గుఱించియు

నానుశోచంతి = దుఃఖింపరు.

శ్రీకృష్ణభగవానుదు చెప్పెను - (ఓ అర్జునా!) నీవు శోకింపదగని వారిని గూర్చి శోకించుచుంటివి. పైగా ప్రజ్ఞావంతుని వలె బుద్ధివాదముతో గూడిన వాక్యములను పలుకుచున్నావు. జ్ఞానులగువారు మరణించిన వారిని గుఱించి గాని, జీవించియున్న వారిని గుఱించి గాని ఎన్నటికిని దుఃఖించరు.

భక్తులారా, పరమాత్మ యొక దివ్యసందేశం ఇక్కడినుంచి మొదలవుతోంది. అందుకే గీతాశాస్త్రానికి ఈ శ్లోకం బీజమని చెప్పబడుతోంది. చెట్టు మొత్తం విత్తనంలో ఇమిడి వున్నట్లు గీతాతత్త్వమంతా ఈ శ్లోకంలో ఇమిడివుంది.

గీతాప్రబోధం 'అశోచ్యాన్' అన్న పదంతో మొదలయింది. చివరి అధ్యాయంలోని 'మాశుచః' అన్న పదంతో అంతమయింది. అంటే శోకరాహిత్యమే గీతయొక్క పరమలక్ష్యమని అర్థమవుతోంది.

ప్రపంచంలోని ప్రతి పదార్థం అస్తి, భాతి, ప్రియ, నామ, రూపములనే ఐదింటితో ఏర్పడుతోంది. అందులో మొదటి మూడు (సత్, చిత్, ఆనందము) సత్యములు. తక్కిన నామరూపాలు రెండూ కల్పితాలు. మొదటి మూడు మాత్రమే జీవుని వాస్తవస్వరూపం. నామరూపాలు మాత్రం కావు. సత్యమైన తన స్వరూపం ఎప్పటికి నశింపదు. కాబట్టి దానికోసం దుఃఖించవలసిన పని లేదు. ఇక అసత్యమైన నామరూపాలు మార్పు పొందినా, నశించినా అవి తన స్వరూపం కాదు కాబట్టి వాటికోసం శోకించడం వ్యర్థం. అందువల్ల ఇంక శోకించడం ఎందుకోసం? అని భగవానుడు బోధిస్తున్నాడు.

ప్రజ్ఞావాదాంశ్చ - బుద్ధివాదంతో కూడిన పలుకులు. బుద్ధి కొంత దూరం మాత్రమే పోగలదు. ఆపైన పోలేదు. బుద్ధికి అతీతమైన వస్తువు ఆత్మ. బుద్ధి (Conscious state) ప్రకృతిలో అంతర్గతం. కాబట్టి బుద్ధివాదంలో లోపాలుండవచ్చును. ఆత్మను (Super-conscious state) స్పృశించినవానికి అలా వుండదు. అతడికి పరమార్థతత్త్వం, యదార్థం తెలుసు. అర్జునుడు ఇంకా ఆ స్థితికి చేరుకోలేదు కనకే బుద్ధివాదంతో కూడిన పలుకులే పలికాడు.

పండితులంటే సామాన్యంగా కావ్య నాటకాలంకారాల లోను, కవిత్వాదుల లోను పాండిత్యం వున్నవారు అని ప్రస్తావిస్తాం. కాని నిజానికి పండితుడు అంటే ఎవరికోసం గాని, దేనికోసం గాని దుఃఖించనివాడు అని భగవంతుడు చెబుతున్నాడు. జ్ఞానాగ్నితో సమస్త కర్మలని భస్మీభూతం చేసుకున్నవాడే పండితుడు. (4వ అధ్యాయం). సర్వజీవుల యందు సమభావం కలవాడే పండితుడు. (5వ అధ్యాయం). ఆత్మజ్ఞానం కలవాడే పండితుడు.

12.

న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః |
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ || 12 ||

అహమ్ = నేను
జాతు = ఒకప్పుడును
న, ఆసమ్ = లేను - అనునది
న, తు, ఏవ = లేనేలేదు.
త్వమ్ = నీవు
న (ఆసీః) = లేవు - అనునది లేదు.
ఇమే = ఈ
జనాధిపాః = రాజులు
న (ఆసన్) = లేరనునదియును లేదు
చ = మరియు
అతః, పరమ్ = ఇకమీదట
వయమ్, సర్వే = మనము అందఱము
న, భవిష్యామః = లేకపోవుట అనునది
న, ఏవ = లేనేలేదు.

నీవుగాని, నేనుగాని, ఈ రాజులు గాని ఉండని కాలమే లేదు. ఇక ముందు కూడ మనము ఉండము అను మాటయే లేదు. (అన్ని కాలములలోను మనము ఉన్నాము. ఆత్మ శాశ్వతము. అది అన్ని కాలముల యందును వుండును. శరీరపతనముతో నశించునది కాదు.) ఈ శ్లోకంలో 'తు' అన్న పదం స్థూలశరీరం కన్న ఆత్మ వేరు అన్న విషయాన్ని సూచిస్తోంది. స్థూలదేహానికి ఉత్పత్తి, వినాశములు వున్నాయి. కాని ఆత్మకు లేవు. ఆత్మ నిత్యమైనది.

ఈ శ్లోకం ద్వారా పరమాత్మ 'తత్త్వమసి' అన్న మహావాక్యాన్ని ఉపదేశిస్తున్నాడు. నీవు, నేను, ఈ రాజులు అందరం నిత్యులము అని చెప్పడం వలన ఆత్మ శాశ్వతం అని, తాను ఆత్మయే కాని దేహం కాదని, అందరు జీవులలోను ఒకే ఆత్మ వ్యాపించి వుందని తెలుస్తోంది. 'సర్వే వయమతః పరమ్' - మనమందరము అని చెప్పినందు వలన పరమాత్మకు, జీవాత్మకు భేదం లేదని, అందరు ఒకే సద్వస్తువని తెలుస్తోంది. అందరూ కూడా జననమరణరహిత శాశ్వత ఆత్మస్వరూపులే. ఒక శరీరంలోనే అవయవ భేదాన్ని బట్టి శిరస్సు, హస్తము, పాదము అని వ్యవహారం ఎలా కలుగుతోందో, అలాగే శరీరభేదాన్ని బట్టి నీవు, నేను, దేవతలు, దానవులు అని వ్యవహారం కలుగుతోంది. అంతేగాని ఆత్మభేదాన్ని బట్టి కాదు.

పరమాత్మ ఒక మహా అగ్నిజ్వాల అనుకుంటే, ఆ జ్వాల నుంచి వెలువడే నిప్పురవ్వలే జీవాత్మలు. ప్రళయకాలంలో జీవాత్మలన్నిటినీ పరమాత్మ తనలో లీనం చేసుకుంటాడు. తిరిగి యుగారంభాన ఆ జ్వాలనుంచి వెలువడిన నిప్పురవ్వల వలె జీవాత్మలు సృష్టింపబడతాయి. అందుచేత యుగాంతంలో ఆత్మలు నశించవు, యుగారంభాన ఆత్మలు జనించవు.

13.

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా |

తథా దేహాన్తరప్రాప్తిర్ధీర స్తత్ర న ముహ్యతి || 13 ||

దేహినః = జీవునకు

అస్మిన్ దేహే = ఈ శరీరమునందు

కౌమారమ్ = బాల్యము

యౌవనమ్ = యౌవనము

జరా = ముసలితనము

యథా = ఏవిధముగా కలుగునో

తథా = అదే విధముగా

దేహాన్తర ప్రాప్తి = మఱియొక శరీరమును బొందుటను (కలుగుచున్నది)

తత్ర = ఆ విషయమున

ధీరః = జ్ఞాని

నముహ్యతి = మోహమునొందదు. (శోకింపడు)

జీవునకు శరీరమునందు బాల్య, యౌవన, వార్ధక్యములను అవస్థలెట్లు కలుగుచున్నవో, అట్లే మరణానంతరము మఱియొక శరీరమును బొందుటయు జరుగుచున్నది. కావున ఈ విషయమై ధీరుడు ఎంతమాత్రమును మోహమును గాని, శోకమును గాని పొందడు.

దేహే అని చెప్పబడినందు వలన ఈ మార్పులన్నీ దేహానికే గాని ఆత్మకు కావని విశదమవుతోంది. జీవుడు బాల్యము పోయి యౌవనము వచ్చినప్పుడు దుఃఖించటల్లేదు. యౌవనము పోయి వార్ధక్యం వచ్చినప్పుడు దుఃఖించటల్లేదు. మరి మరణం సంప్రాప్తించి, మఱియొక శరీరాన్ని పొందినప్పుడు మాత్రం ఎందుకు దుఃఖించాలి? (కర్మరాహిత్యం పొందితే జీవునికి దేహాంతర ప్రాప్తి వుండదు.)

14.

మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః |

ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత || 14 ||

కౌంతేయ = ఓ కుంతీపుత్రా!

శీతోష్ణసుఖదుఃఖదాః = శీతోష్ణములను, సుఖదుఃఖములను కలిగించునవియైన

మాత్రాస్పర్శాః, తు = విషయేంద్రియ సంయోగములయితే

ఆగమాపాయినః = ఉత్పత్తి వినాశ శీలములు (రాకపోకలు కలవి)

(మఱియు)

అనిత్యాః = అనిత్యములు.

భారత = (కావున) ఓ అర్జునా!

తాన్ = వాటిని (ఆ ద్వంద్వములను)

. తితిక్షస్వ = సహింపుము.

అర్జునా! విషయేంద్రియ సంయోగము వలన శీతోష్ణములు, సుఖదుఃఖములు కలుగుచున్నవి. అవి ఉత్పత్తి వినాశశీలములు, అనిత్యములు. కనుక భారతా! వాటిని పట్టించుకొనకుండ సహింపుము.

ఈ జగత్తు మిథ్య అని తెలుసుకోలేని వారు బాహ్యపదార్థాల సంయోగం వల్ల ఇంద్రియాలకి కలిగే శీతోష్ణ, సుఖదుఃఖాది వికారాలను సత్యములుగా నమ్మి బాధలు పడుతున్నారు. ఇవన్నీ ప్రకృతికి సంబంధించినవి కనుక ఓర్చుకోవాలి. ఇంద్రియాలకు కలిగే సుఖం కేవలం సుఖం కాదు. దుఃఖంతో కలిసివున్నది. అందువల్ల సుఖము, దానిననుసరించి దుఃఖము కూడా కలుగుతూ వుంటాయి. అందువల్లనే పరమాత్మ సుఖదాః అనక సుఖదుఃఖదాః అని వర్ణించడం జరిగింది.

ఆగమాపాయినః = ఈ ప్రాపంచిక సుఖాలన్నీ శాశ్వతమైనవి కాదు. వస్తూ వుంటాయి, పోతూ వుంటాయి. అందువలన వాటిమీద మోహము, ఆసక్తి కలిగి వుండకూడదు.

ఈ శ్లోకంలో కౌంతేయ!, భారత! అని అర్జునుని సంబోధించడం జరిగింది. మాతృవంశము వలన, పితృవంశము వలన పరిశుద్ధమైన వాడే విద్యాధికారి అని దీని అర్థం.

15.

యం హి న వ్యథయం త్యేతే పురుషం పురుషర్షభ |

సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే || 15 ||

హే పురుషర్షభ! = ఓ పురుషులందు శ్రేష్ఠుడవగు అర్జునా!

ఏతే = ఈ శీతోష్ణ సుఖదుఃఖములు

సమ = సమానమగు

దుఃఖసుఖం = దుఃఖసుఖములు గల (అనగా సుఖదుఃఖములు ప్రాప్తించినపుడు హర్షవిషాదములు లేనట్టి)

యంహి = ఏ

ధీర = బుద్ధిమంతుడగు

పురుషం = పురుషుని

నవ్యధయంతి = చలింపజేయవో

సః = ఆ పురుషుడు

అమృతత్వాయ = మోక్షము కొఱకు

కల్పతే = సమర్థుడగును.

ఎవరికైతే సుఖదుఃఖాలు సమానములో, అనగా ఎవరైతే సుఖం కలిగినపుడు సంతోషాన్ని, దుఃఖం కలిగినపుడు విషాదాన్ని పొందడో (అనగా శమదమాది సాధనసంపత్తి కలవాడో), ఎవడు ధీరుడో (అనగా నిత్యానిత్య వస్తువివేకము కలవాడో), వైరాగ్యాది గుణసంపత్తి కలవాడో, అట్టివాడే మోక్షానికి అర్హుడవుతాడు.

సర్వదుఃఖసహనపూర్వకంగా నిరంతరం బ్రహ్మనిష్ఠుడై వుండి మోక్షాన్ని సంపాదించుకో గలిగిన వాడే పురుషోత్తముడు అని సూచించడం కోసం 'హే పురుషర్షభ!' అని సంబోధించడం జరిగింది.

'విషయేభ్యో ధియం రాతి నిగృహ్ణాతీతి ధీరః' - శబ్దస్పర్శరూపరసగంధము లనెడి విషయములనుండి బుద్ధిని నిగ్రహించువాడు ధీరుడనబడును.

బ్రహ్మము యొక్క అజ్ఞానము వలన మరణములను, జన్మలను పొందును.

'సమే సమభావం బ్రహ్మభావం గమితే సుఖదుఃఖే యస్య తం" - సుఖదుఃఖములను బ్రహ్మస్వరూపముగా నెరిగినవాడు, అట్టి బ్రహ్మవేత్తయగు యే పురుషుని శీతోష్ణాదులు జ్ఞాననిష్ఠ నుండి చలింపజేయ జాలవో, అట్టి పురుషుడు అమృతరూపమైన బ్రహ్మజ్ఞానమును పొంది మోక్షమునకు అర్హుడగుచున్నాడు.

'శాంతో, దాంత, ఉపరత, స్తితిక్షు, స్సమాహితో భూత్వాఽ ఽ త్మన్యేవాత్మానం పశ్యతి, అభయం హివై బ్రహ్మ భవతి' - అంతరింద్రియ నిగ్రహము, బహిరింద్రియ నిగ్రహము, సంన్యాసము, శీతోష్ణాది ద్వంద్వసహనము, చిత్తసమాధానము గలవాడాత్మ యందే యాత్మను దెలిసికొనును. అట్టి తీరున తెలిసికొని భయరహితమగు బ్రహ్మభావమును బొందును. అనగా మోక్షమును బొందునను శ్రుతిప్రసిద్ధిని సూచించుటకు 'యంహి న వ్యథయన్త్యేతే' అను చోట 'హి' అను శబ్దముపయోగింపబడెను.

పంచకర్మేంద్రియములు (వాక్పాణిపాదపాయూపస్థలు), పంచ జ్ఞానేంద్రియములు (త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు), మనశ్చతుష్టయము (మనోబుద్ధిచిత్తాహంకారములు), ప్రాణాదిపంచకము (ప్రాణాపానవ్యానోదానసమానములు), వియదాదిపంచకము (పృథివ్యప్తేజోవాయ్వాకాశములు), కామము, కర్మ, మూలాజ్ఞానము అను నీ యెనిమిది పురములన బడును. వీటియందుండు ఆత్మ పురుషుడనబడును. లేక, స్థూలదేహసూక్ష్మదేహముల యందు బైన జెప్పినవన్నియు నంతర్భావమును బొందును గాన నట్టి స్థూలసూక్ష్మదేహములకు గారణోపాధి యగు మూలావిద్య పురమనబడును. దానియందుండు ఆత్మ పురుషుడనబడును. అట్టి పురుషుడు స్థూలసూక్ష్మకారణోపాధుల యందు అభిమానమును విడిచినచో నతడు స్థూలసూక్ష్మకారణోపాధులను విడిచిన వాడగును. సమాధినిష్ఠుడగు నట్టి పురుషునికి శీతోష్ణములు గాని, సుఖమును గాని, దుఃఖమును గాని కలుగజేయుటకు సమర్థములు గావు. అట్టి ధీరుడు మోక్షమునకర్హుడగుచున్నాడు.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

❖❖❖❖❖




❖❖❖❖❖

# విను వీధిలో విన్యాసం

-డా. మూర్తి జొన్నలగెడ్డ, సౌత్ పోర్టు, యునైటెడ్ కింగ్డమ్



ఉక్కు తీగెల రక్షా బంధంతో వేగంగా ఎగిరే విమానపు రెక్కలపై నడుస్తూ రక రకాల విన్యాసాలను ప్రదర్శించే వయ్యారులను ప్రపంచ వ్యాప్తంగా అనేక వైమానిక ప్రదర్శనలలో మనం చూడవచ్చు. ప్రదర్శన చూడడానికి సమావేశమైన జన సందోహం ముందు గిరికీలు కొడుతూ తిరిగే విమానపు రెక్కలపై ఉత్కంఠ భరితమైన ప్రమాదకరమైన విన్యాసాలు చెయ్యడం కొంతమందికి సరదా.

'వింగ్ వాకింగు' మొదటి సారి 1911 వ సంవత్సరంలో జరిగినా, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 'స్టీర్ మన్ బై ప్లేన్' అను సైనిక తర్ఫీదు విమానంపై ఈ విన్యాసాలు చెయ్యడం బాగా ప్రసిద్ధి చెందింది. ఆందుకు అనువుగా రెట్టింపు శక్తి గల చోదక యంత్రాన్ని బిగించి, రెక్కలకు కొన్ని మార్పులు చేస్తారు.

ఇదివరలో వింగు వాకర్సు ఒక ఎగిరే విమానం లోంచి ఇంకొక ఎగిరే విమానం లోనికి లేదా ఒక కదిలే ట్రక్కు వంటి వాహనం లోనికి మారడం వంటి విన్యాసాలు చేసే వారు. ఇది ఒక ప్రమాదకర క్రీడగా పరిగణింప బడినా, 1975 సం. నుండి ఇంతవరకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 4 గురు మాత్రమే ప్రమాద వశాత్తు మరణించారు. ఆ విధంగా చూస్తే రోజు వారీ రహదారి ప్రయాణం కంటె ఎగిరే విమానపు రెక్కల పైన ఎక్కువ భద్రత ఉందేమో అనిపిస్తుంది.

కొంత మంది వింగు వాకర్సు, ఈ అనుభవం ఒక మాయా తివాసీపై ఎగురుతున్నట్లు ఉంటుందని చెబుతారు. కొందరు స్కై డైవింగు చెయ్యడం, వేగంగా గాలి వీచే సొరంగాలలో తర్ఫీదు పొందడం వల్ల సునాయాసంగా ఈ విన్యాసాలు చేయగల్గుతారు. రోజు వారీ జీవితంలో రక రకాల ఉద్యోగాలు చేసేవారు ఈ రకమైన అభ్యాసం వల్ల వింగు వాకర్సు గా పని చేయ గల్గుతారు. ప్రపంచం అంతటా పర్యటిస్తూ ఇటువంటి ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో ఉత్సాహాన్నిస్తుందని చెబుతారు.

ఈ విమానాలు నడిపే చోదకులకు కొన్ని వందల గంటల అనుభవం, పురాతన విమానాలపై ఆసక్తి, ప్రత్యేక మెలుకువలు కావల్సి ఉంటాయి. 'మార్టిన్ క్యారింగ్ టన్' అను ప్రఖ్యాత విమాన చోదకుడు, పై కప్పు లేని విమానపు కాక్ పిట్ లో తలక్రిందులుగా ఎగరడం గొప్ప సరదా అని చెబుతారు.



సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు విరాళాలు సేకరించడం కోసం కొందరు ఇటువంటి సాహస కార్యాలు చేస్తారు. సుమారు రూ. 43 వేలు ఖర్చు చేస్తే మీరు కూడా ఈ అనుభవాన్ని పొందవచ్చు. ఒక గంట తర్ఫీదు ఇచ్చి, ఒక పది నిముషాలు ఎగరనిస్తారు. యాభై మంది బంధు మిత్రులను ఈ విన్యాసాలు తిలకించడానికి ఆహ్వానించవచ్చు.

'బెట్టీ బ్రోమేజ్' అను 88 వసంతాల ఆంగ్ల వనిత అత్యంత పెద్ద వయస్సు గల వింగు వాకర్ గా రికార్డు నెలకొల్పింది. మరికనేం, డబ్బు సిద్ధం చేసుకోండి! వయస్సుతో నిమిత్తం లేకుండా ఎటువంటి ప్రమాదకరమైన సరదా అయినా తీర్చుకో గల రోజులివి.

పై ఛాయా చిత్రాలు ఇంగ్లాండులో లివర్ పూల్ మహా నగరానికి చేరువలో ఉన్న సౌత్ పోర్టు పట్నంలో జరిగే వార్షిక విమాన ప్రదర్శనలో తీసినవి.



# పట్టు చీరలు

-శ్రీమతి అనురాధ నేదునూరి, హైద్రాబాద్



పట్టు చీరలు అంటే మక్కువ లేనిది ఎవరికి? సంవత్సరం పాప నుండి 90 ఏండ్ల పండు పడుచు వరకు ఆ తళ తళ లంటే ఇష్టమే,  పెళ్ళిల సీజన్, కార్తీక మాసం, శ్రావణమసం  వచ్చిందంటే ప్రతి పట్టు చీరల మాల్స్, దుకాణాలు కిక్కిరిసి వుంటాయి. భారత వనితలు చీర కట్టుకి చాలా ప్రాదాణ్యత ఇస్తారు. ఇప్పుడు విదేశీ వనితలు కూడా మక్కువ చూపిస్తున్నారు. చీరకట్టులో పట్టుచీర అందమే వేరు. పట్టు చీరల్ని ఎప్పుడో పండుగలకి, పెళ్ళిళ్లకు తప్ప ఎక్కువ గా కట్టము.

మరి ఆ పట్టు చీరల ను ఎలా వుతకాలి, ఎలా జాగ్రత్త పరచలో ఇప్పుడు తెలుసు కుందాం,

బీరువాలో చీరల్ని అప్పుడపుడు బయటకు తీసి మడతలు మార్చి కొద్ది సేపు గాలికి పెట్టి మళ్ళీ బీరువాలో ఒక తెల్లటి సైన్ గుడ్డ అంటారు దానిలో మూట కట్టి బద్ర పర్చాలి. బీరువాలో వీలైతే చీరల్లో పెట్టే సువాసన భరితమైనవి మార్కెట్లో లభ్య మవుతున్నాయి. లేదా కలరా వుండలు దొరుకుతాయి అవైన సరే లేదంటే సువాసన భరితమైన  అగరు బత్తీల పైన పేపర్లయినా మడతల  మద్యలో వుంచి జాగ్రత్త చేయాలి.

ఇక ఉతకాల్సి వస్తే చక్కగా షాంపూ కాని, కుంకుడు కాయలరసం కానీ ఉపయోగించి ఒక్కొక్క చీరని విడి విడి గా వుతికి ఒక దాని రంగు ఒక దానికి అంటకుండా జాగ్రత్త గా వుతికి ఆరవేయాలి,

ఇక డ్రైక్లీన్లకు వెయ్యకుండా ఎండా కాలం చక్కగా ఇంట్లోనే స్టార్చ్ వేసుకొని ఎండలో ఆరబెట్టి ఇద్దరు కలిసి అటు ఒకరు ఇటు ఒకరు కొంగులు పట్టు కొని చక్క లాగి ఇస్త్రీ మడతలు పెట్టి దిండు కింద పెడితే చక్కగా ఇస్త్రీ అవుతాయి,

ఆ స్టార్చ్ ఏలా చేయాలంటే?

సాబుదానా (సగ్గు బియ్యం) మనం (పాయసం చేయడానికి కూడ వాడతాం) వాటిని ఒక నాలుగు గంటలు నానబెట్టి వాటిని మిక్సీ లో మెత్తగా పేస్టు లా చేసి stove పైన ఒక పెద్ద గిన్నెలో నీళ్లు పోసి మరుగుతూవుంటె ఈ సాబుదాన పేస్టును ఆ మరుగు తున్న నీటి లో పోసి ఒక పొంగు వచ్చేదాక మరిగించి దించి చల్లరిచి ఒక బకెట్ లోకి పెద్ద ప్లాస్టిక్ జాలి తో వడపోసి ఒక్కొక్క చీరకు విడివిడి గా గంజి పెట్టి మంచి ఎండలో వేయాలి. ఈ స్టార్చ్ పెట్టే పని ఎండా కాలమే చేయాలి.

చలి వానా కాలాలు చేయ కూడదు. మీ విలువైన పట్టు చీరలు ఇలా చేసి భద్రపరుచుకుంటారు కదూ.

ఇంకా చీర్ కట్టి, కట్టి బోరుగా వుంటే రంగులు, ప్రింటులు మార్పించుకోవచ్చు, ప్లెయిన్ వాటి పైన అద్దాలు, కుందంన్స్, ఎంబ్రాయిడరీ చేసుకొండి కొత్తచీరల్లా తయారౌతాయి.

❖❖❖❖❖

# ఉత్తరాలస్టాండు

-శ్రీదేవి పెయ్యేటి, హైద్రాబాద్



మన పాతరోజుల్లో ఉత్తరాలు రాసుకునే వాళ్ళం. బంధుమిత్రుల నించి వచ్చే ఉత్తరాలని ఎంతో ఆత్రుతగా చదువుకుని, ఆ తర్వాత ఆ ఉత్తరాలని తీగకు గుచ్చి ఓ మూల మేకుకి తగిలించేవాళ్ళం. గుర్తుందా? అదే 'ఉత్తరాల స్టాండు'

*******************

స్రవంతి నెల్లాళ్ళనించి ఇల్లు సర్దుతోంది. ఎప్పట్నించో అడుగుతున్నారు అపార్ట్ మెంట్ కడతామని. అందులో రెండు ఫ్లాట్లు వీళ్ళకిచ్చేలాగా. అత్తగారున్ననాళ్ళు ఇవ్వనివ్వలేదు. ఆవిడ పోయి ఏడాదైంది. సంవత్సరీకాలూ అయిపోయాయి కాబట్టి ఇక అపార్ట్ మెంటు కివ్వాలని నిర్ణయించుకుంది. కొడుకు, కూతురు వివాహాలయి అమెరికాలో వుంటున్నారు. ఎలాగూ పాతబడిపోయింది ఇల్లు. 500 గజాల స్థలం వున్న ఆ ఇల్లు బాగుచేయించాలన్నా తలకు మించిన భారమే. అంత పెద్ద ఇంట్లో ఒంటరిగా వుండాలన్నా కష్టమే. పనీ ఎక్కువ. పిల్లలు కూడా అపార్టుమెంటుకిచ్చేయమన్నారు. అందుకే నెల్లాళ్ళకల్లా ఇల్లు అప్పచెప్పాలి. అపార్టుమెంటు అయేదాకా వేరే అద్దె ఇల్లు చూసింది. అన్నీ తనొక్కతే చేసుకోవాలి. భర్త ఆర్.ఎమ్.పి.డాక్టర్. ఆయనగారి వల్ల వీసమెత్తు సాయం లేదు. భార్యమీద అరిచి, అరిచి, అరిచి ఒకసారి కోపంతో కాఫీ వేడిగా లేదని విసిరికొట్టాడు. ఆ కాఫీ స్రవంతి మొహం మీద, చీర మీద పడింది. గట్టిగా అరుస్తూ, అరుస్తూ అప్పట్నించీ మాట పడిపోయింది. భర్తగారు ఇంక అరవలేడని సంతోషించాలో...... మాట పడిపోయిందని బాధ పడాలో ఎటూ జీర్ణించుకోలేక పోయింది స్రవంతి.

ఆలోచిస్తూ తండ్రి పోయాక ఆయన గుర్తుగా ఆయన వాడుకునే ట్రంకు పెట్టె తెచ్చుకుంది. తెచ్చింది గాని అదెప్పుడూ తెరవడం కుదరలేదు దాని తాళం కనబడక. అందులో నాన్నగారి విస్త్రీ చేసిన ఫేంట్లు, వాడకానికి అవసరమయే డబ్బు వుండేవి. నాన్నగారు బేంకులో మేనేజరుగా చేసేవారు. అందుకని ఆయన దగ్గర కొత్త రూపాయల నోట్లు, పదిరూపాయల, వందరూపాయల నోట్లు వుండేవి. పాలవాళ్ళకీ, పనివాళ్ళకి కొత్త నోట్లే ఇచ్చేవారు. వాళ్ళు ఆ నోట్లు చూసి మురిసి పోయేవారు. ముఖ్యమైన ఉత్తరాలు కూడా జాగ్రత్తగా దాచేవారు.

దాని తాళం కనబడక పోయినా వేరే తాళంచెవులతో ఆ పెట్టె తెరిచింది.

నాన్నగారు వేసుకునే విస్త్రీ మడతల దుస్తులు, కొన్ని కొత్త పంచెలు కూడా అలానే వున్నాయి. ఒక బేగ్‌లో కొత్తరూపాయల నోట్ల కట్టలు, వంద రపాయల నోట్ల కట్టలు అలానే వున్నాయి. కాని ఏం లాభం? ఆ నోట్లు చెల్లవు. మూడేళ్ళక్రితం ప్రభుత్వంవారు పాతనోట్లు రద్దు చేసారు. అయ్యో, కాస్త ముందరన్నా ఆ పెట్టె తెరిచి ఆ పాతనోట్లన్నీ మార్చేయాల్సింది. అదే టైములో డబ్బు చాలా అవసరం వచ్చింది.

భర్తకి హార్ట్ ఎటాక్ వస్తే ఆస్పత్రిలో చేర్పించింది. ఆస్పత్రి ఖర్చు చాలానే అయింది. బ్యాంకులో గోల్డ్ లోన్ పెట్టాల్సి వచ్చింది. అప్పుడే ఈ పెట్టె తెరిచివుంటే అవసరానికన్నా ఆదుకునేది. ఇప్పుడు టైమూ దాటిపోయింది. ఉసూరుమంది. బోలెడు డబ్బు చిత్తుకాగితాల్లా పడేయాల్సిందే కదా?
వెతుకుతూంటే కొన్ని ఫొటోల కట్ట కనబడింది. విప్పిచూస్తే నాన్నగారు ఆఫీసువాళ్ళతో కలిసి తీయించుకున్న ఫొటో, ఇంకోటి ఫేమిలీ ఫొటో, అమ్మమ్మ తాతగారు, అమ్మ, నాన్నగారు, ఇద్దరు పిన్నిలు, మామయ్యలు, తన చెల్లెళ్ళు, తమ్ముళ్ళు, చిన్నపిల్లలు, అందరూ కలిసి దిగిన ఫొటో కనిపించాయి. అప్పటి పాతకాలపు నగ 'కంటె', నడుముకు వడ్డాణం ఉన్నాయి. బ్లాక్ అండ్ వైట్ ఫొటో మూలానేమో, పాత సినిమా యాక్టర్లలా వున్నారు. ఎంత బాగున్నారో! నిండుగా బొట్టు, కాటుక, పట్టుచీర కట్టుకుని వుంది అమ్మమ్మ.
పూర్వం రోజుల్లో ఫొటో తీయించుకోవాలనుకుంటే, నీరెండ రావాలి. మొహాలు ఫ్రెష్ గా వుండాలి. అప్పుడు ఫొటోగ్రాఫర్ వచ్చి, నల్లటి ముసుగేసుకుని స్టాండ్ కెమేరాతో ఫోటో తియ్యడానికి గంటలు గంటలు పట్టేది. మళ్ళీ ఆ ఫోటో కడిగి ఆరబెట్టి ఇచ్చేసరికి వారం రోజులు పట్టేది. ఇప్పుడలా కాదు. వెంటనే అలా తీసేయడం, ఇలా వచ్చేయడం. సెకన్లలో ఏ దేశంలో వున్నా ఇంటర్నెట్ ద్వారా అవతలివాళ్ళకి ఫోటోలు పంపెయ్యడం జరుగుతోంది.
ఆలోచిస్తూ మరో ఫొటో తీసింది. అబ్బో, అది తన ఎస్.ఎస్.ఎల్.సి.లో తీయించుకున్న క్లాస్ ఫొటో. అందర్నీ చూసింది. అప్పుడు తనెంత సన్నగా అందంగా వుందో! ఛీ! అంత అందం ఇప్పుడేమై పోయింది? ఆ తుమ్మెద రెక్కల్లాంటి వంకీజుట్టు, సన్నని నడుము, అందరూ ఎంతందంగా వున్నావే స్రవంతీ! అంటూ పొగిడేసేవారు. ఇప్పుడా సన్నని నడుమూ లేదు, అందమైన జుట్టూ లేదు. భారీగా శరీరం పెరిగిపోయింది. ఛ! రోజులింత దారుణంగా ఎందుకు మారిపోయాయో.........? అందమైన బాల్యం కరిగిపోయింది. అమ్మమ్మ, తాతగార్లు, అమ్మ, నాన్నగార్ల నీడన ఎప్పటికీ చిన్నపిల్లగా వుండిపోతానేమో అనుకుంది గాని, అమ్మమ్మ, బామ్మ, తాతగార్లని పోగొట్టుకుని, తానూ అమ్మ, అమ్మమ్మ, బామ్మ స్థాయికి చేరి అంత పెద్దయిపోతానని ఎప్పుడూ అనుకోలేదు.
మనసు బాధగా మూలిగింది. గతాన్ని పక్కకి పెట్టి, యథాస్థితికి వచ్చి, ఇంకో మూల వెతుకుతూంటే, ఇనపతీగేదో చేతికి గుచ్చుకున్నట్టయి, ఏమిటా అని తీసిచూస్తే, 'ఉత్తరాలస్టాండు'! ఈ ఉత్తరాలస్టాండు పెట్టెలో ఎందుకుంది? గుమ్మానికి మూల మేకుకి పెట్టివుండేది. ఉత్తరాలు చదివి అందులో గుచ్చేవారు. చెడ్డవార్తలున్న ఉత్తరాలైతే చదివిన వెంటనే చింపేసి పడేసేవారు. బంధుమిత్రుల నించి క్షేమసమాచారాలతో వచ్చే ఆ ఉత్తరాలు చదువుతుంటే ఎంతో ఆనందం కలిగేది.
ఇప్పటి రోజుల్లో క్రమేపీ ఉత్తరాలు కనుమరుగై పోయి వాటి స్థానే ఇంటర్నెట్ లు, ఫేస్ బుక్,సెల్ ఫోన్లు, ఇలా ఎన్నో ప్రసారసాధనాలు వచ్చేసాయి. వాటిద్వారా కొన్ని సెకన్లలోనే వార్తలు ప్రపంచంలోని ఏమూలలో వున్నవారికైనా చేరిపోతున్నాయి.
ఆ రోజుల్లో రోజు పదకొండు గంటలకల్లా పోస్ట్ మేన్ కోసం అందరూ ఎదురు చూసేవారు. అతను ఇంట్లో అందరికీ ముఖ్యమైన వ్యక్తి. అతను 'పోస్ట్!' అని అరుస్తూ ఇచ్చే ఉత్తరాల కోసం ఎదురు చూస్తూ ఆ రోజు ఉత్తరాలు రాకపోతే తీవ్రమైన నిరాశ కలిగేది అందరికీ. ఉత్తరాలొస్తే మటుకు పిల్లలందరూ ఆ ఉత్తరం పోటీపడి అందుకునేవారు. ఆ అందుకోవడంలో ఒక్కోసారి పెద్దవాళ్ళు చదవకుండానే చిరిగిపోతుండేవి. పిల్లలని చీవాట్లేసి, ఆ చిరిగిన ముక్కలని జతచేసి ఎలాగో చదువుకునే వారు. ఒక్కోసారి అయిదారుత్తరాలు, లేక ఇన్‌లాండ్ కవర్లూ వస్తుండేవి.

మేకుకి వుండే ఉత్తరాలస్టాండు పెట్లో ఎందుకుందా అనుకుంటూ ఒక్కొక్క ఉత్తరమే తీసి చదవసాగింది. అన్నట్టు గుర్తుకొచ్చింది. మేకుకున్న పెద్ద ఉత్తరాలస్టాండు చెదపట్టి, ఉత్తరాలన్నీ చిల్లులు పడి పాడయిపోతే, పడేసి కొత్త స్టాండు కొని, మళ్ళీ చెదపట్టి పాడవకుండా నాన్నగారు పెట్లో పెట్టివుంటారు.

ఒక ఉత్తరం తీసి చదవసాగింది. ముత్యాలకోవతో రాసిన ఆ ఉత్తరం పెదనాన్నగారిది. (ఆమె నాన్నగారి పేరు కామేశ్వరరావు).

'చిరంజీవి కామేశ్వరరావుని దీవించి వ్రాయునది. ఉభయకుశలోపరి. చి.స్రవంతి గాడు, చి.భారతి గాడు, చి.చంద్రంబాబు ఎలా ఉన్నారు? వాళ్ళని తెల్లవారగట్టే లేపి చదివించు. చేతిరాత బాగుండాలి. రోజు కాపీలు దిద్దించు. చి.మరదలు భవానీ కులాసా అని తలుస్తాను. మీ వదినకి మొన్న జ్వరం వచ్చి తగ్గినది. వాళ్ళమ్మగారు వచ్చారు. మొన్ననే పథ్యం పెట్టారు. ఇంకా నీరసంగానే వుంది. డాక్టరు బ్రెడ్డు, పాలు ఇమ్మన్నారు. నీరసం తగ్గడానికి బార్లీ, గ్లూకోజువాటరు ఇమ్మన్నారు. జలుబుగా వుంటే కస్తూరి మాత్రలు వేస్తున్నాను. చి.రామకృష్ణ ఎస్.ఎస్.ఎల్.సి. పాసయాడు. చి.మహాలక్ష్మికి సంబంధాలు చూస్తున్నాము. ఒక సంబంధం నలుగుతోంది. అబ్బాయికి బాగా ఆస్తిపాస్తులు ఉన్నాయి. గవర్నమెంటు స్కూల్లో టీచరు. కొంచెం నలుపే అయినా పొలాలవీ వున్నాయి. సరే, ఆ వివరాలు తర్వాత రాస్తాను.

ఉంటాను. వెంటనే జాబు రాయి.'

అలా ఇంకొన్ని ఉత్తరాలు చదివింది. అన్నీ కార్డులే. క్షేమసమాచారాలు తప్ప పెద్ద విశేషాలేం లేవు. అప్పుడు తరుచు నమస్కారాలు పెట్టి, చిన్నవాళ్లయితే దీవెనలు పెట్టి, ఇక్కడంతా క్షేమం, అక్కడంతా క్షేమమని తలుస్తాను. పిల్లలు జాగ్రత్త. వాళ్ళని బాగా చదివించు. ....... ఇలానే వుండేవి ఉత్తరాలన్నీ. మరికొన్ని పొలాల విషయాలు వుండేవి.

అప్పటి రోజుల్లో ఫోన్ సౌకర్యం లేదు కనక ఉత్తరాల ద్వారానే విషయాలు తెలియపరిచే వారు. బంధువులు, కూతుళ్ళు, అల్లుళ్ళు వచ్చి కొన్నాళ్ళుండి, వెళ్ళిపోతుంటే వెంటనే ఉత్తరం రాయమనే వారు. ఉత్తరాలు రాకపోతే కంగారు పడేవారు. ఇంక ఎప్పుడన్నా టెలిగ్రాం వస్తే ఏ చెడువార్తోనని వణికిపోయేవారు.

ఈసారి ఇన్‌లాండ్ లెటర్ తీసింది. అది అత్తయ్య చేతిరాతలా వుందే అనుకుంటూ, ఆలోచిస్తూ చదవడం మొదలెట్టింది. ఎన్నాళ్ళనించో అత్తయ్య వాళ్ళతో సంబంధం లేదు, రాకపోకలూ లేవు. ఎందుకో కారణం తెలీదు. మధుబావ గుర్తొచ్చాడు. ఎక్కడున్నాడో అనుకుంటూ.....

'కామేశానికి దీవించి వ్రాయునది. శాంతక్కయ్య, మరదలు, జానకి, పిల్లలు స్రవంతి, కృష్ణ, జాహ్నవి కులాసా అని తలుస్తాను. అసలు విషయం ఏమంటే, స్రవంతి, నా కొడుకు మధు చిన్నప్పట్నించి ఒకే ఊళ్ళో వుండడం మూలాన కలిసి తిరిగా రు, ఆడుకున్నారు. స్రవంతిని నా కోడలుగా చేసుకుందామనుకున్నాను కదా? వాళ్ళు ఇష్టపడ్డారు. తరవాత మీ బావగారి ఉద్యోగరీత్యా బొంబాయి వెళ్ళిపోవలసి వచ్చింది. మధు కూడా ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఢిల్లీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నాడు. కొంతమంది ఫ్రెండ్స్ తో ఒక రూమ్ తీసుకుని వుంటున్నాడు. ఎన్నాళ్ళు ఒంటరిగా వుంటాడు? హోటల్ తిండి పడటల్లేదు. ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే నాకు బెంగ వుండదు. తరవాత వాడి చెల్లెలు మీనాక్షి ఇంకా చిన్నదే కాబట్టి పెళ్ళి తొందర లేదు. ఇప్పుడు ఫోర్త్ ఫారం చదువుతోంది. మా అత్తగారు చదివింది చాలు, ఆడపిల్లకంత చదువెందుకు? చదివి ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళేలాలా? మొగుడుకి ఉత్తరం ముక్క రాయడానికి, చాకలిపద్దు వేసుకోవడానికి ఈ చదువు చాలు. నే బతికుండగా దాని పెళ్ళి కూడా చేసెయ్యండి అంటోంది. మీ బావగారికి ఈ ఇంటివిషయాలేమీ పట్టవు. ఆయనకి ఉద్యోగమే మొదటి భార్య. నేను రెండో భార్యని.'

ఆ మాటకి చదువుతూ నవ్వుకుంది స్రవంతి. కాని బాధ పడింది. మరి అప్పుడైతే తనని బావకెందుకు చేసుకోలేదు? హాయిగా వుండేది కదా తన జీవితం? తరవాత చదివింది.

'వెంటనే ఏ సంగతీ ఉత్తరం రాయి. త్వరలో ముహూర్తాలు పెట్టుకుందాము.

ఇట్లు,

అక్కయ్య శాంతమ్మ.'

హడావిడిగా అత్తయ్య రాసిన ఉత్తరాలన్నీ చదివింది.

'అన్నయ్యకి నమస్కారములు. సడన్‌గా మా అత్తగారు పోయారని రాస్తే చూడటానికి రాలేదు సరికదా, కనీసం ఓ సానుభూతి ఉత్తరం కూడా నీ నుంచి రాలేదు.'

కోపంగా రాసినట్టుంది.

మళ్ళీ ఇంకోటి చదివింది. నా పెళ్ళికి పసుపు కుంకుమ కింద నాన్నగారిచ్చిన రెండెకరాల పొలం నించి ధాన్యం బాపతు డబ్బు పంపటల్లేదు. కారణం తెలీదు.

ఇట్లు,

శాంతక్కయ్య.'

ఇదీ కోపంగా రాసిందే. మరో ఉత్తరం....

'నువు మనసులో ఏం పెట్టుకున్నావో? చి.మధుకి, చి.స్రవంతికి త్వరలో పెళ్ళి చెయ్యాలని అదివరలో నీకు ఇన్లాండ్ కవరు రాసాను. నువు దానికి సమాధానం రాయలేదు. ఇక్కడే వాడికి వేరే సంబంధం చూసాము. పిల్ల చాలా బాగుంటుంది. పదివేలు కట్నం, లాంఛనాలు, వెండి కంచం, వెండి మరచెంబు ఇస్తామన్నారు. హోటల్ తిండి పడక వాడి ఆరోగ్యం పాడవుతోంది. శుభలేఖ పంపుతున్నాను. వచ్చి నాలుగక్షింతలు వెయ్యి.'

స్రవంతి ఆ ఉత్తరం చదువుతూ వలవలా ఏడ్చేసింది. గుండెల్లో బాధ. మరి తను ఇష్టపడ్డ మధుబావకిచ్చి చెయ్యకుండా ఈ పిచ్చాడికెందుకు కట్టబెట్టి తన బతుకు నాశనం చేసారు?

కోపంతో ఏడుస్తూ తల్లికి ఫోన్ చేసింది. అప్పుడు రాత్రి పన్నెండవుతోంది. తల్లి పడుకునుంటుంది. ఐనా ఆపలేదు. రింగవుతోంది. నిద్రమత్తు లోనే తల్లి కంగారుగా అడిగింది, 'ఏమిటే ఏడుస్తున్నావు? మీ ఆయనకేమయినా అయిందా?'

'ఆయనకేం బాగానే వున్నారు. నేనే ఇంకా ఎందుకు బతికున్నానా అని ఏడుస్తున్నాను.'

'ఏమయిందే నీకు? ముందా ఏడుపాపి విషయం ఏమిటో చెప్పు.'

'ఆపుతా గాని, ముందర నే అడిగిన దానికి సమాధానం చెప్పు. నన్ను మధుబావకిచ్చి పెళ్ళెందుకు చెయ్యలేదు? అందరికీ తెలిసున్నదే కదా, బావ, నేను ఇష్టపడ్డామని? నన్నీ సోంబేరిగాడికిచ్చి ఎందుకు పెళ్ళి చేసారు?'

'తప్పే. మొగుడ్నలా అనచ్చా సోంబేరిగాడని? మొగుడంటే దేముడు. లెంపలేసుకో......'

'ఆహా....... హా...... హా.......! మొగుడు దేముడు, అత్తగారు దేవత, ఆడబడుచులు నీకు బంగారు తల్లులు. వీళ్ళందరికీ సేవలు చేసీ, చేసీ నా నడుం పడిపోయింది. అత్తగారింటికి పంపేటప్పుడు ఏం నీతులు చెప్పావు నాకు? మొగుడు తిట్టినా, కొట్టినా ఏమనకుండా పడుండాలి. మొగుడే దేముడు. అత్తగారికి కాళ్ళు ఒత్తాలి. అడపడుచుల్ని ప్రేమగా, గౌరవంగా చూడాలి అంటూ నా బుర్రలో నూరిపోసావు. నువ్వు చెప్పినట్లే అలాగే ప్రవర్తించాను. కానీ వాళ్ళు ఒక్కళ్ళు కూడా నామీద ప్రేమ చూపించలేదు. నన్ను పనిమనిషి కన్నా హీనంగా చూసి, అడ్డమైన చాకిరీలు చేయించుకున్నారు. ఒక మరమనిషిలా అయిపోయాను. ఆఖరికి నాపిల్లల ఆలనా పాలనా కూడా చూసుకోలేక పోయాను. అలాంటి వాళ్ళమీద నాకెందుకు ప్రేమ వుంటుంది?'

'నీ పిల్లల పెళ్ళిళ్ళయిపోయాయి. రేపో మాపో వాళ్ళకి పిల్లలు పుట్టి అమ్మమ్మవవుతావు. ఇన్నేళ్ళయాక ఈ సాధింపులేమిటే? బావతో పెళ్ళెందుకు చెయ్యలేదనడుగుతావేమిటి? తప్పు కూడాను.'

'తప్పొప్పులు తరవాత నిర్ణయించుకుందాం. బావతో పెళ్ళెందుకు చెయ్యలేదో నే అడిగిన దానికి సమాధానం చెప్పు. నాన్నగారి పెట్టెలో ఉత్తరాల స్టాండు కనబడింది. అత్తయ్య రాసిన ఉత్తరాలు చూసాను. త్వరలో ముహూర్తాలు పెట్టించి పెళ్ళి చెయ్యాలని, హోటలు తిండి బావకి పడటల్లేదని ఆ ఉత్తరం సారాంశం. ఆవిడ రాసిన ఉత్తరాలే చూసాను. మరి మీరేం సమాధానం రాసారు అత్తయ్యకి?'

'ఒంటిగంటవుతోంది. రేపు చెబుతాలే. నిద్రొస్తోంది.'

'నాకు నిద్ర పట్టదు. ఇప్పుడే చెప్పు.'

'సరే, చెబుతాను. మేమేం బావతో సంబంధం వదులుకోవాలనుకోలేదు. చేద్దామనే అనుకున్నాం. ముహూర్తాలు పెడదామనే అనుకున్నాం. పురోహితుడ్ని కూడా పిలిచి ముహూర్తాలు పెట్టించాం. మీ అత్తయ్యకి ఉత్తరం రాసాం కూడా. కానీ ఎన్నాళ్ళకీ సమాధానం రాలేదు. నువు చదివిన ఉత్తరం లేటుగా అందింది మాకు. అప్పటికే నీకూ పెళ్ళి కుదిరిపోయింది. అలాగే మేం రాసిన ఉత్తరం కూడా వాళ్ళకి లేటుగా అందివుంటుంది. అన్నట్టు అప్పట్లో ప్రత్యేకాంధ్ర గొడవలు జరిగాయి. అందుమూలాన నెల వరకు బంధువుల నించి ఉత్తరాలు గాని, రాకపోకలు గాని లేవు. ఈలోగా ఆరోగ్యం బాగాలేక, తను బతికుండగానే నీకు త్వరగా పెళ్ళి చెయ్యమని మీ బామ్మ తొందర పెట్టింది, అబ్బాయి డాక్టరు, ఆస్తిపాస్తులున్నాయి. మన పిల్ల సుఖపడుతుందంటూ. మన ఇంట పౌరోహిత్యం చేసే రామశాస్త్రి గారే ఈ సంబంధం చూసారు. నువ్వూ చెప్పావుగా అబ్బాయి నచ్చాడని? ఇన్నేళ్ళయాక తిట్టిపోస్తావేమిటీ?'

'ఆయన గారు ఏ డాక్టరో తెలుసుకోవద్దా? ఆర్.ఎమ్.పి. అంటే అదో పెద్ద డాక్టరు అనుకున్నారు. అది కూడా తెలీదు. ఆయన ఓ ముక్కోపి. ఏనాడన్నా సుఖపడ్డానా? నరకం అనుభవించాను. ఆడపిల్ల అనగానే ఎవడికో ఒకడికి కట్టపెట్టేద్దామని చూస్తారు. మరిప్పుడు బావ ఎక్కడున్నాడు?'

'తెలీదు. ఆవిడకి పసుపు కుంకుమల కింద ఇచ్చిన పొలం మీద డబ్బు పంపటల్లేదని నాన్నగారి మీద కోపం వచ్చింది. కాని నాన్నగారు ఆ బాధ్యతని బాబాయికప్పగించారు. అతడేమో ఆవిడకి పంపటల్లేదు. కాని ఆమెకి నాన్నగారి మీదే కోపం. ఆడపిల్ల సొమ్ము వాడుకుంటారా అని. అందుకే రాకపోకలు, మాటలూ లేవు. సరే. నాకు నిద్ర వస్తోంది.. పడుకుంటా. నన్ను విసిగించక పెట్టేయ్ ఫోను.'

ఈ లోగా అమెరికా నించి కూతురు రేఖ ఫోన్ చేసింది, ' అమ్మా! ఇవాళ ఇంట్లో ఫంక్షనుంది. గుత్తివంకాయ కూర ఎలా చెయ్యాలో చెప్పంటూ. వాళ్ళకిప్పుడు పగలు. గుత్తివంకాయ కూరెలా చెయ్యాలో చెప్పి, నిద్ర పట్టక ఇంటర్నెట్ ఆన్ చేసింది. ఫేస్‌బుక్‌లో ఎవరో పోస్ట్ పెట్టారు పాత జ్ఞాపకాలంటూ. అప్పుడు బంధు మిత్రుల నించి వచ్చే ఉత్తరాల గురించి అందరూ అప్పటి జ్ఞాపకాలు, అనుభవాలు రాస్తున్నారు. అప్పుడు తను పెట్టె వెతుకుతూంటే కొత్తనోట్ల కట్టలు కనపడ్డాయని, కాని ఇప్పుడవి మారవని, అందులో ఉత్తరాలస్టాండు కనపడిందని, అందులో తను చదివిన ఉత్తరాలు వేళకందక తన వివాహం విషయంలో జరిగిన పొరబాటు గురించి రాసి 'ఉత్తరాల స్టాండ్' ఫోటో పెట్టింది.

దానికందరూ వరస పెట్టి కామెంట్లు, లైకులు. అందరూ బావతో పెళ్ళి కాలేదని తెగ బాధ పడిపోయారు. తనకొచ్చిన వందల కొద్దీ కామెంట్లు చూసుకుని, ఓ వెర్రి నవ్వోటి నవ్వుకుంది స్రవంతి.

❖❖❖❖❖

# మాతృత్వం శాపమా?...

-శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్

కొరోనా వచ్చిన దగ్గర నుండి అందరూ, చాలా వరకు, ఇంటి నుండే పని చేస్తున్నారు... అందులో భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులయితే రకరకాల సమస్యలతో సతమతమవుతుంటారు... అసలే నెలతప్పిన పిల్ల రమ్య... ఇంట్లో పని, ఆఫీస్ పని, పాపం ఒక్కతే చేసుకోలేక పోతోంది... భర్త తనకు ఏరకంగా సహాయం చేయడు... అతను పెరిగిన వాతావరణం అలాంటిది...

ఆ సమయంలోనే అపార్ట్మెంట్లో, అందులోను ప్రక్క ఫ్లాట్లో ఎవరికో కొరోనా వచ్చిందట... ఇలాంటి వాటికి రవి బాగా భయపడతాడు... తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు, గారాబంగా పెరిగాడు... చిన్నప్పటి నుండి అతను ఏది కోరినా వెంటనే ఇచ్చేవారు. అలా అతని జీవితం ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది... కష్టమంటే తెలియదు... ఎక్కడా కుదురుగా ఉద్యోగం చేయడు... ఇప్పటికే ఎన్నో ఉద్యోగాలు మారి ప్రస్తుత కంపెనిలో పని చేస్తున్నాడు... ఇదయినా కుదురుగా చేస్తే బాగు అని రోజూ దేముడికి దండం పెట్టుకుంటూవుంటుంది...

అదిగో అలాంటి క్లిష్ట పరిస్థితులలో రవి బాంబు పేల్చాడు...

"రమ్యా! ఎలాగూ ఇంటి నుండే కదా పని... నేను మా అమ్మ నాన్నల దగ్గరకు వెళ్తాను... ఇక్కడ వుంటే కొరోనా వచ్చే అవకాశం ఎక్కువ... వస్తే కష్టం"...

ఆ కష్టం తనకు మాత్రమే అన్నట్లుగా ఉంది అతని దోరణి... భార్యకు నెల తప్పింది... ఒక్కతే వుంటుంది, తన అవసరముంటుంది అన్న ఆలోచనే లేదు...

రమ్యకు ఏం మాట్లాడలో తోచలేదు... ఎక్కడో దూరంగా ఉన్న తల్లిదండ్రుల దగ్గరకు వెళ్తాడట... మరి తన సంగతేంటి?.. ఇలా ఆలోచనల్లో తల మున్కలయి వుండగానే, తన బట్టలు సదురుకొని, లాప్ టాప్ తీసుకుని "బై రమ్య... టేక్ కేర్" అంటూ కారు తీసుకుని వెళ్ళి పోయాడు రవి...

ఏమి చేయాలో తోచని స్థితిలో అచేతనంగా అలా కూలబడి పోయింది... తనవైపు నుండి ఏ రకమయిన సహాయం లేదు... అఖరికి తను తీసుకెళ్ళిన కారు కూడా అతనిది కాదు... ప్రతి నెల ఇ ఎమ్ ఐ కట్టుకుంటూ తను కొన్న కారు... ఏనాడు తనని కారులో ఆఫీసు దగ్గర దింపలేదు (తన ఆఫీసు దారిలోనే ఉన్నా, తను బ్రతిమాలినా కాని)... తన తిప్పలు తనే పడేది, ఆటోలోనో , సిటీ బస్ లోనో వెళ్తూ... సరే కొరోనా పుణ్యామని ఇంట్లోనే వుంటున్నది... తన బాధ ఎవరికి చెప్పుకోవాలి?..
"అనాదిగా జరుగుతున్న అన్యాయం ఇదేనా" అని పాడుకోవాలా... స్త్రీ తన మాతృత్వం వద్దనుకుంటే సృష్టి ఆగిపోతుందా... అప్పుడు మగవాడి ఆటలు సాగుతాయా?, ఏమో ఇవన్నీ పుస్తకాలకే పరిమితమవుతున్నాయి, కాలం మారుతున్నా కూడా...

తను కూడా లాప్ టాప్ ముందేసుకుని పని చేసుకుంటూ కూర్చుంది... ఈ వాంతుల వలన ఏమీ తినబుద్దవటం లేదు... ఊరికే పడుకోవాలనిపిస్తోంది...

మధ్యాహ్నం అవగానే ఎప్పటిలాగా అమ్మ ఫోన్ చేసింది... దూరంగా ఉన్న అమ్మను ఇబ్బంది పెట్టలేక రమ్య చెప్పలేక చెప్పలేక చెప్పింది.. విషయం తెలుసుకుని వెంటనే బయలుదేరి వచ్చింది అమ్మ...

ఆడపిల్లల తల్లులకు ఎప్పుడూ భాద్యతలేనా... ఎప్పుడూ తమ గురించి మరిచిపోయి, వారి సంసారం, వారి అవసరాలు అన్నీ మరిచి పోయి, అవన్నీ వదులుకొని కూతుర్ల కోసం పరుగెత్తాలి... అటు సంసార భాద్యతలూ వదులుకోలేరు... కూతురు ఇబ్బంది పడుతుంటే చూస్తూ వుండలేరు... ప్రతివక్కరూ సంతానం విషయంలో ఎవరయితేనేం అంటారు, కానీ కొడుకు పెళ్ళయ్యే వరకూ పట్టించుకోని ఆ తల్లిదండ్రులు తర్వాత కొడుకుని కట్టడి చేస్తూ, వచ్చిన కోడల్ని పట్టించుకోరు...

రవి ఇలా వెళ్ళినందుకు అత్తగారు అతనిని ఏమైనా తప్పు పడుతుందా... ఊహూ... అలాంటిదేమీ వుండదు... పైగా తన కొడుకు ఒక్కడే బాగా కష్టపడుతున్నట్టు, అతనిని సమర్థిస్తూ లాలింపు చేస్తుంది... లేవలేని పిల్ల పరిస్థితి ఏమిటి అని అస్సలు ఆలోచించదు... ఒక ఆడపిల్ల మనసు ఎంత సున్నితంగా వుంటుందో ఎప్పటికి అర్థం చేసుకుంటారో... అతని తల్లిదండ్రులు అతనికి చెప్పరు... ఆ తల్లి కూడా ఒకప్పటి కోడలే కదా... పైగా తను కూడా ఉద్యోగస్తురాలే... ఈరోజుల్లో అమ్మాయిలు కూడా ఉద్యోగం చేస్తున్నారు... కానీ వారి సహచరులు  అత్త మామలు కూడా అర్థం చేసుకోవటంలేదు... ఆఖరికి ప్రయత్నం కూడా చేయటంలేదు...
చదువు, ఉద్యోగం నేటి ఆడవాళ్ళకు శాపమా?.. ఉద్యోగంలో ఎదగాలి అనుకునే ఆడవారికి ఇటువంటి పరిస్థితులు ప్రతిబంధకాలు కావా?..  తటస్థంగా ఎటూ తేల్చుకోలేక మూగగా రోదించింది రమ్య మనసు...

❖❖❖❖❖

## 2020 సంవత్సరానికి ఇక వీడ్కోలు చెప్పేద్దామా.....



# ధనుర్మాస వైశిష్ట్యము

-శ్రీమతి. లలిత రాంభట్ల, హైద్రాబాద్



మాసాల్లో మార్గశిరాన్ని నేనే అన్నాడు భగవద్గీతలో శ్రీకృష్ణుడు. మార్గశిరాన్ని విష్ణుమాసంగా భావిస్తారు. ఈ మాసంలో ప్రతినిత్యం తెల్లవారు ఝామున శ్రీహరిని శాస్త్ర బద్దంగా పూజించాలి, నివేదనలు సమర్పించాలి. ఇలా చేయడం వల్ల అంతులేని పుణ్యం వస్తుందని పాంచరాత్ర, వైఖానసాగమ శాస్త్రాలు, ఆదిత్య పురాణం, భాస్కరీయం, వాసిష్ఠ వచనం, నారాయణ సంహిత, తదితర గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఉత్తరాయణ పుణ్య కాలాన్ని వెంట తెచ్చేది ధనుర్మాసమే. దేవతలకు ఎంతో ఇష్టమైనది ఉత్తరాయణ పుణ్యకాలం ఈ ధనుర్మాసం చివరిలో వస్తుంది. ఇదే దేవతలకు బ్రాహ్మీ ముహూర్తం అంటే తెల్లవారుఝాము కాలంగా చెబుతారు, ధనుర్మాస వ్రతం ఆచరిస్తే చాలు దేవతానుగ్రహాన్ని తేలికగా పొందవచ్చని ధనుర్మాస పురాణం పేర్కొంటోంది.

ఈ మాస వ్రతం నెలరోజులపాటు సాగుతుంది. ప్రతీ నిత్యం సూర్యోదయానికి ముందే లేచి శ్రీహరిని షోడశోపచారాలతో పూజించి కట్టుపొంగలి, చక్కెర పొంగలి తదితర పదార్థాలను స్వామికి నివేదిస్తారు, అనంతరం దక్షిణ తాంబూలాదులను సమర్పించాలి. నెల రోజులూ క్షుర కర్మ చేయకూడదు, బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు ఇలా భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని పాటించిన వారికి ఇష్టసిద్ధి కలుగుతుంది. అగమ గ్రంథము స్పష్టం చేస్తున్నాయి, పూర్వం త్రేతా యుగంలో శ్రీ రామచంద్రుని సోదరుడు భరతుడు ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించాడు అలాగే ద్వాపరంలో ఈ వ్రతాన్ని (కాత్యాయని) గోపికలు చేసి సాక్షాత్తు శ్రీకృష్ణుడునే భర్తగా పొందినట్లు భాగవతం పేర్కొంటోంది.


ఈ మాసం వైష్ణవాలయాలలో ప్రత్యేకించి సుప్రభాతం బదులుగా **తిరుప్పావై** పాశురాలతో స్వామిని మేల్కొలుపుతారు. గోదాదేవి పాడిన పాశురాలు ముప్పై(30), రోజుకొకటి వినిపిస్తూ వైష్ణవాలయాల్లో స్వామిని నిద్ర మేల్కొలుపుతారు గోదాదేవి ఆండాళ్ అని చూడి కొడుత్త నచ్చియా (ముడిచిన మాలలను ఇచ్చేది) అని కూడా పిలుస్తారు. ఈ పదాలను సంస్కృతీకరించి శ్రీకృష్ణదేవరాయలు **ఆముక్తమాల్యద** అని గోదాదేవి చరిత్రను ప్రబంధరాజంగా రచించారు. భూదేవి అంశతో ఆండాళ్ తల్లి శ్రీవిల్లి పుత్తూర్ క్షేత్రంలో అయోనిజగా విష్ణుచిత్తులకు తులసివనంలో లభించింది.

ఆ మాధవుణ్ణే తన భర్తగా చేసుకోవాలని కలలు కంటుండేది. అందుకోసం దీక్షగా (**కాత్యాయనీ వ్రతం**) సిరినోము తిరుప్పావై అంటే **శ్రీ వ్రతం** అని అర్థం. ఈ వ్రతంలో పాటించాల్సిన నియమాలు గురించి ఆండాళ్ తల్లి స్వయంగా చెప్పింది తెల్లవారుఝామున లేచి స్నానం చేయాలి, తలలో పూలుముడుచుకోకూడదు, కాటుక పెట్టుకోకూడదు, ఆభరణాలు అలంకరించుకోరాదు, పాలు తాగకూడదు, నెయ్యి ఉపయోగించకూడదు, ఇవన్నీ కావ్యాల్లో అలక గృహాన్ని తలపిస్తాయి. పరమాత్మ పతిగా కావాలని నోము పట్టిన గోదాదేవి ఇలాంటి చర్యల ద్వారా నీ మీద నేను అలిగాను అనే సంకేతాన్ని ఆయనకు తెలియజేసింది. నేనెలా ఉంటే నీకు నచ్చుతానో అలా నన్ను దిద్దుకో అని చెబుతూ స్వామి కల్యాణ గుణాన్ని వర్ణిస్తూ తిరుప్పావై ప్రబంధాన్ని రచించి ఉపనిషత్తులు, వేదాలు, పురాణ ఇతిహాసాల సమాహారంగా ఈ తిరుప్పావైని రూపొందించింది.

పావై అంటే వ్రతం, తిరు అంటే శ్రీ అని అర్థం గోదాదేవి రోజుకో పాశురం పరిస్తూ 30 రోజులు 30 పాశురాలతో స్వామిని కీర్తించింది. దీని ఫలితంగా సాక్షాత్తు ఆ రంగనాథుడే ఆండాళ్ అంతరంగనాథుడయ్యాడు.

❖❖❖❖❖

## తెలుగింట ముంగిట ముగ్గే అందం



❖❖❖❖❖

# ఘంటసాల గుడి

**- కళాబ్రహ్మ, సేవామహాత్మ, శిరోమణి డా॥ వంశీ రామరాజు**



కొన్ని దశాబ్దాలనుంచి అమరగాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, పద్మశ్రీ పురస్కారగ్రహీత సద్గురు ఘంటసాల వెంకటేశ్వర్రావుగారితో వంశీసంస్థకు ఎనలేని అనుబంధం ఉంది. అంటే వారు నిర్యాణం చెందకముందు ఒక రకంగాను, పరమపదించాక మరొక రకంగాను వారితో అవినాభావసంబంధమున్న సంస్థ వంశీ. ఆ విశేషాలు మీకు తెలియజేసే ముందు క్లుప్తంగా మీకూ తెలిసిన విషయాలే అయినా మరలా మీతో పంచుకుంటాను.

4.12.1922లో కృష్ణాజిల్లాలోని గుడివాడ తాలూకా, చేటపల్లి గ్రామంలో రత్తమ్మ, సూర్యనారాయణ దంపతులకు జన్మించిన మన ఘంటసాలగారు అకుంఠితదీక్షతో అలుపెరుగని శ్రమ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో సంగీత సరస్వతికి ముద్దుబిడ్డగా ఎదిగి రాత్రింబగళ్ళు శ్రమిస్తూ దైవం ప్రసాదించిన తన అమృతగళంతో దేశం కోసం, ప్రజల కోసం, సమాజం కోసం హృదయపూర్వక సేవలందించిన మహోన్నత వ్యక్తి. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నా మనకు ఎన్నో మధురమైన గీతాలను అందించి గొప్ప గాయకుడుగా మన మధ్య ఈనాటికీ నిలిచే ఉన్నాడు.

ఆయన తన 51వ ఏట 11.2.1974లో చెన్నైలో పరమపదించారు. ఆయన సతీమణి సావిత్రమ్మగారు పరమసాధ్వి. మహాఇల్లాలు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్ళు. కీర్తిశేషులు విజయకుమార్, రత్నకుమార్, డా॥ శ్యామల, సుగుణ, శాంతి.






ఘంటసాల సావిత్రమ్మగారు రాసిన 'మా మామయ్య ఘంటసాల' అనే పుస్తకం చదివితే మనకెన్నో ఆయన జీవిత విశేషాలు తెలుస్తాయి. 11.2.2003న ఘంటసాలగారి ఫొటోతో కేంద్ర ప్రభుత్వం ఒక పోస్టల్ స్టాంప్ ముద్రించి విడుదల చేసి వారిని గౌరవించింది.

ఘంటసాలగారు సుమారు 675 తెలుగు చిత్రాల్లో పాడిన పాటల సంఖ్య సుమారు 2500. ఘంటసాలగారు శతాధిక చిత్రాలకు సంగీతదర్శకత్వం వహించారు. అంతేకాకుండా పరోపకారం, స్వంతఊరు, భక్త రఘునాథ్ చిత్రాలను నిర్మించారు. ఘంటసాలగారు జాతీయ యుద్ధనిధి సేకరణలో, వైద్యశాలల నిర్మాణంలో, కళాశాలల నిర్మాణంలో, పోలీసు సంక్షేమనిధి సేకరణలోను ఒక కళాకారుడిగా తన శక్తిని వినియోగించి సహాయపడటం ఆయన మానవతకు ఉదాహరణ. 1971లో విదేశీపర్యటన గావించిన తొలి సంగీత గాయకుడు. తన బృందంతో యూరప్, అమెరికా, కెనడా పర్యటించారు. 1969 నుంచి 1972 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థానగాయకులుగా నియమితులై సేవలందించారు. 1970లో పద్మశ్రీ అవార్డుతో భారతప్రభుత్వం గౌరవించింది. 1.2.1970లో ఎల్.బి. స్టేడియంలో ఘంటసాల రజతోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. వారిని సినీరంగానికి శ్రీ సముద్రాల రాఘవాచార్యులుగారు పరిచయం చేస్తే, ఆకాశవాణి ద్వారా పరిచయం చేసిన వ్యక్తి శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు.

1973లో భగవద్గీత గానం చేసిన ఘంటసాలగారు నేటికీ మనందరికీ భగవద్గీత అంటే ఘంటసాలగారిదే వినాలనిపించే అద్భుతరీతిలో గానం చేసి మనల్ని మంత్రముగ్ధులను చేశారంటే అతిశయోక్తి కాదు.

**ఘంటసాల-వంశీ**

ఘంటసాలగారిని నేను మొట్టమొదటిసారిగా హైదరాబాద్ షాపూర్‌వాడిలో నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారి కుమారుడు లెనిన్‌బాబు వివాహంలో ఆయన కచేరీ ఇస్తుండగా చూశాను. ఆయన్ను కలిశాను.

డా॥ సి. నారాయణరెడ్డిగారు రచించిన 'భలే మంచిరోజు' ఆయన పాడుతుంటే నాకది భలే మంచిరోజుగా అనుభూతి కలిగింది. ఘంటసాలగారితో నా పరిచయం అపూర్వఘట్టం. ఘంటసాలగారికి దివ్యాంగుల సేవ చాలా ఇష్టం. అలాంటివారిని చూసినప్పుడు ఆయన వారికి ఎంతో చేయాలి అనుకునేవారు. 1972లో వంశీ ఆర్ట్ థియేటర్స్ స్థాపించడం జరిగింది. 1974లో ఘంటలసాలగారు నిర్యాణం చెందిన తరవాత మొట్టమొదటిసారిగా నారాయణగూడా వైఎంసిఏ హాలులో అఖిల భారత స్థాయిలో ఘంటసాల పాటల పోటీలు నిర్వహించాను. పెద్ద ఎత్తున గాయనీగాయకులు పాల్గొన్నారు. ఘంటసాలగారి పాటల పోటీల నిర్వహణ అనంతరం వంశీసంస్థ ఖ్యాతి జాతీయస్థాయికి ఎదిగింది.

## 51 రోజుల ఘంటసాల స్వరరాగ మహాయాగం

1972లో ఆవిర్భవించిన వంశీ ఆర్ట్ థియేటర్స్ 11.2.2010 నుంచి 2.4.2010 వరకు 51 రోజులపాటు ప్రతిరోజూ 51 పాటలతో ఘంటసాల స్వరరాగ మహాయాగం నిర్వహించింది. అదే సందర్భంలో ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆవిర్భవించింది. అంతర్జాతీయంగా ఘంటసాలగారికి సంబంధించిన అతిపెద్ద కార్యక్రమం ఇదేనని చెప్పవచ్చు. 101 మంది గాయనీ గాయకులు అనుకున్న సంఖ్య కంటే 2800 పాటలకు పైగా గానం చేశారు. వంశీ కె. ధర్మారావు ఘంటసలగారి ఫోటో ప్రదర్శన పెట్టి, 'ఘంటసాల తెలుగు సినీగానవైభవం' అనే పుస్తకాన్ని ప్రచురించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డిగారు చైర్మన్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఘంటసాలగారి కుటుంబసభ్యులు, ప్రముఖ చలనచిత్ర నటీనటులు, నిర్మాతలు, సంగీత దర్శకులు, ప్రజాప్రతినిధులు, గాయనీ గాయకులు విచ్చేయడం, చివరి రోజున నటసమ్రాట్ డా॥ అక్కినేని, ఘంటసాల సావిత్రమ్మగారు వేదికపై ఉండటం, ఘంటసాలగారి అభిమానులకు ఆనందకరమైన సన్నివేశమయింది. డా॥ కె.వి. రావు, శ్రీ విన్నకోట మురళీకృష్ణ రూపకల్పన చేశారు. వంశీ కె. ధర్మారావు కన్వీనర్‌గా వ్యవహరించారు. చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో అధ్యక్షులు డా॥ కళా వేంకటదీక్షితులుగారు మరియు ప్రవాసభారతీయుల సహకారంతో జరిగిన ఈ అపూర్వ కార్యక్రమం వంశీసంస్థ కార్యక్రమాల్లో మైలురాయి. విశేషంగా జనాన్ని ఆకర్షించిన ఘంటసాల స్వరరాగ మహాయాగం 51 రోజులు త్యాగరాయ గానసభలోనే మా ఆవిడ డా॥ తెన్నేటి సుధ ఇంటినుంచి అన్నం తెచ్చిపెట్టేది. త్యాగరాయగానసభకు 51 రోజులకు కట్టవలసిన అద్దె ఘంటసాల అభిమానులే సమకూర్చారు. వంశీ`బర్కిలీ అవార్డ్స్‌లో ఎంతోమంది లబ్ధప్రతిష్ఠులైన సినీ, సంగీత దర్శకులను (ఓ.పి. నయ్యర్ లాంటివారికి కూడా), గాయనీ గాయకులను ఘంటసాల స్వర్ణపతకాలతో సత్కరించడం జరిగింది.





ఘంటసాల గుడిలో పుష్పాభిషేకం నిర్వహించిన ఘంటసాల పుత్రిక శ్యామలను సత్కరిస్తున్న వంశీరామరాజు,
బేబీ శ్రీఅభిజ్ఞ, గీతాంజలి, వినోద్‌బాబు,చంద్రతేజ, శ్రీదేవి, డా.కె.వి.రావు, శైలజారాణి

## విదేశాలలో ఘంటసాల ఆరాధనోత్సవాలు

వంశీసంస్థ దివ్యాంగుల కోసం 1988లో వేగేశ్న ఫౌండేషన్ పేరుతో ఒక సేవాసంస్థను ప్రారంభించింది. దివ్యాంగ చిన్నారులకు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్య, వైద్య, వసతి, భోజన, అన్ని రకాల సదుపాయాలు కల్పించి, దివ్యాంగులను సకలాంగులుగా మార్చడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. అనుకున్న దాతలు సహకరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రోజుల్లో అమెరికా దేశంలో ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించి నిధులు సేకరించి, దివ్యాంగులకు సేవ చేయాలని అనిపించడం, నాకెంతో ఆప్తులు, ప్రముఖ రచయిత, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకులు డా॥ వంగూరి చిట్టెన్‌రాజుగారిని సంప్రదించడం, వారు దానికి అంగీకరించి ఘంటసాల ఆరాధనోత్సవాల కార్యక్రమాలకు పూర్తి బాధ్యత వహించడం నేనెప్పటికీ మరువలేను. 2007 నుంచి 2019 వరకూ అమెరికాలోని పలు ప్రాంతాలలో ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నాము. ఎంతోమంది దేశ విదేశాల గాయనీగాయకులకు పాడే అవకాశం ఇవ్వగలుగుతున్నాము. ఈ కార్యక్రమాల ద్వారా వచ్చే నిధుల ద్వారా 2007 నుంచి ఇప్పటివరకు దివ్యాంగుల సేవకు అంతరాయం కలగలేదు. అంటే ఘంటసాలగారి పాట మా సేవాసంస్థకు ప్రధాన పోషకురాలన్నమాట! నిరంతరం ఘంటసాలగారి పాట దేశవిదేశాలలో చిరస్థాయిగా నిలిచిపోవాలన్న తపన నాది.

## ఘంటసాల గుడి



1974 నుంచి సద్గురు ఘంటసాల పాటతో వంశీసంస్థ పేరుప్రఖ్యాతులు పొందింది. విదేశాలలో ఘంటసాల ఆరాధనోత్సవాలతో ఎంతోమంది దివ్యాంగులకు చేయూతనివ్వడం జరుగుతున్నది. ఎంతోమంది ఎన్నో చోట్ల ఘంటసాలగారి విగ్రహాలు పెట్టారు. ఘంటసాలగారంటే ప్రాణం పెట్టే డా॥ కె.వి. రావు ఎక్కడెక్కడ ఘంటసాల విగ్రహాలున్నాయో (40కి పైగా) చెప్తుంటారు.

నాకు ఘంటసాలగారి మ్యూజియం కట్టాలనిపించింది. అయితే ప్రైవేటు వ్యక్తులు మ్యూజియమ్స్ నిర్మించకూడదని మేము ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ రిజిష్టర్ చేసినప్పుడు తెలిసింది. అప్పుడు మేనేజింగ్ ట్రస్టీ ప్రభూజీ ఈ విషయం చెప్పారు. నేను చాలా ఆలోచనలో పడ్డాను. దిగులు చెందాను. ఘంటసాలగారి 51 రోజుల కార్యక్రమం చేసినప్పుడు లిమ్కా రికార్డు కూడా వచ్చింది. ఎలాగైనా 144 గంటలు ఘంటసాలగారి పాటలతో కార్యక్రమం చేసి గిన్నీస్ బుక్ రికార్డు సంపాదించాలనుకుని గిన్నీస్‌వారి అనుమతి కూడా తీసుకున్నాను. కానీ హైదరాబాద్‌లో 144 గంటలు థియేటర్ దొరకక ప్రస్తుతం విరమించుకున్నాను. కనీసం ఘంటసాలగారికి అన్ని దేవాలయాలలాగా ఒక దేవాలయం నిర్మిస్తే ఎట్లా ఉంటుందన్న ఆలోచన కలిగింది. డా॥ కె.వి. రావుగారితో ఈ విషయం ప్రస్తావించాను. వారి సూచన మేరకు ఘంటసాలగారి విగ్రహం చేయించడానికి సన్నద్ధమైనాను. నాకెందుకో ఆ శిల్పి ప్రాథమిక దశలో చేసిన ఘంటసాలగారి విగ్రహం నచ్చలేదు. అప్పుడు విగ్రహం తయారుచేసే ప్రాంతానికి ఘంటసాలగారి కుమార్తె శ్రీమతి సుగుణగారిని తీసుకువెళ్ళడం జరిగింది. ఆమె 6 గంటలపాటు కదలకుండా తమ తండ్రిగారిని తనలో చూసి విగ్రహ రూపురేఖలు సరిచేయమని శిల్పిని కోరారు. అదొక అద్భుత దృశ్యం. తన కుమార్తెలో ఘంటసాలగారు ప్రవేశించి విగ్రహం ఏ విధంగా ఉండాలో శిల్పిచేత తయారుచేయించుకున్నారేమోనని నాకిప్పటికీ అనిపిస్తుంది.

విగ్రహప్రతిష్ఠను శ్రీమదభినవోద్దండ శ్రీశ్రీశ్రీ విద్యానృసింహభారతీస్వామి పీఠాధిపతులు పుష్పగిరిపీఠం మహాసంస్థానంవారు చేశారు. లోగడ స్వాములవారికి ఘంటసాలగారితో అనుబంధం ఉంది. ఘంటసాలగారిని ఇంతకుముందు ‘గాయక సార్వభౌమ’ బిరుదుతో స్వాములవారు సత్కరించి ఉన్నారు. ఎన్నో సందర్భాలలో ఘంటసాలగారు పుష్పగిరి పీఠానికి సహకరించారని స్వాములవారు ఎన్నో విశేషాలు తమ ప్రవచనంలో వెల్లడించారు. 51 రోజులు జరిగిన ఒక కార్యక్రమంలో స్వాములవారు ఘంటసాలగారి మానవత్వకోణాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. “సినిమా సంస్కృతి అంటని ‘కలువ’ ఘంటసాల’ అన్నారు. ఘంటసాల చివరిదశలో విజయా ఆస్పత్రికి వెళ్ళి మగతలో ఉన్న ఘంటసాలను పలకరిస్తే అతికష్టం మీద ‘నమస్కారం’ అంటూ కళ్ళల్లో నీరు కారుతుండగానే మళ్ళీ మగతలోకి జారిపోవడం, ఆ తరవాత రెండు గంటలకు ‘శరీరత్యాగం చేశారని తెలిసినప్పుడు యతులమైన మాకనిపించింది - ‘పుష్పగిరి పీఠంపట్ల అతనికున్న భక్తి, గౌరవం, అభిమానం అతని చివరి క్షణాల్లో పీఠాధిపతులనే దగ్గరకు రప్పించుకున్నదని - ఆయనకు ఉత్తమగతి ప్రాప్తం అవశ్యం. అతని వైదికసంస్కారం దేదీప్యమానంగా అణువణువునా ప్రకాశించడం, సనాతన ధర్మం పట్ల అతని భక్తి, గౌరవం, విశ్వాసం, కళాత్మకమైన భావం, భావాత్మకమైన కళ, దివ్యగానపణితి, సర్వదైవ ప్రార్థన, గీతాలాపన మావంటివారికి ఆకర్షణ” అన్నారు పుష్పగిరి స్వాములవారు. సద్గురు ఘంటసాల విగ్రహప్రతిష్ఠ చేస్తూ “అతడు వ్యక్తిగా దీనత్వమెరుగని ధీరుడు, పవిత్ర భారతీయుడు, ఘంటసాల దివి, భువి మెచ్చిన పుష్పం. మనకు దిగివచ్చిన మంత్రపుష్పం, అతనిదొక మహాస్మృతి” అంటూ ఆ రోజు అన్ని దేవాలయాలలో దేవుళ్ళను ప్రతిష్ఠించిన రీతిలోనే పుష్పగిరి స్వాముల వారు సద్గురు ఘంటసాలగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వంశీసంస్థ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సేవాకార్యక్రమాల సరళిలో మరపురానిది.

ఘంటసాలగారి సతీమణి సావిత్రమ్మగారు, రత్నకుమార్, అతని భార్య కృష్ణకుమారి, ఘంటసాలగారి కుమార్తెలు శ్యామల, సుగుణ వారందరూ కూడా ఘంటసాల గుడిని సందర్శిస్తూనే ఉంటారు. ఘంటసాలగారికి పులిహోర అంటే ఇష్టమని సావిత్రమ్మగారు చెప్పారు. అందుకని ఘంటసాలగారికి ప్రతిరోజు పులిహోర నైవేద్యం పెట్టి ఆ నైవేద్యాన్ని 500 మంది దివ్యాంగులకు ప్రసాదంగా వితరణ చేస్తుంటాము.

ఒకసారి ఆయన కుమార్తె సుగుణ తన చేతులతో ఘంటసాలగారి విగ్రహానికి పులిహోర పెడుతూ, "నాన్నా! చిన్నప్పుడు నీ చేతులతో నాకు అన్నం తినిపించేవాడివి. ఇప్పుడు నా చేతులతో నీకు పులిహోర తినిపిస్తున్నాను" అంటున్న ఆ దృశ్యం అందర్నీ కలచివేసింది. రత్నకుమార్ అయితే కన్నీళ్ళతో తన తండ్రికి అభిషేకం చేస్తూనే ఉంటాడు. చెప్పుకుంటూ పోతే ఇలా ఎన్నో దృశ్యాలు, సంఘటనలు...

ఘంటసాలగారి గుడిని దేశవిదేశీయులెంతోమంది దర్శిస్తూ ఉంటారు. దివ్యాంగులైన పిల్లలు ఆయన ముందు కూర్చుని ఆయన పాటలతో సుప్రభాతసేవ చేస్తుంటారు. ఇదొక చారిత్రకదృశ్యం, చారిత్రక సత్యం. అంతేకాదు, మా ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామివారు, మహాశివుడు, వేంకటేశ్వరస్వామి, అయ్యప్పస్వామి, దత్తాత్రేయస్వామి, విఘ్నేశ్వరుడు, శిరిడీ సాయిబాబావారు - మిగిలిన దేవతామూర్తులతోపాటు సత్యసాయిపురం అని పేరుపెట్టుకున్నందుకు మాకు దివ్యాశీస్సులందించిన భగవాన్ సత్యసాయిబాబావారు ప్రతిరోజు రాత్రిపూట ఘంటసాల గుడికి వచ్చి వారికి నచ్చిన పాటలు పాడించుకుని తెల్లవారే సమయానికి వారి వారి స్థానాలకు వెళ్ళిపోతారేమో అని నాకు అనిపిస్తుంటుంది. ఎందుకంటే సద్గురు ఘంటసాలగారు దేవతామూర్తులందరి గురించిన గానం చేసి తరించారు.

51 రోజుల మహాయాగం, ఘంటసాల గుడి నిర్మాణం ఈ విషయాలలో ఎక్కువ సహకరించిన విజయనగర వాస్తవ్యురాలు శైలజ సుంకరపల్లిగారికి వంశీ, వేగేశ్న సంస్థలు రుణపడి ఉంటాయి (శైలజగారు వంశీ సంస్థకు మేనేజింగ్ ట్రస్టీ, ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్టుకు - ట్రస్టీ, వేగేశ్న ఫౌండేషన్‌కు వైస్ ఛైర్‌పర్సన్).

**సద్గురు ఘంటసాల 98వ జయంతి**

ఈ సంవత్సరం డిసెంబరు 4న జరుగుతున్న సద్గురు ఘంటసాల 98వ జయంతి కార్యక్రమం రోజున వారికెంతో ఆప్తులైన 'కలైమామణి' సంగీతరావుగారికి (100 సం॥లు) ఘంటసాల`వంశీ జాతీయ పురస్కార ప్రదానం, 50 వేల రూపాయల పారితోషికం ఇవ్వడం జరుగుతుంది. అంతేకాకుండా 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 5 సంవత్సరాలనుంచి 25 సంవత్సరాల లోపు 150మంది గాయనీగాయకులతో 15 గంటలు నిర్విరామంగా 'ఘంటసాల పాటకు పట్టాభిషేకం' శీర్షికతో గానామృతం వినిపించడం ఘంటసాల ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ అదృష్టంగా భావిస్తున్నాయి.






❖❖❖❖❖

# తెలుగు గజల్

-డాక్టర్ కె. టి పద్మజ, అమలాపురం

తెలుగు కవిత్వం నాటి నుండి నేటి వరకు ప్రాచీన కవిత్వం, ఆధునిక కవిత్వం,అత్యాధునిక కవిత్వం మొదలైన రూపాలుగా విస్తరించింది. కవిత్వంలో గజల్ విశిష్ట స్థానాన్ని పొందింది.

పార్శీ, ఉర్దూ సాహిత్యాలలో గానయోగ్యమైన చక్కని గేయ రచనగా రూపుదిద్దుకున్న ప్రత్యేకమైన సాహితీ ప్రక్రియ గజల్.

ఈ ప్రక్రియ ఏడో శతాబ్దంలో పర్షియా దేశంలో కొత్త సాహిత్య ప్రక్రియగా ఆవిర్భవించి,12వ శతాబ్దంలో దక్షిణాసియాకు విస్తరించింది.14వ శతాబ్దంలో దక్కనీ భాషలోకి,19వ శతాబ్దంలో ఆంగ్ల భాషలోకి ప్రవేశించింది. కాల గమనంలో గజల్ ఎంతో ప్రాచుర్యాన్ని పొంది,పార్శీ,దరి,అరబిక్,తజిక్,ఉర్దూ,హిబ్రూ,హిందీ,ఆంగ్లం,గుజరాతీ, పంజాబీ, బెంగాలీ, మరాఠీ, మలయాళం, తెలుగు మొదలైన భాషల్లోకి ప్రవేశించి, ఆ భాషల సాహిత్యంలో విలువైన స్థానం పొందింది.

## గజల్-నిర్వచనాలు:

డాక్టర్ దాశరథి గజల్ ని నిర్వచిస్తూ "కవితా ప్రపంచంలో గజల్ ఒక అందాల పూదోట. వందల సంవత్సరాలుగా అరబ్బీ, ఫార్శీ, ఉర్దూ కవులు ఈ తోటను తమ గుండెలు పిండి పెద్ద చేశారు.ఈ తోటలోని పూల గుభాళింపు విశ్వాన్నే ఉర్రూతలూగించింది"అని అన్నారు.

గజల్ అనే శబ్దానికి అర్థం"ఇంతులతో మంతనాలు"అని డాక్టర్ దాశరథి గజల్ ను నిర్వచించారు.

డాక్టర్ సి.నారాయణ రెడ్డి గజల్ స్వభావాన్ని వివరిస్తూ "ఉర్దూ భాషలో గజల్ ఒక కమనీయ కవితాలహరి. ఒక గులాబీల గుళుచ్చం. ఒక మత్తకోకిల రసాత్తకూజితం" అనీ,
"సరస భావన,చమత్కార ఖేలన,ఇంపు,కుదింపు గజల్ జీవ గుణాలు. అది జోల పాడుతుంది.జ్వాల రేపుతుంది"అని నిర్వచించారు.

బూర్గుల రామకృష్ణ రావు గారు"గజల్ శృంగార రసాత్మకమైన సిసలైన భావ కవిత"అని నిర్వచించారు.

"గజలంటే ఏమిటో నన్నడగండి. పదాల్లో అగ్ని దాచి పెట్టడమే గజల్"అని జానీసార్ అక్తర్ అంటారు.



దాశరథి కృష్ణమాచార్యులు- తొలి తెలుగు గజల్ కవి

**గజల్ లక్షణాలు:**

గజల్ ఒక ద్విపద. దీనిలో రెండు పంక్తులు ఉంటాయి. ఈ ద్విపదను దోహ్ అని కూడా అంటారు.

ప్రతి గజల్లో కనీసం ఐదు షేర్లు ఉంటాయి.

ప్రతి షేర్ తనదైన స్వతంత్ర భావాన్ని కలిగి ఉండవచ్చు.

అన్ని షేర్లు,అంటే గజల్ పూర్తిగా ఒకే మీటర్ లేదా ఒకే తాళం లో ఉండాలి. దీనిని బహర్ అంటారు.

మొదటి షేర్ ను మత్లా అంటారు. దీనిలో రెండు పంక్తులలోను రదీఫ్,కాఫియాలు (అంత్య ప్రాస పదాలు) ఉండాలి. మిగిలిన షేర్లలో రెండవ పంక్తి లో మాత్రమే రదీఫ్, కాఫియాలు ఉంటాయి.

ఆఖరి షేర్ ను మక్తా అంటారు. దీనిలో కవి నామ ముద్ర (కవి పేరు) ఉండాలి. దీనిని తఖల్లుస్ అంటారు.

గజల్ లో ప్రధానంగా ఉండవలసిన మౌలిక గుణం భావుకత. అది ఆర్ద్రంగా ఉండచ్చు, తీవ్రంగా ఉండచ్చు.

**తీయనైన విషాన్నిచ్చి తాగమంటే ఏం చేయను**

**చిరునవ్వుతో చితిని పేర్చి పిలుస్తుంటే ఏం చేయను**

పైన పేర్కొన్న రెండు లక్షణాలు, ఈ పంక్తులలో చూడవచ్చు.

గజల్ ఇంపు, కుదింపు, అతి తేలిక పదాలతో మల్లెమాలలా పరిమళించే భావ సౌరభం, జీవితాన్నంతా మధించి సాధించిన అనుభవాల సారపు బరువును అవలీలగా మోసే షేర్లు, వ్యక్తీకరణలో నవ్యత మొదలైన లక్షణాలు కనిపిస్తాయి.

క్లుప్తత, గుప్తత, ఆప్తత అనేవి గజల్ ముఖ్య లక్షణాలు.

చమత్కారం కలిగించే విధంగా రదీఫ్, కాఫియాలను ప్రయోగించడం అనేదే గజల్ లోని విలక్షణత.

గజల్ చమత్కార ప్రధానమైన రచన. ఇది అనుభవం నుంచి రావాలి.

భావం ఉదాత్తమై, రెండవ పంక్తి బలంగా ఉండాలి.

అనుభూతి, స్పందన అనేవి గజల్ ప్రాథమిక లక్షణాలు.

## గజల్ ప్రక్రియ లో పదాలు అర్థాలు:

గజల్ సాహితీ ప్రక్రియలో కొన్ని ఉర్దూ,పారశీ పదాలు కనిపిస్తూ ఉంటాయి. ఈ ప్రక్రియకున్న విశేష ప్రాచుర్యం వలన తెలుగు గజల్ సాహితీ ప్రక్రియలో ఆ పదాలనే రచయితలందరూ తమ కవిసమ్మేళనాలలోనూ, గాన సభల్లోనూ వినియోగిస్తున్నారు. వారికి ఈ ప్రక్రియ పై ఉన్న అపారమైన గౌరవం చేత ఆ పదాలను అనువాదం చేసే ప్రయత్నం చేయలేదు.

## గజల్ సాహితీ ప్రక్రియలో తారసపడే ఉర్దూ పదాలకు అర్థాలు:

**మత్లా**: గజల్ పల్లవిలోని మొదటి చరణం మత్లా

**మక్తా**: గజల్ లోని ఆఖరి చరణం

**రదీఫ్**:మత్లా మరియు చరణాలలో రెండవ పంక్తి లోని అంత్యప్రాస

**ఖాఫియా**: మత్లా మరియు చరణాల్లో రెండవ పంక్తి లోని సహ అంత్యప్రాస

**తఖల్లుస్**: కవి నామ ముద్ర

**గైర్ మురధ్దఫ్ గజల్**: రదీఫ్ లేని గజల్

**ముసల్ సల్ గజల్**: ఒక గజల్ లోని అన్ని షేర్ల భావం ఒకే విషయానికి సంబంధించినది అయినప్పుడు ఆ గజల్ ని ముసల్ సల్ గజల్ అంటారు.

**బేబహర్**: తాళం, లయ లేని గజల్. దీనిని పద్యం లాగాచదవాలి.

**షేర్** : రెండు పంక్తులు కలిగిన ఒక ముక్తకం

**షాయర్**: రచయిత, కవి

**షాయరీ**: కవిత్వం

**కలామ్**: కావ్యరచన

**మొహఫిల్** : గజల్ ప్రేమికుల సమ్మేళనం

**తరన్నుమ్- ఎ- గజల్**: మెహఫిల్ లో గజల్ ను పాటలాగా లయబద్ధంగా వాడే విధానం

**బైత్**: షేర్ కు మరో పేరు

**బైత్-ఉల్-గజల్**: గజల్ లోని అత్యంత ప్రాధాన్యత కలిగిన చరణం

**హుస్న్-ఎ-మత్లా**: మత్లా లోని అంత్యప్రాసలను హుస్న్- ఎ- మత్లాఅంటారు.

**మిస్రా**: ద్విపదలోని ఒకపాదాన్ని లేదా వరుసని మిస్రా అంటారు

**నిజామ్**: ఏక వస్తువుపై సాగే గేయం

**ఖసీదా**: ఉర్దూ,పారశీ, అరబిక్ లలో ప్రాచుర్యం పొందిన సుదీర్ఘ కవిత. దీనిలో పాద నియమం లేదు

**ఖ్వాతా**: ఒకే వస్తువుపై సాగే రెండు ద్విపదల సమాహారం

**తరన్నుమ్**: వచన కవిత్వాన్ని పఠించే పద్ధతి

**ముషాయిరా**: వివిధ కవులు ఒక వేదికపై కూర్చుని తమ కవిత్వాన్ని, గానాన్ని వినిపిస్తారు.దీనిని కవి సమ్మేళనం అంటారు.ఇది ఉర్దూ సాహిత్యం లో గొప్ప సాంప్రదాయం.



డా. సి.నారాయణ రెడ్డి -తెలుగు గజల్ ను విశ్వవ్యాప్తం చేసిన కవి

గజల్ నైసర్గిక స్వరూపంలో మాత్లా,మక్తా,రదీఫ్,కాఫియా, తఖల్లుస్ లు స్పష్టంగా అర్థమయ్యేందుకు జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి గారు రచించిన గజల్ ను గమనించండి.

**ఎదురుగ క్షీరసముద్రాలున్నా హృదయానికి దాహం**
**కరిగే తొలకరి మేఘాలున్నా గగనానికి దాహం**
**తీర్చిన సభలో తలలే అలలై తెగ ఊగేస్తున్నా**
**రసికత ఒలికే చెవి లేదేమని నా రాగానికి దాహం**
**తన ముంగిట తళుకుమనే అందాలెన్నో వున్నా**
**ఊహా ప్రేయసి కనబడదేమని నా దేహానికి దాహం**
**తన రాక కొరకు సమస్త లోకం తారాడుతూ వుంటే**
**చెదిరే చీకటి సిగ నిమరాలని ఆ కిరణానికి దాహం**
**వేనవేల ప్రాణాలను హరించి విసుగేసిందేమో**
**మనిషిగా క్షణం జీవించాలని మరణానికి దాహం**
**అదృశ్య శక్తులు జీవిత గతులను అవరోధిస్తుంటే**
**కాలాన్ని జయించాలని 'సినారె' కావ్యానికి దాహం**

❖❖❖❖❖






❖❖❖❖❖

# యస్.పి బాలుతో నా అనుబంధం – ఆత్మీయత

-శ్రీ కోడూరు రామమూర్తి, సిడ్నీ



మధురమైన స్నేహాన్ని విధాత చెదరని సిరాతో రాస్తాడు. అది పూల తావిలాగ పరిమళాలు వెదజల్లుతుంది. మంచుముత్యాలు లాగా మెరిసిపోతుంది. కాలాతీతంగా చరిత్రలో ఒదిగిపోతుంది. అటువంటి స్నేహం నాకు బాలు గారితో కలిగింది. దేహాలు వేరైనా ఆశయాలు ఆలోచనలు ఒక్కటే. అన్నిటా తోడుగా ఉండే నా మిత్రుడు బాలు నన్ను వీడి ఆ భగవంతున్ని చేరటం నిజంగా నాకు బాధాకరం. మా స్నేహం వటవృక్షంలా ఎల్లప్పుడూ క్రియాశీలకంగా ఉండేది.

పాటల ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేరు బాలు. వయోభేదం లేని స్వర శిఖరం బాలు. వృత్తి రీత్యా నేను ఆస్ట్రేలియా లో ఉన్నా బాలు తో నా పరిచయం హైదరాదాద్ లోనే జరిగింది. ఆయన మాట తీరు నన్ను ఎంతో ఆకట్టుకుంది. మా స్నేహం సాధక బాధకాలకు వేదిక.స్వచ్ఛమైన మనసుతో నిస్వార్ధంగా మెలగటం ఆయనను చూసే నేర్చుకోవాలి. పలకరింపు లో ఆప్యాయత తొణికిసలాడటం ఎంతో ముచ్చటగా ఉంటుంది. పరాయితనం తెలియని మృదు స్వభావి. ఎప్పుడు ఇంటికి ఆహ్వానించినా సమయం మించిపోకుండా వచ్చిన వారికి మంచి విందు అందించడం మర్యాద చేయటం తెలిసిన మనీషి. ఎన్ని ప్రాంతాలు తిరిగినా, ఎన్ని భాషలు నేర్చినా, ఎంత మంది పరిచయం అయిన తన స్వభావం మారటం జరగదు. తనవారే అన్న చందంగా ఉంటారు.

**నిబద్ధత నిపుణత:** ఎవరైనా ఒక స్థాయిని చేరుకోవడానికి కఠోరమైన సాధన అవసరం. . బాలు సునాయాసంగా గాన గంధర్వుడు అన్న పేరు సంపాదించ లేదు. సినీ పరిశ్రమకి వచ్చిన కొత్తల్లో కొంత మంది ఆయనని తిరస్కరించటం జరిగింది. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా తాను అనుకున్న స్థానానికి కష్టపడి ఎదిగాడు. పచ్చనోటు కోసం కాకుండా పచ్చని బ్రతుకు కోసం నిరంతరం శ్రమించారు. బాలు ఈ స్థాయికి ఎదగటానికి ఆయన పాటించిన సూత్రం నిబద్ధత. చిన్నతనం నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటల మీద ధ్యాస ఉంచి ఎదిగారు. నేడు సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజు అయ్యారు. ఆయన లోదాగిన అద్భుత గాత్ర కళకు మెరుగులు దిద్దుకొని మణిహారంలా శారద పాద పద్మాలను ఆశ్రయించారు. తాను కన్న కలకు తన కళను జోడించి నలభై వేలకు పైగా గీతాలను పాడారు. మానవ మాత్రులకు సాధ్యం కానీ రీతిలో డబ్బింగ్ ధీయేటరే ఆశ్చర్యం పొందే రీతిలో విశ్వ విఖ్యాతిని సాధించారు.

**ఆత్మీయత అనురాగం:** మా స్నేహం ఎన్నో జ్ఞాపకాల పేటిక. పదిలపరిచిన చారిత్రిక విషయం ఒకటి మనవి చేస్తాను. బిళ్లూరు లోని శ్రీ స్తంభ లక్ష్మి నృసింహ స్వామి దేవాలయ జీర్ణోద్ధారణ సందర్భంలో బాలు గారు చేసిన సహాయం, సేవా ఇప్పటికి నాకు జ్ఞాపకం ఉంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా చేద్దాం అన్న సంకల్పం ఆయనలో ఉన్నది. చాల సులువుగా సాగిద్దాం అని మొదలు పెట్టిన ఆ పని ఒకానొక సందర్భంలో పూర్తి చేయలేక వదిలేసే స్థితికి వచ్చిన సమయంలో దైవ కార్యం అని నాతో చేయి కలిపి అందరిని ఆత్మీయంగా పలకరిస్తూ స్వామి వారి ఆలయ నిర్మాణానికి సాయం అందించారు.

ఆ గుప్త దాన శీలి పాటల స్వర పేటిక శ్రీ బాలు గారు. వారే ఆ సందర్భంలో అలా చేసి ఉండక పోతే ఈ రోజు ఆ ఆలయం అంత దర్శనీయం గా ఉండేది కాదు. నాకు అనవసరమైన ఖర్చులు వద్దు అని చెప్పి నాతో ధనాన్ని సద్వినియోగ పరిచే రీతిలో వ్యవహరించిన ఆయన అనురాగం ప్రశంసించదగినది. సంపాదించిన సొమ్ముకు నిజమైన న్యాయం చేయగల వ్యక్తి బాలునే. గుప్త దానాలు చేస్తూ ఎంతో మంది కి మార్గం చూపించారు. ఎంత గొప్ప దాన కర్ణుడు కాకపోతే తన ఇంటిని వేద విద్యకు వితరణ చేస్తారు. బాలుగారు నిరాడంబర జీవి. పొగడ్తలకు లొంగటం, తెగడ్తలకు క్రుంగటం తెలియని నిగర్వి బాలు.






బాలు సలహాలు అక్షర లక్షలు. సరస్వతీ పద పేటిక అయిన బాలు ఏది మాట్లాడినా అందులో ఒక అర్థం పరమార్థం ఉంటుంది. ఎంత విన్నా ఇంకా వినాలనే బాలు మాట పాట గురించి చెప్పడం ఒక ఎత్తు. బాలు గారి గురించి చెప్పడం ఒక ఎత్తు. ఎప్పుడు హైదరాబాదు వచ్చిన ఆయన వాడే ప్రత్యేక కారులో నాకు మాత్రమే కూర్చోడానికి అవకాశం ఇచ్చేవారు. కారులో వున్నప్పుడు సాధక బాధకాలు చర్చకు వచ్చేవి. ప్రయాణంలో తిండి విషయంలో, వసతి విషయంలో తాను ఏది అనుభవిస్తున్నాడో అదే నాకు ఇచ్చేవారు. అంత గొప్పగా ఆదరించి ఆప్యాయత పంచే వ్యక్తి దొరకడం నా అదృష్టం.అలాగే పిల్లల విషయంలో కూడా ఎంతో స్వేచ్ఛని ఇచ్చేవారు. కుటుంబానికి తగిన విధానపరమైన సలహాలు ఇస్తూ మంచి నడవడికను అలవాటు చేశారు. భోజనం చేసే సమయంలో ఆయన మితాహారం గా ఉండే వారు. చాలా త్వరగా భోజనం చేసే వారు.నేను కాస్త నిదానం.అయినా నా భోజనం అయ్యేంత వరకు ఆగి చివరికి లేచే వాళ్ళు. మా ఇద్దరి మధ్య వయోభేదం వున్నా స్నేహ ప్రభావం వల్ల అన్నదమ్ములలాగ కలిసి వుండేవాళ్ళం. బాలులో మరోగుణం చిద్విలాసంతో సమస్యలను పరిష్కరించడం, నా దగ్గరకు కొంత మంది సినీ దర్శకులు వచ్చినప్పుడు మరియు నిర్మాతలు వచ్చినప్పుడు వాళ్ళు నాతో అంతగా మాట్లాడకుండా చేసి నాకు ఏ సమస్యా రాకుండా చేయడంలో ఆయన సిద్ధహస్తులు. ఇలాంటి క్లిష్టతర మరియు సున్నితమైన సమస్యలను పరిష్కరించడం బాలుకు వెన్నతో పెట్టిన విద్య. మద్రాసులో పడిన అనేక కష్టాలు బాలుకు ఎన్నో విషయాలు తెలియజేశాయి. ఆయన జీవితపు లోతులు తెలిసిన దార్శనికుడు. మాటకు పాటతో జవాబు చెప్పగల మేధో మూర్తి. తన జీవితాన్నే తెరచిన పుస్తకం చేసి పదిమంది ఉత్సాహ వంతులకు పాఠం నేర్పారు. ఎంత పని చేసిన చిరునవ్వు చెదరని దరహాసం ఆయన సొంతం. బాలులో మరో ముఖ్య లక్షణం ఆయన పలకరింపు. ఆ పలకరింపుతో నే పులకరింతలు తెప్పించారు. నేను ఆయన కలిసి కారులో ప్రయాణిస్తున్నంత సమయం అనేక సంభాషణలు మా మధ్య పుట్టేవి. తన అంతరంగిక విషయాలెన్నో చెప్తూ ఉండేవారు. బాధ, సంతోషం ఇలా ప్రతి విషయంలో ప్రతి మాటలో ఆయన చిలిపితనం, గంభీర వ్యక్తిత్వం గోచరం అయ్యేది.కోపాన్ని కూడా రాగంలో చూపించగల నేర్పు ఆయనకే చెల్లింది. కొన్ని కోపోద్రిక్త సందర్భాలు వచ్చినా ఆయన హెచ్చరికలు మంచు ముత్యాల లానే ఉండేవి. నేను ఎప్పుడు ఇండియాకి వచ్చినా ఒక కారు కొనే వాడిని. ఇలా చేస్తుంటే ఒకసారి బాలు నన్ను ఇంటికి పిలిచి కాఫీ, టిఫిన్ పెట్టి రామ్మూర్తి ఈ సారి ఇండియా కి వచ్చినప్పుడు చిన్న కారు కొను లేదా నా కారు వాడుకో. అనవసరంగా డబ్బు దుబారా చేయకు అని నవ్వుతూ హెచ్చరించే వారు.అది ఆయనలో ఉన్న చిరునవ్వు శక్తి. కోపాన్నికూడా శాంతంగా మార్చి పలకడం ఆయనకే చెల్లింది. వ్యక్తి ఏ స్థానం లో ఉన్న ఆయన పలకరించే విధానం అనన్య సామాన్యం.






షో ఏది అయినా, సెట్ లో పనిచేస్తున్న వారితో ఆయన నడుచుకునే విధానం చూపరులకు ఆనందం కలిగిస్తుంది. నాకు ఆరోగ్యం బాగుండనప్పుడు కూడా ఆయన తీసుకునే కేరింగ్ నాకు ఇప్పటికీ గుర్తుంది. ప్రత్యేకించి హైదరాబాద్ లో చెన్నైలలో తన ఇంట్లోనే నాకు గది కేటాయించి సొంత మనిషిలా చూసుకునేవారు. కొన్ని సందర్భాలలో ఆయన చిలిపి కృష్ణుడు. మరికొన్ని సందర్భాలలో బాలరాముడు. ఆయన గీతా చెప్పగలడు. గీతను మార్చగలడు. మహదానందమైన పలకరింపులో లోకాలు మర్చిపోగల నేర్పు ఉంటుంది. అందుకే బాలు అంటే అందరికి ఇష్టం.

**శ్రద్ధ సహనం సేవ:** కొంతమంది ఎటువంటి ఆరాలు తీయకుండా సాయం అందిస్తారు. దానికి కారణం వాళ్ళు బ్రతికిన తీరు. నేను ఏ కార్యక్రమం మొదలు పెట్టినా బాలు నాకు అనుకోని విధంగా సాయం అందించడం నిజంగా నా సుకృతం. సహజంగా చంచల మనస్తత్వం ఉన్నవారు ఏ పని మీద నిలకడగా నిలబడరు. కానీ బాలులో ఉన్న శ్రద్ధ ఆయనకి పని మీద ఉన్న గౌరవం బట్టి చూస్తే ఆయన ఎంత పని రాక్షసుడో అర్థం అవుతుంది. నేటి తరం గాయకులు రెండు మూడు పాటలు పాడిన తరువాత మళ్ళీ కనిపించరు. అందినంత అనుభవించి వెళ్ళిపోతారు.కానీ బాలు ఏడు పదుల వయసులో కూడా పాటకు సేవ చేయడం నిజంగా ఆశ్చర్యమే. బాలుకి దైవ కార్యముల యందు భక్తి, ఎక్కువ సేవ చేసే గుణం, అణుకువ, నిపుణత ఇలా చెప్పుకుంటూ పోతే వ్యాసం గ్రంథం అవుతుంది. కాబట్టి "ఊరకె రారు మహానుభావులు" అన్నట్లు బాలు మహత్తర గాయక అవతారం కాబట్టి అవతరించి అలరించి దివికేగినారు. వారి మాటల్లో జీవితం నందన వనం కాదు. కానీ నందన వనంలా చేసుకోవాలి అని అంటూ ఉండేవారు. శ్రద్ధ విషయంలో బాలు పనితనం చెప్పుకోదగ్గ గొప్ప అంశం. బిళ్ళూరు స్థంభ నరసింహ స్వామి ఆలయ పునః నిర్మాణ పనులలో బాలు ప్రతి విషయంలో తానే దగ్గరుండి సలహాలు సూచనలతో పాటు పనిచేయటం కూడా చేసారు. తాను పనిచేసేటప్పుడు నన్ను కూడా అందులోకి ఆహ్వానించి సునాయాసంగా పనిచేయటం ఎలాగో నేర్పేవారు. అలుపు, బడలిక తెలియని దాహం ఆయనది. అర్చన, అభిషేకాది కార్యక్రమాలు గంటల తరబడి కూర్చొని శ్రద్ధగా చేసేవారు. విశేషం ఏమిటంటే ఆగమశాస్త్రంలో కూడా మంచి ప్రవేశం వున్న వ్యక్తి. అందుకే అర్చనల విషయంలో శ్రద్ధాభక్తులు కలవారు అయ్యారు.

**చివరిగా ఒక్క మాట:** వంశాను గుణంగా సంక్రమించిన ఆచార వ్యవహారాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, నిత్య గానార్చనతో ఈశ్వరార్చన చేస్తూ, స్వరాలను జనాలకు ప్రసాదంగా పంచుతూ జీవిత చరమాంకంలో ముక్తిని పొందిన విద్వద్మణి మా మణి. మహాగాయకుడు, మహా భక్తుడు, మహా గానయోగి, మహా ఘన తెలుగు భాషావేత్త, పద్మ భూషణుడు, పద్మశ్రీ, శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గారికి మా బాలు గారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను. నాకు ఉన్న పద పరిజ్ఞానం ఆ మహానుభావుడి పేరు ముందు చాలా చిన్నది. మనసులో దుఃఖం పొంగుతున్నా అంత గొప్ప వ్యక్తి నాకు మిత్రుడు అన్న చిన్న మాట అనంతమైన ఆనందాన్ని నింపుతుంది. బాలు గారితో కలిసి భగవద్గీతను కన్నడ తమిళ భాషల్లో రిలీజ్ చేయాలని అనుకున్నాము అన్నీ సరిపోయాయి అన్న సమయానికి ఆయనను భగవంతుడు తీసుకుపోవడం కడు శోచనీయం.

పూల పండ్ల రీతి పుణ్యపు రాశిగా
దక్కినావు బాలు ధరణ నాకు
నీదు స్నేహ మునకు నిజమైన గుర్తుగా
నీవె నిలిచి నావు నేడు నాలో ..........

అంటూ మనసారా ఆ మహా తేజో విలాస విభ్రమ నేత్రుణ్ణి, సౌష్టవాకార వినతుణ్ణి, స్వర గంగాధరుణ్ణి కీర్తిశేషుణ్ణి మనసా వాచా కర్మణా తలుచుకుంటూ అంజలి ఘటిస్తున్నాను.

జయంతి తే సుకృతినో రస సిద్ధాః కవీశ్వరాః
నాస్తి కేషాం యశః కాయే జరామరణజం భయం

రససిద్ధులైన కవీశ్వరులకు జరామరణముల భయం లేదు. వాళ్ళు కీర్తి శరీరంతో చిరంజీవులై వర్ధిల్లుతారు. అటువంటివారి సాహచర్యం కొండంత దైర్యాన్ని, అనంతమైన పుణ్యాన్ని ఇస్తుంది.



# శ్రీధర వేంకటప్పయ్య

-శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్

బబ్లూకి పన్నెండేళ్ళు.  తలిదండ్రుల గారాబం వల్ల వాడు కాస్త పెంకితనం, మరికాస్త మంకుతనం నేర్చుకున్నాడు.

బబ్లూ తండ్రి పేరు మనోహర్.  తల్లి పేరు రజిత.  వాళ్ళకి ఇద్దరు సంతానం.  మొదట అమ్మాయి, తర్వాత అబ్బాయి.  అబ్బాయి పేరు శ్రీధర వేంకటప్పయ్య.  మనోహర్ తండ్రి పేరు వేంకటప్పయ్య.  మనోహర్ భార్య రెండవసారి గర్భం ధరించినప్పుడు ఆయన తన కొడుకుని జాలిగా అభ్యర్థించాడు, ' ఒరేయ్ నాయనా!  నీకు అబ్బాయి పుడితే నా పేరు పెట్టుకోరా.'

మనోహర్ కి ఇష్టం లేకపోయినా, తనని కని, పెంచి, అష్టకష్టాలు పడి చదివించిన తండ్రి మాట కాదనలేక, ' అలాగేలే నాన్నా!' అన్నాడు.

ఆతర్వాత కొద్ది రోజులకే వేంకటప్పయ్య కాలం చేసాడు.  అది జరిగిన మూడు నెలలకి రజిత పండంటి మొగబిడ్డని ప్రసవించింది.  బారసాల నాడు తండ్రి మీద గౌరవంతో మనోహర్ తన బిడ్డకి శ్రీధర వేంకటప్పయ్య అని నామకరణం చేసాడు.  కాని రజిత కొడుకుని స్కూల్లో వేసినప్పుడు అతడి పేరు శ్రీధర్ గా మాత్రమే నమోదు చేయించింది.  ఐతే తలిదండ్రులిద్దరూ అతడిని వేంకటప్పయ్య అనీ కాక, శ్రీధర్ అనీ కాక, ముద్దుగా బబ్లూ అని పిలుచుకుంటారు.

మనోహర్ కుటుంబం వుండేది రంగా ఎన్ క్లేవ్ లో.  వాళ్ళ కాలనీ వెల్ఫేర్ అసోసియేషను వారు శనివారం నాడు వారికి ఒక నోటిఫికేషను పంపారు.  ఆదివారం ఉదయం పదిగంటలకి శ్రీదేవి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల సైన్సెస్ నించి ఒక డాక్టర్ల బృందం వారి కాలనీ సందర్శిస్తారట.  అప్పుడు కాలనీలోని వారందరికీ ఆరోగ్యసూత్రాల గురించి వివరించడం, ఏవన్నా అపాయాలు సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, చేయవలసిన ప్రాథమిక చికిత్సల గురించి వివరిస్తారట.  అందువల్ల కాలనీలోని అందర్నీ తప్పనిసరిగా హాజరు కమ్మని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని ఆ నోటిఫికేషను సారాంశం.

ఆదివారం వచ్చింది.  రజిత, మనోహర్ ముస్తాబై కమ్యూనిటీ హాలుకి వెళ్ళబోతున్నారు.  బబ్లూ నేను కూడా వస్తానని పేచీ మొదలుపెట్టాడు.

రజిత అంది, ' ఒరేయి నాయనా1  నువ్వు, అంబుజ ఇంట్లోనే వుండండి.  అక్కడ నీకు బోరు కొడుతుంది.  డాక్టర్లు వచ్చి ఏవేవో పెద్ద విషయాలు చెబుతారు.  అవి నీకేం అర్థం కావు.  మేము మీటింగు అవగానే ఇంటికి వచ్చేస్తాం.  అందాకా నువ్వు, అక్క టామ్ అండ్ జెర్రీ డి.వి.డి. వేసుకుని చూసుకుంటూ వుండండి.  ఫ్రిజ్ లో టూటీఫ్రూటీ ఐస్ క్రీం వుంది.  కావాలంటే తీసుకుని తినండి.'

బబ్లూ వినలేదు.  తను కూడా వస్తానని వీరపేచీ పెట్టేసాడు.  టైమయిపోతోంది.  ఇంక మనోహర్ కి విసుగేసి, ' వాడి ఖర్మ ! పోనీ రానీ రజితా.' అన్నాడు.

రజిత అంది, ' సరేరా బడుద్ధాయ్ ! వచ్చి తగలడు.  కాని అక్కడికొచ్చాక ఐదు నిముషాలన్నా గడవకుండానే, ' అమ్మా!  ఇంటికెళిపోదామే' అని వెధవ పేచీలు పెట్టావంటే నీకు అక్కడే తొడపాశం పెట్టేస్తాను.'

బబ్లూ అన్నాడు, ' సరే.  కాని నేను మాత్రం వచ్చి తీరతాను.'

అంబుజ కాస్త వ్యక్తావ్యక్తతలు తెలిసిన పిల్ల కావడం మూలాన, ' మమ్మీ! నేను మాత్రం మీరు చెప్పినట్లు ఇంట్లోనే వుంటాను. కాని అందుకు బదులుగా మొన్న బట్టలషాపులో చూసిన మిడీ నాకు కొనిపెట్టాలి. అలా ప్రామిస్ చేస్తేనే ఇంట్లో వుంటాను. లేకపోతే నేనుకూడా మీతో వస్తాను.' అంది.

రజితకి ఈ బ్లాక్ మెయిలింగ్ నచ్చలేదు. ఐనా గత్యంతరం లేక కోపంగా ' సరేలే' అంది.

అంబుజ వదలలేదు. ' అమ్మా, ఇప్పుడలానే అంటావు. కాని తర్వాత ఏరు దాటాక తెప్ప తగలేస్తావు. నేను జ్ఞాపకం చేస్తే, ' ఏడిసావులే, ఇప్పిటికే నీకు బీరువానిండా బోలెడు డ్రస్సులున్నాయి. ఇంక నీకు కొత్త బట్టలేం కొనేది లేదు.' అంటావు. నాకు డాడీ ప్రామిస్ చేస్తేనే ఇంట్లో వుండిపోతాను. లేకపోతే నేనూ వస్తాను.' అని బెదిరించింది.

అంబుజకి తెలుసు. డాడీ మేన్ ఆఫ్ ప్రిన్ సిపుల్స్ అని. ఆయన మాటిస్తే ఇంక తిరుగుండదు.

మనోహర్ వెంటనే అన్నాడు, ' నాన్నా అంబుజా! టేక్ మై వర్డ్. తప్పనిసరిగా రేపే నిన్ను కళానివాస్ కి తీసుకెళ్ళి, నువ్విష్టపడ్డ ఆ మిడీని నీకు కొనిపెడతాను. ఒరేయి బబ్లూ! ఇప్పుడే చెబుతున్నాను. నీకు మాత్రం ఏమీ కొనను.'

బబ్లూ పెంకిగా అన్నాడు, ' కేరే హూాట్! నాకిప్పటికే కోటి డ్రస్సులున్నాయి. రేపు నేను పెద్దయ్యాక అవి నాకెందుకూ పనికిరావు. నేను మాత్రం వస్తున్నాను.'

చివరకు రజిత, మనోహర్, బబ్లూ కలిసి మోటర్ సైకిలు మీద కమ్యూనిటీహాలుకెళ్ళారు.

సెషను మొదలైంది. అందులో గేస్ స్టవ్ ల వద్ద జరిగే ప్రమాదాలు, బాత్ రూములలో జరిగే ప్రమాదాలు లాంటివన్నీ వివరిస్తున్నారు.

ఒక డాక్టరుగారు లేచి గొంతు సవరించుకున్నారు.

' మీకు బాత్ రూములు స్టైలిష్ గా వుండాలి. అందుకని నున్నటి టైల్సు వేసుకుంటారు. కాని మీకు తెలుసా? ముప్పాతిక ప్రమాదాలు బాత్ రూములలోనే జరుగుతున్నాయి. అల్లు రామలింగయ్య గారి దగ్గర నుంచి, ప్రముఖులెందరో బాత్ రూములలో కాలు జారి పడి ప్రాణాలు పోగొట్టుకోవడమో, కాళ్ళు విరగకొట్టుకుని, లక్షలు, లక్షలు ఖర్చు పెట్టుకుని, తొడల దగ్గర మెటల్ స్క్రూలు వేయించుకుని కుంటుకుంటూ నడవడమో చేస్తున్నారు. అందుకని మీరు షోకులకి వెళ్ళకండి. బాత్ రూములలో ఫ్లోరు కాస్త రఫ్ గా వుండేలా చూసుకోండి. బాత్ రూములలో నీళ్ళు నిలవుండి పాకుడు ఏర్పడకుండా వుండేలా చూసుకోండి. ఎవరింటికన్నా వెళ్ళినప్పుడు బాత్ రూములోకి నిర్లక్ష్యంగా అడుగు పెట్టకండి. ముందు ఒక కాలు పెట్టి, అక్కడ పాకుడు వుందా అని జాగ్రత్తగా పరిశీలించి అప్పుడు లోపలికి వెళ్ళండి.'

ఇంకొక డాక్టరుగారు లేచారు.

' మీరు స్కూటరు మీద హడావిడిగా ఆఫీసుకి వెడుతున్నారు. దారిలో రైల్వేగేట్ వస్తుంది. రైలు రాబోతోంది కనుక ఆ గేట్ వేసేసి వుంది. మీరు ఆఫీసుకి టైము ఐపోతోందన్న తొందరలో గేటు కిందనుండి దూరి అవతలవైపుకి వెడదామని చూస్తారు. ఈలోపునే ట్రైను వస్తుంది. మీరు ప్రాణాలు కోల్పోవడమో, లేక శాశ్వతంగా వికలాంగులు కావడమో

జరుగుతుంది. అందువల్ల తమాయించుకోండి. బెటర్ లేట్ దేన్ నెవర్. మీరు ఆఫీసుకి లేటుగా వెడితే వెడతారు. గాడిదగుడ్డు. కొంపం మునిగిపోదు. రైలు వెళిపోయి గేటు తీసాక ప్రోసీడవండి. మీకు తెలుసా? ప్రముఖ సినీనటుడు కె.వి.చలం, పశ్చిమగోదావరి జిల్లా వట్లూరులో ఒక ఉపాధ్యాయిని, మరెందరో ఇలాగే రైలు కింద ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు పోగొట్టుకున్నారని?'

' అలాగే మీరు ఆఫీసుకెళ్ళడానికి సిటీబస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తారు. లోపలికి వెళ్ళడానికి దారి ఇవ్వకుండా కొందరు ఫుట్ బోర్డ్ మీదే వేళ్ళాడుతూ వుంటారు. మీరు కూడా గత్యంతరం లేక ఫుట్ బోర్డ్ మీదే నిలబడతారు. బస్సు ఆగకుండానే దిగడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి సాహసాలు చెయ్యడం వల్ల మన నగరంలో ఏటా ఎంతమంది ప్రాణాలు కోల్పోతున్నారో మీరు పేపర్లలో చదవటల్లేదూ? దయచేసి అటువంటి సాహసాలజోలికి వెళ్ళకండి.'

మరొక లేడీడాక్టర్ గారు లేచి ఉపన్యసించడం మొదలుపెట్టారు.

' మీ ఇంట్లో గేస్ స్టౌ ఆన్ చేసి వంట మొదలుపెడతారు. వంటయి పోగానే స్టౌ సరిగ్గా కోజ్ చెయ్యరు. అంటే నాబ్ పూర్తిగా తిప్పరు. అల్లాగే స్టౌని వదిలేసి రాత్రి లేటయిపోయిందని వెళ్ళి పడుకుంటారు. గేసు లీకవుతూ వుంటుంది. చీకటితోనే లేచి వంటగదిలోకి వెళ్ళి లైటు వెలిగిద్దామని స్విచ్ ఆన్ చేస్తారు. మీరు స్విచ్ ఆన్ చెయ్యగానే స్పార్క్ వస్తుంది. వెంటనే కిచెన్ భగ్గుమంటుంది. ఆ మంటల్లో మీరు మాడి మసైపోతారు. మీ విలువైన నిండుప్రాణాల్ని పోగొట్టుకుంటారు. ఇలా జరగాలని మేమెవరమూ కోరుకోవటల్లేదు. దయ చేసి మేము చెప్పేది సహృదయంతో అర్థం చేసుకోండి. ఇలా జరగకుండా చూసుకోమని మాత్రమే మేము మీకు హెచ్చరికలు చేస్తున్నాము. ఎంతో జాగ్రత్తగా వుండి ప్రమాదాలను నివారించుకోమని మేము ప్రాధేయపడుతున్నాము. మీకు తెలుసా? ఆంధ్రదేశంలో అందరూ గర్వపడే ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి మాదిరెడ్డి సులోచనగారు ఇటువంటి ప్రమాదాని గురై తమ విలువైన ప్రాణాల్ని పోగొట్టుకున్నారు. కొంచెం జాగ్రత్త వహించి వుంటే వారు నిండు నూరేళ్ళు జీవించి వుండేవారు. మరెన్నో అద్భుతమైన రచనలు చేసి మన తెలుగు పాఠకులని అలరించి వుండేవారు.'

మరొక డాక్టరుగారు లేచి కొనసాగించారు.

' మీరు ఆఫీసులో వుండగా హోరున వర్షం కురిసి వెలిసింది. రోడ్లన్నీ వాగులై పోయాయి. మీరు ఆఫీసు అవగానే సిటీబస్సు కోసం వెళుతున్నారు. కాస్త జాగ్రత్తగా చూసుకుని అడుగులు వేయండి. దురదృష్టవశాత్తు మన రోడ్లమీద మూతలు లేని మేన్ హోల్సు ఎన్నో వుంటాయి. అక్కడ మేన్ హోలు వున్నట్లు మీకు తెలియక అందులో అడుగు వేస్తే ఇంతే సంగతులు. ఇలా ప్రతి ఏడూ ఎంతో మంది చనిపోతున్న సంగతి మీకు తెలియంది కాదు. అలాగే మీరు ఏ వెహికిల్ మీద వెడుతున్నా, లేక నడిచి వెడుతున్నా తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించండి. కోరి ప్రమాదాలని కొని తెచ్చుకోకండి.'

మరొక లేడీడాక్టరుగారు లేచి చెప్పడం ప్రారంభించారు.

'నేనుకూడా మీకొక ముఖ్యమైన హెచ్చరిక చేయదలుచుకున్నాను. మనం లేచినది మొదలు పడుకునేదాకా విద్యుత్తుతోనే వ్యవహరిస్తాం. ప్లగ్ లో వైర్లు పెట్టేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్లగ్ లో వైర్లు పెట్టి అవతలి కొసలు స్పీకర్లకి కనెక్ట్ చెయ్యడానికి ప్రయత్నించరాదు. పొరపాటున చెయ్యి వైరుకి తగిలితే షాక్ కొట్టే ప్రమాదం సంభవిస్తుంది. ఒక్కొక్కసారి స్విచ్ లు సరిగా పని చెయ్యవు. ప్రత్యేకించి కాలింగ్ బెల్ స్విచ్ లు. స్విచ్ మీద చెయ్యి వేసేముందు స్విచ్ ని ఒకసారి పరిశీలించడం అలవాటు చేసుకోండి.'

'పొరబాటున మీ ఇంట్లోని ఎవరికన్నా షాక్ కొడితే మీరు గాబరాగా పరుగెత్తి వారిని తాకకండి. మీరు కూడా షాక్ కి గురై, ఒకరికొకరు అతుక్కుపోయి ఇద్దరూ చనిపోయే ప్రమాదం వుంది. అటువంటి సందర్భాలలో ఒక పొడితువ్వాలు చేతికి చుట్టుకుని వారిని బలవంతంగా బైటకి నెట్టండి. లేదా ముందుగా వెళ్ళి స్విచ్ ఆఫ్ చెయ్యండి. ఆ సందర్భాలలో మీకు ప్రెజెంస్ ఆఫ్ మైండ్ చాలా అవసరం.'

ఆ డాక్టర్లు ఇంకా ఏవేవో చెబుతూనే వున్నారు. ప్రమాదాలు జరిగి, రక్తస్రావం అవుతున్నప్పుడు చెయ్యవలసిన ప్రాథమిక చికిత్సలు, ఎవరికన్నా అకస్మాత్తుగా గుండెనొప్పి వస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు లాంటి విలువైన విషయాలనెన్నో బోధిస్తున్నారు.

కాని రజితకి, మనోహర్ కి అదంతా చాలా బోర్ గా వుంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. ఆ డాక్టర్లు చెబుతున్నవేవీ వాళ్ళ చెవుల్లోకి వెళ్ళటల్లేదు. ప్రతి ప్రసంగం తర్వాత చప్పట్లు వినపడగానే వారు కూడా బలవంతంగా కనురెప్పలు తెరిచి అందరితో పాటుగా చప్పట్లు కొట్టి, మళ్ళీ నిద్రలోకి జారుకుంటున్నారు.

కాని బబ్లూకి నిద్ర రావటల్లేదు. వాళ్ళు చెప్పేదంతా శ్రద్ధగా వింటున్నాడు.

సమావేశం ముగిసింది. అందరూ ఎవరి ఇళ్ళకు వారు బయలుదేరారు.

స్కూటరు మీద కూర్చున్నాక రజిత అంది, ' ఓ, పరమ బోర్! ఇవన్నీ ఎవరికి తెలీనివి? దీనికోసం ప్రత్యేకించి మీటింగు పెట్టి మన విలువైన సండేని నాశనం చేసారు.'

కొన్నాళ్ళు గడిచాయి.

ఒకరోజు సాయంత్రం బబ్లూ అప్పుడే స్కూలు నించి ఇంటికి వచ్చాడు.

రజిత అంది, ' బబ్లూ! బుద్ధిగా డ్రస్సు మార్చుకుని రా. నీకు హార్లిక్సు వేడి చేసి ఇస్తున్నాను.'

బబ్లూ తన గదిలో తువ్వాలు చుట్టుకుని పేంటు మార్చుకుంటున్నాడు. ఇంతలో వంటింట్లోంచి కెవ్వున కేక వినబడింది. బబ్లూ హడావిడిగా వంటింట్లోకి పరిగెట్టాడు. అమ్మ చేయి స్విచ్చికి అతుక్కుపోయి వుంది. ఆమె గిలగిలలాడిపోతోంది. బబ్లూ మరేమీ ఆలోచించలేదు. తన ఒంటిమీదున్న తువ్వాలు చేతులకి చుట్టుకుని, తనకున్న శక్తినంతా కూడదీసుకుని అమ్మని బలవంతంగా తోసేసాడు. ఆవిడ కింద పడిపోయింది.

బబ్లూ ఏడుస్తూ, ' అమ్మా! అమ్మా!' అన్నాడు.

రజిత కొద్ది క్షణాల్లో కొంచెం తేరుకుని బబ్లూని బలంగా గుండెలకి హత్తుకుని ఏడిచేసింది.

' మై చైల్డ్! మై హనీ! మై బబ్లూ! నాకు ప్రాణదానం చేసిన నా కన్నతండ్రీ!' అంది.

అప్పుడే ఆఫీస్ నించి ఇంటికి వచ్చిన మనోహర్ ఆమెని జాగ్రత్తగా పొదివి పట్టుకుని లేవదేసి మంచం మీద పడుకోబెట్టి సపర్యలు చేసాడు.

కొద్ది క్షణాల్లో రజిత పూర్తిగా కోలుకుంది.


బబ్లూ వంటింట్లోంచి హార్లిక్సు కలుపుకుని తీసుకువచ్చి తల్లికి సాదరంగా ఇచ్చాడు.

రజిత హార్లిక్సులో, ఉబికివస్తున్న కన్నీళ్ళు కలుపుకుని తాగుతూ, ' ఒరేయ్ బబ్లూ! నీకేం కావాలన్నా అడగరా. ఎంత ఖరీదైనదైనా సరే. వెంటనే కొనిపెడతాను.' అంది.

బబ్లూ నిర్లక్ష్యంగా అన్నాడు, ' అలాంటి లంచాలు అక్కకియ్యమ్మా. నాకక్కర్లేదు. మా అమ్మ క్షేమంగా నా కళ్ళముందున్న దానికన్నా విలువైన బహుమతి ఇంకేముంటుందమ్మా నాకు?'

రజిత బబ్లూని కవుగలించుకుని ముద్దులతో ముంచెత్తేసింది.

❖❖❖❖❖



❖❖❖❖❖

## పరిశుభ్ర గొట్టాల కథ

-వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

సుమారు మూడు నెలల్ల క్రితం మా క్వీన్ విక్టోరియా ఎండ చేతి చూపుడు వేలు స్పీడ్ లిమిట్ దాటి ఊగడం మొదలు పెట్టింది. అదేదో సినీ నటి జమున గారి తల లాటి ఊపుడు అయితే అయ్యో పాపం అని డాక్టర్ దగ్గరకి తీసుకుళ్లి వైద్యం చేయిద్దును. కానీ చూపుడి వేలు చూపు నా మీదే ఉంది. అనగా ఏదో విషయం లో నా కొంప ములిగిందీ అని అర్థం. ఈ సారి నేను ఎక్కడ పప్పులో కాలు వేశానా అని బుర్ర గోక్కుంటూ ఉంటే “ఏమయినా సరే. ముందు ఆ డక్ట్ క్లీనింగ్ చేయించు. ఇదిగో సియర్స్ కంపెనీ వారి నెంబర్. మా బాస్ ఎలిజబెత్ ఇచ్చింది” అని ఓ కాగితం ముక్క నా చేతిలో పెట్టి ....అవును ..నా బహుమతి నాకు తగిలించేసి వర్క్ కి వెళ్లి పోయింది. ఆ బహుమతి నా తలకాయ కి వెనకాల తగిలిందని అని వేరే చెప్పక్కర లేదు.

అసలు మా విక్టోరియా ప్రాణాలకి..తద్వారా నా ప్రాణాలకి ఈ ఎలిజబెత్ మహారాణి ఒక్కర్తి తగలడింది. వాళ్ళింట్లో ఆవిడ మొగుడు ఏ రిపేర్లు చేసినా అది గొప్పగా మా ఆవిడ కి చెప్పడం, అది విని ఈవిడ రిపేర్లు చేయించుటయే తప్ప చేయుట ఎరుగని పవిత్ర భారతీయుడని అయిన నన్ను సరిగ్గా అదే రిపేరు చెయ్యమని ఆర్డర్ వెయ్యుట మా జీవిత చరిత్రలో రొటీన్ అయిపోయింది.  అవసరం ఉన్నా లేక పోయినా చేయించే ఈ రిపేర్లకి చచ్చేంత డబ్బు దండగ అవుతుంటే ఒక సారి పోనీ ఆ ఎలిజబెత్ మొగుడినే వచ్చి రిపేర్ చెయ్య మన కూడదా అని ఒక చిన్న సూచన ఇచ్చాను ఒక సారి. విచిత్రం ఏమిటంటే..నా సూచన విన్న వెంటనే నా మీద గయ్ అని లేస్తే నేను అర్థం చేసుకుందును కదా.  కానీ వారం తర్వాత గయ్ అని లేచింది మా క్వీన్ విక్టోరియా. అది కూడా నా మీద కాదు. ఎవరి మీదో తెలీదు. అసలు రహస్యం ఏమిటంటే ఆ బాస్ మొగుడు అసలు మొగుడు కాదుట. బాస్ కి బాయ్ ఫ్రెండ్ ట. వాడిని కంట్రోల్ లో పెట్టుకోడానికి ఆవిడ పన్నే పన్నాగాలుట ఈ రిపేర్ పనులన్నీ. ఆవిడని ప్రసన్నం చేసుకోడానికి పాపం వాడు ఈ పాపం పనులన్నీ చేస్తున్నాడుట. అదీ మా క్వీన్ విక్టోరియా గయ్ మానడానికి కారణం. అసలు ఆ బాసూ, ఆవిడ తాలూకు మగాడూ ఎలా తగలడితే మనకెందుకు? అసలు ఇక్కడ గయ్ మనాల్సింది నిజానికి నేను కదా. నేను చెయ్యని పాపానికి ఈ రిపేర్ల ఉద్యోగం ఏమిటీ?

ఇంతకీ ఈ డక్ట్ క్లీనింగ్ అనే పదార్థం ఇండియాలో ఉండదు అనుకుంటాను. ఎందుకంటే అక్కడ అవసరం అయిన గదిలోనే ఎయిర్ కండిషనింగ్ పెట్టుకుంటారు. ఇక్కడ మొత్తం ఇంటికి అంతా కలిపి ఒకటో రెండో సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్ & హీటింగ్ యంత్రాలు ఉంటాయి. వాటి నుంచి అన్ని గదులకీ..ఆఖరికి స్నానాల గదుల్లోకి కూడా చిన్నా, పెద్దా గొట్టాలు ఉంటాయి....అంటే మన గుండె కాయ లోంచి పైన తలకాయ, క్రింద కాళ్ళదాకా రక్తనాళాల లాగా.

ఎప్పుడైనా తేడా వచ్చినప్పుడు డాక్టర్ దగ్గరకి వెళ్లి బై పాసులు చేయించుకుని రిపేర్లు, క్లీనింగులు ఎలా చేయించుకుంటామో అలాగే ఈ సియర్స్ కంపెనీ లాంటి వారిని ఇంటికే రప్పించుకుని ఈ గొట్టాలు శుభ్రం చేయించుకోవాలి. మన ఒంట్లో ఉన్న గొట్టాలు డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లగలం కానీ ఇంట్లో గాలి గొట్టాలు శుభ్రం చెయ్యడానికి బయటకి తీసుకెళ్ల లేం కదా! అంచేత వాళ్ళే మనింటికి రావాలి.

అలా మనం ఆ కంపెనీ వాళ్ళని ఫోన్ లోనో, కంప్యూటర్ లోనో పిలిచినప్పుడు సాధారణంగా జరిగేది ఏమిటంటే పొద్దున్న 8 నుంచి 12 లోగా కానీ, 1 నుంచి 5 లోగా కానీ వస్తాం, రాడానికి అర గంట ముందు ఫోన్ చేస్తాం అని చెప్తారు. అనగా మనం ఆ నాలుగు గంటలూ ఆ వెధవ ఫోన్ ఎప్పుడు మోగుతుందా అని కాసుకుని కూచోవాలి.

ఈ రోజుల్లో ఫోన్లు జేబుల్లోనే ఉన్నాయి కాబట్టి పరవా లేదు కానీ పూర్వం ఆ నాలుగు గంటలలో పొరపాటున..పొరపాటున ఏమిటి లెండి..అవసరం ఉండే బాత్ రూమ్ కి వెళ్ళామో....అంతే సంగతులు. ఈ సారి మొత్తానికి చెప్పిన సమయం లో ఇద్దరు వీరులు దిగారు. వాళ్ళని చూడగానే ఒకడి పేరు చిదానంద ఫెర్నాండెజ్ అనీ, రెండో వాడు మహానంద హెర్నాండెజ్ అనీ తెలిసి

పోయింది. ఎందుకంటే నేను తలుపు తీయగానే వాళ్ళు ఆప్యాయంగా. నవ్వుతూ “ఆర్యూ రాహూ?” అని వాళ్ళ యాసలో అడిగారు. ఆ తర్వాత పరస్పరం మామా కోస్తా, తెలంగాణా భాషాలలో విషయాలు కూలంకషంగా చర్చించుకుని నేను వాళ్లకి $250 ఇవ్వడానికీ, వాళ్ళు గొట్టాల లో స్వయంగా దూరే ప్రయత్నం చెయ్య కుండా కేవలం వేక్యూమ్ యంత్రాల ద్వారానే వాటిని శుభ్రం చెయ్యడానికీ ఒప్పందం కుదుర్చుకున్నాం. దానికి ప్రధాన కారణం ఒక వేళ వారిద్దరిలో ఉన్న బొండాం గాడు ఆవేశ పడి పెద్ద గొట్టాం లోకి దూరితే వాడిని బయటకి లాగడం ఎలిజబెత్ బాయ్ ఫ్రెండ్ బాబు తరం కూడా కాదు. ఆ సైజులు తెలియాలంటే ఆ చిదానంద, మహానందాలతో నేను పరమానందంగా దిగిన ఫోటో చూడండి.

ఇక వాళ్ళు పని మొదలు పెట్టి, చకచకా ఐదు గంటలలో హాయిగా నవ్వుకుంటూ మొత్తం గొట్టాల క్లీనింగ్ చేసిన పద్ధతి నిజంగా మెచ్చుకోవాలి. ఆ తతంగంలో రెండు ముఖ్యంగా చెప్పుకోవాలి. అందులో నాకు బొత్తిగా నచ్చనిది ఆ ఇద్దరూ కలిసి నేను హాయిగా పడుకునే పక్క మీద తైతక్క లాడడం. పైన సీలింగ్ లో ఉన్న గొట్టాం శుభ్రపరచడానికి బూట్లతో సహా ఆ సైజు వాడు పరుపు మీదకి దూకి ఒక పట్టాన దిగడే...పైగా సరదా గెంతులు....చిన్న పిల్లలు ట్రాంపోలిన్ మీద ఆడుకున్నట్టు భలే కులాసా చెయ్యడం నాకు అస్సలు నచ్చ లేదు. ఆ సమయం లో మా క్వీన్ విక్టోరియా చూసి ఉంటే వాడిని నరికి పోగులు పెట్టేది. బుద్ధి తక్కువై నేను తీసిన  ఫోటో ఆవిడకి చూపించగానే ఆ యోగం నాకు దక్కింది. కావాలంటే ఆ ఫోటో ఇక్కడ చూడండి.

నాకు భలే నవ్వొచ్చిన విషయం మటుకు ఆ బొండాం చిదానందం ఫెర్నాండేజ్ మా దేవుడి గది లోకి వెళ్ళగానే ఆ బొమ్మలు చూసి హడిలి చచ్చి పోయి హాహా కారాలు పెట్టి రబ్బరు బంతి లా వెనక్కి వచ్చేసి ఆ రెండో బొండాన్ని వాటేసుకున్నాడు. అంటే...అక్కడ పాము మెడలో ఉన్న ఈశ్వరుడూ, పులి మీద కూచున్న దుర్గా మాతా, ఏనుగు మొహం, పెద్ద బొజ్జ తో వినాయకుడూ వగైరాలు చూసి పాపం కుర్రాడు దడుసుకున్నాడు. అప్పుడు నేను నా హిందూ అవతారం ఎత్తి, మనం పాము, తేలు, మర్రి చెట్టు, ఎలక, మనిషి మొదలైన సకల చరాచర ప్రపంచం లోనూ దేవుడినే చూస్తాం అనీ తాయెత్తు ఎత్తు వేసినా వాడు నేనేమన్నా చేత బడి చేస్తున్నానా అని నా కేసి అనుమానం గా చూడడం మొదలు పెట్టాడు. అప్పుడు ఆఖరి అస్త్రం గా “ఆఖరికి నీలో కూడా నాకు దేవుడు కనపడుతున్నాడు” అని ఓ కోత కోశాను. వాడు వెంటనే “అలాగా, రియల్లీ?..నో బడీ టోల్డ్ మి దట్ బిఫోర్” అని కడుంగడు సంతసించి వెంటనే వాళ్ళావిడ కి ..ఆవిడో..గర్ల్ ఫ్రెండో తెలీదు..ఫోన్ చేసి...."చూడు, మిస్టర్ రాహూ థింక్ అ యామ్ గాడ్. యు థింక్ అ యామ్ డెవిల్.." అని అర్జంటుగా వాళ్ళ భాషలో వాపోయాడు. పిమ్మట సంతోషంగా మళ్ళీ మా పూజ గదిలోకి వెళ్లి అక్కడి గొట్టాం కూడా శుభ్రం చేశాడు.

ఇంత గొడవ జరిగాక పూజ గది లోకి వెళ్ళే ముందు వాణ్ని బూట్లు తీసెయ్యమంటే మళ్ళీ ఏం గొడవ అవుతుందో అని వాడినీ, నన్నూ, ఎందుకయినా మంచిది అని ఆ రెండో బొండాం గాడినీ, ఎలిజబెత్ నీ, ఆవిడ తాలూకు రిపేర్ వాడినీ ..ఇలా అందరి పాపాలనీ క్షమించమని ఆ వినాయకుడినీ, బాపు గారు వేసిచ్చిన ఆ దేవుళ్ళందరినీ కోరుకున్నాను. ఇలాంటి విషయాలలో మా క్వీన్ విక్టోరియా ని లాగడం...ఎందుకు లెండి...  మొత్తానికి వొంట్లో గొట్టాల మాట దేవుడెరుగు ఇప్పుడు మా ఇంట్లో గొట్టాలు శుభ్రంగా ఉన్నాయి.

❖❖❖❖❖



❖❖❖❖❖



INDIAN CUISINE
blu ginger
CANBERRA
Address: 5 Genge St,
Canberra ACT
Phone: (02) 6247 2228
http://www.bluginger.com.au
We Do Catering For All Ocassions
Like us on
(A Group of BluGinger Pty Ltd)

# సంగీత నాదామృతం

-డా. పద్మ మల్లెల, సిడ్నీ.




## వర్ణం

ఇంతవరకూ మనం సంగీత రచనలలో అభ్యాస గాన క్రమంలో గీతం, జతిస్వరం మరియు స్వరజతి అనే అంశాల గురించి తెలుసు కున్నాం కదా! కనుక ఇప్పుడు సంగీత అభ్యాస గానానికిఅతి ముఖ్యమైన వర్ణం అనే సంగీత రచన గురించి తెలుసుకుందాం.సంగీత పరంగా వర్ణం అనే పదానికి అర్ధం గాన క్రియ లేక సంగీత గమనం. వర్ణానికి సంబంధించిన శ్లోకం ఈ క్రింది విధంగా ఉంది.

"గానక్రియోచ్యతే వర్ణః స చతుర్ధనిరూపిత
స్థాయారోహ్యావరోహి చ సంచారి త్యత లక్షణం"

అనగా వర్ణం లో గానానికి ప్రధానమైన 4 లక్షణాలు అంటే స్థాయి, ఆరోహణ, అవరోహణ మరియు సంచారి అనేవి వర్ణం అనే సంగీత రచనలో ప్రధానంగా కనపడతాయి. స్థాయి అంటే ఒకస్వరం లో నిలపడం ఆరోహణ అంటే ఒకస్థాయి నుండి మరొక స్థాయికి హెచ్చుతూ పోవడం, అవరోహి అంటే స్వరాలను పై నుండి క్రిందికి తగ్గుతూ, మరి సంచారి అంటే స్వరాలను రకరకాలుగా అమర్చుతూ పాడటం. రాగం అనే పదానికి సంగీతం లో ఈ క్రింది విధంగా నిర్వచించ బడింది
"రంజకో జన చిత్తానాంస్వర వర్ణ విభూషితః"

అంటే స్వర మరియు వర్ణాలతో అలంకరింపబడి వినేవారి మనసు లను రంజింప చేయ గలిగేదాన్ని రాగం అంటారని వివరింపబడింది. కనుక మనకి దీని ద్వారా ఒక రాగానికి వర్ణం యొక్క ప్రాముఖ్యత అర్ధం అవుతుంది. కనుక ఇప్పుడు ఈ వర్ణం అనే రచన గురించి తెలుసు కుందాం.

సాధారణంగా వర్ణం అనే రచనలో పల్లవి, అను పల్లవి, ముక్తాయి స్వరం, చరణం, చిట్టస్వరాలు అనేవిభాగాలను కలిగి ఉంటుంది. దీనిలో పల్లవినుండి ముక్తాయి స్వరంవరకూ ఉన్న భాగాన్ని పూర్వాం గమని, చరణం చిట్టస్వరాలతో కూడి ఉన్నభాగాన్ని ఉత్తరాంగమని పిలుస్తారు. వర్ణాలు సాధారణంగా రెండు రకాలు. 1) తాన వర్ణాలు మరియు 2) పద వర్ణాలు.

తానవర్ణాలు సంగీతంలో ప్రధాన పాత్ర పోషిస్తే పదవర్ణాలు నాట్యం లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. తాన వర్ణాలు ఒక వ్యక్తి సంగీత ప్రయాణంలో చాలా ముఖ్యమైన పాత్ర కలిగి ఉంటాయి. ఇంకా వివరంగా చెప్పాలంటే ఒక సంగీత విద్యార్థికి ఉండ వలసిన శృతి, స్వర, రాగ మరియు లయ జ్ఞానాలను అపారంగా కలగ జేయ కలిగిన ఏకైక సంగీత రచన వర్ణం. ఈ రచన సాధన ద్వారా సంగీతంలోని వివిధ పోకడలు, గతులు రాగ మరియు స్వర జ్ఞానాలు బాగా అలవడతాయి. ప్రొ. ఎస్. ఆర్. జానకిరామన్ గారి వివరణ ప్రకారం వర్ణాలు ఈక్రింద రకాలుగా సాధన చేయాలి.

1. స్వరం మరియు సాహిత్య విధంగా సాధన
2. ఒక వర్ణాన్ని 'అ' కారంలోసాధన
3. తానంలో వర్ణ సాధన
4. త్రికాలాలో వర్ణ సాధన.

సాధారణంగా వర్ణం కచేరీలో పాడేప్పుడు పూర్వాంగం రెండు కాలాల్లో ఉత్తరాంగం మధ్యమ కాలంలో పాడటం సాంప్రదాయం. అయితే ఆధునిక కాలంలో కొన్ని వర్ణాలను ఆసాంతం మధ్యమ కాలంలో మాత్ర మే పాడటం జరుగుతోంది. ఒక కచేరీ వర్ణంతో ఆరంభిస్తే గాత్రానికి కచేరీ ఆసాంతం కావలసిన సౌలభ్యం సులువుగా చేకూరుతుంది. ఉదాహరణకి ఇది మనందరం వ్యాయామంముందు చేసే warm up Exercise లాగా అన్న మాట!

తాన వర్ణంఅనే పేరు మనోధర్మ సంగీతంలో తానం అనేప్రక్రియకు సంబంధించిన విధంగా ఉంటుంది ఎలా అంటే రెండు మధ్యమ కాలంలో నడుస్తాయి కనుక గానానికి ప్రధానమైన ఈవర్ణాలుకూడా మధ్యకాల ప్రధానంగా నడుస్తాయి కనుక తాన వర్ణాలు అని పిలు స్తారు. ఈ వర్ణాలలో పూర్వాంగం సాహిత్య ప్రధానంగాను ఉత్తరాంగం స్వర ప్రధానంగాసాగుతుంది. వర్ణాలలో చాలా భాగం సాహిత్యం కొంతవరకూ నరస్తుతిగా ఉండేది. దీనికి కారణం కాని చాలా ఆధునిక వర్ణాలు దైవపరంగా ఉన్నాయి. ఉదాహరణకి డా. బాలమురళీకృష్ణ గారి **అమ్మా ఆనందదాయిని అనేవర్ణం** అమ్మవారి పరంగా సాగుతుంది. అలాగే **చలము చేసిన అనే రామప్రియ రాగ వర్ణం** గోపాలబాల అనేకృష్ణ స్తుతిగా ఉంటుంది. అదే **ఏనాదములో అనే నాట రాగ వర్ణంలో** నాదం, సంగీతం దాని విశిష్టత గురించి వర్ణించారు. **ఓంకారప్రణవ అనే షణ్ముఖప్రియ రాగ వర్ణంలో** ప్రపంచ ఉత్పత్తి, ప్రపంచ మనుగడ మరియు భరతజాతి మొత్తం కలిసి మెలిసి మెలగాలనే చక్కని సందే శాన్ని ఇమడ్చారు. అలాగే **ఖరహరప్రియ రాగంలోని నిను నెర నమ్మితి** అనే వర్ణంలో వినాయక ఉత్పత్తి ఇంకా అయనకి సంబంధించిన వివిధమయిన కథలను వివరించారు. ఈ రకమయిన విస్తృత మయిన సాహిత్యపు విలువలను వర్ణాలలో చొప్పించటం డా. బాల మురళీకృష్ణ గారి సంగీత సాహిత్య ఉన్నతికి తార్కాణం.

ఇంకా సంగీత చరిత్ర లోని స్వర్ణయుగమయిన మూర్తత్రయం లో ఒక్క శ్యామ శాస్త్రుల వారు కొన్ని వర్ణాలు రచించారు. అయితే ఇక్కడ ముఖ్యంగా తెలుసుకో వలసిన విషయం ముందు రచింపబడ్డ వర్ణా లలో పూర్వాంగం ఉత్తరాంగాల తరువాత అనుబంధం అనే భాగం కూడా ఉండి దాని సాహిత్యం పల్లవి యొక్క సాహిత్యానికి అనుబంధంగా ఉండి ఏ భాగానికి ఆ భాగం కాక మొత్తం వర్ణం కలిపి పాడటం జరిగేది. ఉదాహరణకి శ్యామ శాస్త్రుల వారి కల్యాణి రాగ వర్ణం నీవేగతి యని తిశ్ర మఠ్యతాళ వర్ణం ఈ క్రింది విధం గా ఉంటుంది.

**పల్లవి:**

నీవే గతి యని నెరనమ్మినాను జగదంబ

నీ వనాధ రక్షకి మా యమ్మ

**అనుపల్లవి:**

రావే వేవేగమే మనవి వినమ్మ

శ్రీ రాజరాజేశ్వరీ దేవి

**ముక్తాయిస్వరం:**

నీస దనిదద పమపదపాదమదమగరిసారిగమపగామపదని||

దగరి నిరిని దనిదమగరిసా, దా, నీ, సా, రీ, గమాపాద || నీవే

**చరణం:**

కామ కోటి పీఠనివాసిని కళ్యాణి.

తరువాత 4 చిట్ట స్వరముల తరువాత ఈ పైన ఇవ్వ బడిన ముక్తాయి స్వర కూర్పు కు తగినట్టుగ అనుబంధ సాహిత్యం ఈ క్రింది విధంగా ఉంది.

"నీదు చరితము విని పాద కమలమును కోరితిని సదా గతి యని పొగడి పొగడి చరణము గొలిచేనమ్మ బంగారు కామాక్షి" నీవే గతి యని|| అని సాగుతుంది. అయితే కాల క్రమేణా సంగీత మూర్తి త్రయానికి తరువాతి వాగ్గేయ కారులు ఈ వర్ణం అనే రచనలోని ప్రాముఖ్యత గుర్తించి సంగీతవిద్యా ర్థులకు ఉపయుక్తంగా కొన్ని వందల వర్ణాలను రచించటం జరిగింది. ఆ క్రమంలో ఈ అనుబంధం అనే భాగం మరుగున పడిపోయింది.

నిన్ను కోరి అనే మోహన రాగ వర్ణం, సామిన్నే కోరి అనే శంకరాభరణ రాగ వర్ణం లాంటివికొన్ని ప్రసిద్ధ వర్ణాలు. పట్ణం సుబ్రహ్మణ్య అయ్యర్, వీణ కుప్పయ్యర్, స్వతి తిరుణాల్, పొన్నయ్య పిళ్ళై వంటి వారు వర్ణ రచయితలకు ఉదాహరణలు.

ఈ సారికి తాన వర్ణాల ప్రస్తావన కొంతవరకూ చూశాం కదా ఇక మిగతా వివరాలు మళ్ళీ వచ్చే సంచికలో వర్ణాల గురించి తెలుసుకుందాం. ఇప్పటికి సెలవు.

పైన తెలిపిన వర్ణం శ్రీమతి నీల రామగోపాల్ గారి గళంలో ఈ లింకు ద్వారా విని ఆనందించండి.

https://www.youtube.com/watch?v=lRZNHnKR--I

❖❖❖❖❖



మీకందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

# ఒకే ఒక బాలు

-శ్రీమతి అపర్ణ చెన్నాప్రగడ, కాలిఫోర్నియా



ఓం కార నాదాను సంధానం

ఓం నమః వంటి మధురమైన గానం

యురేకా సకా మికా

తాళం ఉన్నా పదం తిక మక,

బంగారు కోడి పెట్ట కూత,

పింగు పాంగు బాడీ పై పాట

కాదేది మీ రమణీయమైన బాణీలకనర్హం.

ఔనౌను మీ గానమమోఘం.

రాజా పాటకి వేటూరిని చేర్చిన,

జానకీ బాలూలని కూర్చిన

విశ్వనాథుని పంచామృతంలో

తేనెలా తీయనైనది మీ గానామృతం.

ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం,

మన తెలుగు వారు చేసుకున్న పుణ్యం.

అంకెల్లో కుదించి చెప్పాలంటే..

నోటి తో నే నవరసాలు.

నూటొక్క హీరోలు.

నలభై వేల పాటలు.

కో అంటే కోట్లాభిమానులు.

...

...

ఒకే ఒక బాలు.

WESTMEAD
DOCTORS



Shop 6, Coles Complex
29-33 Darcy Road
WESTMEAD

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

ONSITE PATHOLOGY



**Dr. Murali Thiruvengadam**
MBBS, FRACGP

Principal GP, Conjoint Lecturer
Western Sydney University

Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam

RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE

P: (02)88891383 | F: (02)86254326

# Bulk Billing

OPEN 7 DAYS

New Medical Centre at
## Quakers Hill

Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm

G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763

88891383
Fax: 86254326

www.railwayroadmedical.com.au

# వాహిని ఈ మాసపు ప్రశ్నావళి

**'తెలుగు వాహిని'** మాసపత్రికలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినవారిలో **ఒకరికి** **Just Cakes** వారిచే $25 విలువ గల Gift Voucher కానుకగా అందించబడుతుంది. సమాధానాలు Vahini@sydneytelugu.org e-mail కు డిశెంబర్ 28 వ తేదీలోగా **పంపగలరు.**

**ఈ మాసపు ప్రశ్న**

**'బుడుగు' సృష్టికర్త బాపు గారి అసలు పేరు ఏమిటి?**




మీకు నచ్చిన రెండు తెలుగు సామెతలు పంపండి

జవాబు:

1. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి.
2. దురాశ దుఃఖమునకు చేటు.

జవాబు:

**శ్రీమతి జానకి వనం, హైద్రాబాద్**

## వాహిని పాఠకుల స్పందన

తెలుగు వాహిని సర్వాంగ సుందరంగా 1వ తేదికి ఖచ్చితంగా పాఠకులకు చేరడానికి సంపాదకీయవర్గ కృషి అభినందనీయం.
దేవులపల్లి వారిపై కవిత,వ్యాసము ఎంతో ఆకట్టుకున్నాయి.
ఎప్పటిలాగే అన్ని శీర్షికలు చాలా బాగున్నాయి.

**శ్రీమతి విజయ చావలి, సిడ్నీ**

అంతర్జాలంలో తెలుగు భాష ప్రవాహంవలె సూర్యకిరణాల వలె తెలుగు వెలుగుతుందంటే అది శ్రీమతి విజయ గొల్లపూడి గారి సంపాదకీయం.
వాహిని సంపాదకులకు కృతజ్ఞతలు తెలుపుతూ నేను రాసిన "కార్తీక మాస విశిష్టత" వాహినిలో ప్రచురించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.
గీతాభాష్యం, కథలు, జోకులు, కవితలు, సంగీతం-సాహిత్యం అందిస్తూ అన్ని వయసుల వారికి ఆసక్తిదాయకంగా ఉంది.
భగవద్గీత విశ్లేషణ చాలా బాగుంది. కృష్ణశాస్త్రి గారి మీద కవిత చాలా ఆకట్టుకుంది.
డి.కామేశ్వరి గారి "మహిమ" బాగుంది. కరోనా కథ బాగుంది.
దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు గుర్చిన వివరాలు తెలియపరచినందుకు ధన్యవాదాలు. తెలుగుసాహిత్యంలో వెలుగుని పిట్రాన్ చాలా బాగుంది.  మాస్కులూ-రిస్క్ లూ కథ బాగుంది. నా నీ స్వచ్ఛ విశ్వం ప్రాస బాగుంది.


శ్రీమతి లలిత రాంభట్ల,హైద్రాబాద్

ముందుగా 'వాహిని' సంపాదకులు శ్రీమతి విజయ గొల్లపూడి గారికి కృతజ్ఞతలు... అడుగడుగునా నన్ను ప్రోత్సహిస్తూ నా అభిప్రాయాలకు  విలువ ఇస్తున్నందుకు వారికి నా అభిమాన వందనాలు... ఈ నెలలో నా కథ "కొ రోనా" ప్రచురించినందుకు మరీ మరీ కృతజ్ఞతలు... నన్ను **'ఉత్తమ పాఠకురాలు'గా** ఎన్నుకున్నవారి సునిశిత పరిశీలనా శక్తికి నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది...
ఎటువంటి సమస్యలన్నయినా ఎదుర్కోవాలనే విజయగారి సంపాదకీయం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది... వారన్నట్లుగా సాంకేతికతను ఎలా వాడుకోవాలో కొరోనా నేర్పించింది...
అర్జునుడిని శ్రీ కృష్ణ పరమాత్ముడు ఎలా కార్యోన్ముఖుడిని చేసాడో, శ్రీ పెయ్యేటి రంగారావుగారు ఈ సంచికలోని భగవద్గీతలో చక్కగా వివరించారు...శ్రీమతి లలితగారు కార్తీక మాసంలో వచ్చే పుణ్య తిథుల గురించి మంచి వివరణ ఇచ్చారు...
వంశీ రామరాజుగారి 'గుర్తుకొస్తున్నాయి'లో దేవులపల్లివారిపై అందించిన ప్రత్యేక కథనం చాలా వివరణాత్మకంగా ఉంది...
శ్రీ పెయ్యేటి రంగారావుగారి 'అలారం' కథ ఆద్యంతం సరదగా సాగింది...
వంగూరి చిట్టెన్ రాజుగారి 'మాస్కులు – రిస్కులు' కథలో మాస్కులతో వచ్చే ఇబ్బందులను తనదైన హాస్యధోరణితో నవ్వులు పంచారు...డా. కొల్లూరి వారి 'తెలుగు సాహిత్యంలో నానీలు' పై ఇచ్చిన విశ్లేషణ బాగుంది...
మధ్య తరగతి ఇళ్ళల్లో ప్రతి ఇంట్లో జరిగే వాస్తవాలను డా.జడా సుబ్బారావుగారు తన 'వానప్రస్థానం'లో చెప్పిన తీరు కళ్ళకు కట్టినట్లుగా ఉంది...శ్రీమతి డి.కామేశ్వరిగారి 'మహిమ' ధారావాహికం ఉత్కంఠభరితంగా సాగుతోంది...
మోడర్న్ బేతాళుడు బాగున్నాడు...ఈ నెల వాహిని ఆద్యంతం సర్వాంగ సుందరంగా, ఆసక్తికరంగా పాఠకుల్ని ఆకట్టుకునేల ఉంది...

**శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్**

❖❖❖❖❖

తెలుగింటి గీత బాపుగారైతే, తెలుగువారి రాత ముళ్ళపూడి వెంకట రమణ గారు. వీరిరువురిని విడదీసి చూడటం సాధ్యం కాదు. అంత చక్కని ఆదర్శమైన మైత్రిబంధం వారిది. శ్రీ శంకర నారాయణగారు కుంచెతో చిత్రీకరించిన అపురూప చిత్రం. బాపుగారి జయంతి డిశెంబర్ 15 వ తేదీ సందర్భంగా ఆ మహానుభావునికి తెలుగు వాహిని అర్పించే అంజలి..




❖❖❖❖❖






SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

-శ్రీమతి డి. కామేశ్వరి, హైద్రాబాద్



"ఓకే సార్" అని "ప్లీజ్ రండి ... నా ఆఫీసులో సంతకాలు పెడుదురుగాని" అని సుధాకర్ దారితీశాడు.

వినోద్ వెనక్కి వాలాడు కుర్చీలో విలాసంగా. వినోద్‌కి పేరుకి తగ్గట్టు వినోదం కావాలి. విలాసం కావాలి. కొత్త అందాలు కావాలి. జీవితం అంటే విలాసంగా, ఆనందంగా అనుభవించాలనే తత్వం. చాలా తొందరగా అందానికి ఆకర్షితుడవడమే కాదు, ఆ అందం సొంతం అయ్యేవరకు అలజడి, పొందాలనుకున్న దానికోసం ఎవరేమనుకున్నా లెక్కచెయ్యని మనస్తత్వం. చేతినిండా డబ్బు, ఇంటినిండా డబ్బు, ఆఫీసునిండా అమ్మాయిలు ... ఇంకేం కావాలి. వేటికీ వెతుక్కోనక్కరలేదు. వలకి ఎరగా కళ్ళకి కనిపిస్తూ ఊరించే భవిష్యత్తు చూపించే ఫ్యాషన్ వరల్డ్, కష్టపడకుండా అమ్మాయిలను వలలో పడేసుకునే అందం, డబ్బు, యవ్వనం, మాట చాతుర్యం, అన్నీ ఉన్న వినోద్‌కి కొత్త అందాలు, అమ్మాయిలు వినోదం !

ఇన్నీ ఉన్న వినోద్‌కి ఇంట్లో మిగతావన్నీ మెండుగా ఉన్నా అందమైన ఆ అనుభవం మాత్రం అనుభవంలోకి రాలేదు. భార్య అందంగా ఉంటే ప్రేయసిని చూడగలిగేవాడేమో ! వ్యాపారం దివాలా తీసి తిరిగి నిలదొక్కుకోడానికి తండ్రి అవస్థలు పడుతున్న తరుణంలో ... కళ్ళెదుట కనిపించిన దారి భారీ పెళ్ళి కూతురితో పాటు వచ్చే భారీకట్నం, కోట్లిస్తామన్నా కూతురి చేయి అందుకోడానికి ముందుకు రాని వాళ్ల సంఖ్య పెరిగిపోతున్నకొద్దీ, కోట్ల ఆస్తి ఉన్న తండ్రి రేటు పెంచుతూ పెంచుతూ పోయాడు. చూస్తూ చూస్తూ మరీ లేనింట్లో పిల్లని పడేయలేక, దారీ తెన్నూ తోచక సతమతమవుతున్న కన్న తండ్రికి, వ్యాపారం దెబ్బతిని తేరుకోవ డానికి మార్గాలు అన్వేషిస్తున్న జైన్ కుటుంబం కనిపించింది. మధ్యవర్తి ద్వారా కోట్ల ఆస్తి ఎరగా చూపాడు. అంతస్తులు, ఆస్తిపాస్తులు అన్నీ సరితూగేవైనా చూస్తూ చూస్తూ అందంగా, స్మార్ట్‌గా చదువుకున్న వినోద్‌కి జోడు కుదరని ఆ అమ్మాయిని కట్టబెట్టలేక మథనపడుతుంటే ... 'డాడీ, మనం ఈ గండంలోంచి గట్టెక్కే మార్గం ఇదొక్కటే. అందంగా లేకపోయినా ఫరవాలేదు,

డబ్బు లేకపోతే ఎలా బతుకుతాం ? అందులో ముందునుంచీ దర్జాగా బతికినవాళ్లం. దరిద్రాన్ని ఎలా కావలించుకుంటాం' ? బతకనేర్చిన వినోద్ తండ్రికి ధైర్యం చెప్పి సలహా ఇచ్చాడు. అప్పటికింకా విశాల్ చదువు పూర్తవలేదు. కూతురి పెళ్ళి చేయాలి. ఇల్లు తాకట్టులో ఉంది. ఈ సమస్యలన్నీ కళ్ళముందు కదలాడుతుంటే ... మరో మార్గం లేక తలొగ్గాడు అవినాష్ జైన్.

కొత్త కోడలితో వచ్చిన కోట్ల ఆస్తితో అప్పులు తీర్చి, వ్యాపారంలో నిలదొక్కుకుని ఊపిరి పీల్చుకున్నారు అందరూ. అందం లేకపోయినా ఒంటి నిండా అహంకారం ఉంది సుస్మితా అగర్వాల్‌కి. కోట్ల ఆస్తికి వారసురాలు. మొగుడయితేనేం, అత్తవారయితేనేం తల ఒగ్గాల్సిన ఖర్మ తనకేం ఉంది. తన వల్ల కంపెనీకి పునర్జీవితం వచ్చింది. తన డబ్బుతో తినేవారు తనకు ఎదురు చెప్పే సాహసం చెయ్యకూడదు అన్న మనస్తత్వం. అత్తవారింట అడుగుపెడుతూనే కంపెనీలో పెద్ద షేర్ సొంతం చేసుకుంది. ఇల్లంతా తనిష్టం వచ్చినట్టు మార్పులు చేర్పులు చేసేసింది. అత్త, మామ, మొగుడు ప్రేక్షకపాత్ర పోషించారు. ధనరాశితో వచ్చిన భార్యని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో ఏడాది గడిచిపోయింది. నోరెత్తకుండా కాపురం చేసి వంశోద్ధారకుణ్ణి కన్నాడు. ఇంట్లో కోడలి పెత్తనానికి అలవాటుపడి మామగారు ఆఫీసుకి, అత్తగారు పూజగదికి అంకితమయ్యారు. కూతురి పెళ్ళి చేసి పంపి నిశ్చింతగా నిట్టూర్చారు. తండ్రి మీద గౌరవంతో ఛైర్మన్ పోస్టులో కూర్చోపెట్టాడు వినోద్. ఎం.బి.ఎ. పూర్తిచేసి వచ్చిన తమ్ముడికి తనతోపాటు మేనేజింగ్ డైరెక్టర్ పదవి ఇచ్చి, ఆ ఇంటి కొడుకుగా కర్తవ్యం నెరవేర్చాడు. ఆరేళ్ల కొడుకు ముద్దుమురిపాలు చూసి మురిసిపోతూ, కొడుకు మంకుపట్టుకి తల ఒగ్గి ప్రేమంతా కుమ్మరిస్తూ, కొడుకు పెంపకంలో తలమునక లవుతూ కాస్తంత అహం, అహంకారం తగ్గింది ఇల్లాలి పాత్ర నుంచి తల్లి పాత్రలోకి మారేసరికి సుస్మిత మనసు కాస్తంత సున్నితం అయి, ఇంట్లో అత్తమామల్ని, తనకు ఎదురుచెప్పని భర్తని గౌరవంగానే చూడడం ఆరంభించింది. దానికి తోడు

కంపెనీ ఎనిమిదేళ్లలో బాగా పుంజుకుని లాభాలబాట పట్టడంతో, అందులో మామగారు, మరిది పాత్ర చాలా ఉండడం, తను మరీ అతిశయం చూపిస్తే సహించని స్థాయికి వారి సంపాదన పెరగడంతో సుస్మిత ఇంట్లో పవరు, ఒంట్లో పవరు తగ్గించుకుంది.

వినోద్ పెళ్ళయితే చేసుకున్నాడుకాని, నిజం చెప్పాలంటే ఒక్కరోజు కూడా సుఖంగా లేడు. అడుగడుగునా అహంకారం చూపే భార్య అందమైనా చూసి సర్దుకుపోదామన్నా, అదీ ఊరించే ఊహాల్లో తప్ప నిజజీవితంలో దొరక్క, నిర్లిప్తత నిండిన కాపురంలో రోజులు నెట్టుకొచ్చాడు కొన్నాళ్లు. ఒకటే ఓదార్పు ... కొడుకు పుట్టడం. తల్లిదండ్రులకి మనవణ్ణి ఇచ్చానన్న తృప్తి. భార్య దృష్టి తనమీద నుంచి కొడుకుపైకి మళ్లడంతో ఊపిరి పీల్చుకుని కేవలం నాలుగేళ్ళు కంపెనీని నిలబెట్టే ప్రయత్నంలో రాత్రింబగళ్లు మునిగిపోయి తనలోని నిరాశ, నిస్పృహని మరిచి పోయాడు.

కంపెనీ వ్యవహారాలు కుదుటపడి, తండ్రి, తమ్ముడు తోడయి బరువు బాధ్యతలు కాస్త తగ్గి ... చుట్టూచూడడం ఆరంభించాడు. ప్రకటనల ప్రపంచంలో, ఫ్యాషన్ వరల్డ్‌లో అందమైన అమ్మాయిలను చూసినప్పుడల్లా చలించేవాడు. భార్య గుర్తువచ్చి తనకు దొరకని అందమైన అనుభూతికోసం మనసు ఉవ్విళ్లూరేది. కానీ, ఆ అందాలు ఎలా అందుకోవాలో తెలిసేది కాదు. పిరికితనం ఒక కారణమైతే, ఎవరికైనా తెలుస్తుందేమో, పరువు ప్రతిష్ఠ అన్నీ గుర్తువచ్చేవి. ఎంతోమంది అమ్మాయిలు కెమెరా ముందు నటించడానికి, చిన్న ప్రకటనలోనైనా కనపడాలని ఉవ్విళ్ళూరుతూ, ఆఫీసు చుట్టూ తిరిగేవారు ఫోటోలు చేతపట్టుకుని. వినోద్‌ది విజువల్స్ సెక్షన్ కనుక యాడ్ షూటింగులు, నటీనటులు, డైరెక్టర్లు, పూర్తయిన యాడ్‌లు చూసి ఓకే చెయ్యడం అంతా అతని పర్యవేక్షణలో ఉండడంతో, రోజూ ఎంతోమంది అమ్మాయిలు అతని దృష్టిలో పడి అతన్ని నిద్రకి దూరం చేసేవారు. ఆ అందం అందుకోవాలన్న తపన, ఆరాటం రోజురోజుకి పెరిగింది.

ఆ సమయంలో అన్వర్ అతనికి పర్సనల్ డ్రైవర్ కమ్ అటెండెంట్‌గా వినోద్‌కి ఎప్పుడేం కావాలో చూసుకుంటూ అతనిని అంటిపెట్టుకునే మనిషి అయ్యాడు. అన్వర్ బతకనేర్చినవాడు. అయ్యగారి సంగతి, ఇంటి సంగతి క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి అట్టే సమయం తీసుకోలేదు. అమ్మాయిలని చూడగానే అయ్యగారి ఆకలిచూపులు అర్థం చేసుకున్నాడు. అయ్యగారి మనసు దగ్గరవడానికి, అతని ప్రాపకం సంపాదించడానికి దగ్గర దారి దొరికిపోయింది. వినోద్ మంచితనం, ఇంట్లో అతని భార్య ధోరణి చూశాక అన్వర్‌కి అయ్యగారి మీద ఎనలేని జాలి, అభిమానం పొంగింది. వినోద్ పిరికితనం అర్థం అయింది. కాస్తంత చొరవ తీసుకోలేని అతనికి సహాయపడాలనుకున్నాడు. కానీ, ఎలా అన్నది అతనికి అర్థం కాలేదు ముందు.

ఒకరోజు శిల్ప అనే అమ్మాయి స్క్రీన్ టెస్ట్‌కి వచ్చి సెలెక్ట్ కాలేదు. నిరాశ, నిస్పృహ, ఏడుపు ఒక్కటే తరువాయి అన్నట్టు మొహం నల్లబడి కంటతడితో నిస్సహాయంగా చూస్తూ లిఫ్ట్‌లో ఎక్కిన శిల్పని చూశాడు. అతనికి ఆ అమ్మాయిని చూస్తే సంగతి తెలిసిపోయింది. అప్పటికి ఏణ్ణర్థం అయిందేమో కంపెనీలో చేరి. ఇలా ఎంతో ఆశతో వచ్చి రిజెక్ట్ అయిన అమ్మాయిలు నిరాశ తట్టుకోలేక కళ్లనీళ్లతో వెళ్లడం చూశాడు అన్వర్. అందులో కాస్త లేనింటి అమ్మాయిలు, అందాన్ని నమ్ముకుని వచ్చినవాళ్లు ఆశాభంగం అస్సలు తట్టుకోలేరు. ఈ అమ్మాయి బాగానే ఉంది. పెద్ద కళ్ళు, మంచి ఫిగరు. రంగు చామనచాయ అయినా స్మార్ట్‌గానే ఉంది. మరి ఏమయిందో అనిపించింది అన్వర్‌కి. "ఏమిటి సెలెక్ట్ కాలేదా" ? చనువుగా అడిగాడు. ఆ అమ్మాయి అన్వర్ వంక ఓ చూపు చూసి లేదన్నట్టు తల ఊపింది.

"అరే, అదేమిటి ఇంత చక్కగా ఉన్నావు. ఎవరా రిజక్ట్ చేసింది సుధాకర్ సారా ... ఆయనో తిక్కలోడు ..." అంటూ ఏదో ఆలోచన తట్టినట్లు ... "మా సార్ చూసుంటే రిజెక్ట్ చేసేవారు కాదు" అన్నాడు. ఆ అమ్మాయి కళ్ళలో ఆశ.

"మీ సారా ? ఎవరు ... ?" అంది కాస్త ఆశ్చర్యపడ్తూ.

"మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ సార్ ఆయనే కదా, ఈ సెక్షన్‌కు బాస్".

శిల్ప కళ్ళల్లో మెరుపు ... "ఆయన చూస్తారా మాలాంటి వాళ్లని".

"ఇదిగో నీ పేరేమిటి ... శిల్ప. సరే, నీ ఫోటోలు, నీ బయోడేటా అవి ఉన్నాయి గదా, అవి నాకియ్యి. నీ ఫోన్ నెంబరుందా, నేనివాళ మా అయ్యగారికి చూపిస్తా. రేపు ఇదే టైముకి రా ... సరేనంటే మిగతావి చూద్దాం. లేదంటే నీ ఫైలు తీసుకెళ్లచ్చు" ఆ మాత్రం దానికే శిల్ప సంబరపడిపోతూ "నిజంగా నువ్వు చెపుతావా? నీ మాట వింటారా" ?

"వినోద్ సార్ పర్సనల్ అసిస్టెంట్ కమ్ డ్రైవరు అన్నీ నేనే. చెప్పిచూస్తా. నీ అదృష్టం పరీక్షించుకో ..." అని ఆశ చూపాడు.

"థాంక్స్ అన్నా ! నాకీ ఉద్యోగం ఎంతో అవసరం. నాన్న లేరు. అమ్మ ఒక్కర్తే. చిన్న జాబ్ చేస్తుంది. నాకీసాయం చేస్తే నీ మేలు మర్చిపోను" దండం పెడుతూ అంది.

"చూస్తానన్నాగా ... హోప్ ఉంటే ఫోన్ చేస్తా. లేదంటే వచ్చి నీ ఫైలు తీసుకెళ్లు" అని ఆమె అందించిన ఫైలు తీసుకున్నాడు. అన్వర్ దగ్గరనుంచి ఫోన్ రాగానే ఆఘమేఘాల మీద వచ్చినట్టు వాలిపోయింది శిల్ప. "ఏమన్నారు ? నన్ను సెలెక్ట్ చేసుకుంటారా ? నాకు ఛాన్సు ఇస్తారా ?" అంది ఆరాటపడిపోతూ. "అన్నా, ఎలాగైనా పని జరిగేట్లు చూడు".

"చూడు శిల్పా ... నా ప్రయత్నం నేను చేశాను. ఇంక చెయ్యాల్సింది నువ్వే. సార్‌ని ఎలా మెప్పిస్తావో నీ చేతుల్లో ఉంటుంది".

"అంటే నేనేం చెయ్యాలో చెప్పు ... అలా చేస్తాను".

"సార్‌ని మెప్పించు. నీకు మంచి భవిష్యత్తు కావాలంటే, గుర్తింపు ఉండాలంటే సార్ చేతుల్లో ఉంటుంది. ఆయన ఇష్టమే ఫైనల్".

సగమే అర్థమైన శిల్ప తల ఆడించింది.

**(సశేషం)**

❖❖❖❖❖

# మానవత్వానికి చిరునామా

-శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ

లక్ష్మణరావు తనలో తనే కుమిలిపోతున్నాడు జైల్లో నాలుగు గోడల మధ్య. తనతో అదే సెల్ లో ఉంటున్న తోటి ఖైదీ అడుగుతున్నాడు

"చెప్పు, నీకు ఇంత పెద్ద వయసులో ఈ దుస్థితి ఏమిటి?

నువ్వు చేసిన నేరం ఏమిటి?

నీకు నా అన్నవాళ్ళు ఎవరు లేరా? నిన్ను చూడటానికి ఎవరు ఇంతవరకు రాలేదు. చెప్పు నీ మనసులో భావాలు ఒక మనిషితో పంచుకుంటే, కొంతైనా నీ ఆవేదన తీరుతుంది.

వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను నిన్ను. అలా శూన్యంలోకి చూస్తూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నావు. ఏమీ తినలేదు. మాట్లాడు దోస్త్ అని ముప్పై ఏళ్ళ ఖైదీ విశ్వ అడిగాడు.

కన్నీళ్ళు తుడుచుకున్నాడు. నోరు పెగలటం లేదు లక్ష్మణరావుకు..

"ఇదిగో ముందు కాస్త మంచినీళ్ళు తాగయ్యా" అని విశ్వ అందించాడు.

అపుడు లక్ష్మణరావు ఆశ్చర్యంగా అన్నాడు, "ఏమిటి! ఖైదీలకు కూడా మనసు ఉంటుందా? నువ్వు నాతో మానవత్వం ఉన్న మనిషిగా ఇలా మాట్లాడుతుంటే వింతగా ఉంది. "

విశ్వ అన్నాడు, "బుద్ధి గడ్డి తిని ప్రభుత్వోద్యోగం చేస్తూ అత్యాశకు పోయి అందరి దగ్గర లంచాలు తీసుకున్నాను. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారింది, నా బండారం బయటపడింది. ఇదిగో ఇలా ఊచలు లెక్కిస్తున్నాను. నా భార్య, కొడుకు ను చూసుకోవడానికి, నా బావమరుదులు ఉన్నారు. సరే జీవితంలో నాకిదో గుణపాఠం అనుకుంటున్నాను."

అంతా విన్నాక లక్ష్మణరావుకి అతనితో తన గుండెలోని భారాన్ని దించుకోవాలనిపించింది. చెప్పటం మొదలుపెట్టాడు. నేను ఒక చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ నా భార్య తో కొంతకాలం బాగానే ఉన్నాను. ఆ తర్వాత మాకు ఎంతకీ పిల్లలు కలగకపోయేసరికి, నేను, నా భార్య అనాధ శరణాలయం నుంచి చలాకీగా కనిపించిన పదేళ్ళ అబ్బాయిని తెచ్చుకుని అల్లారుముద్దుగా పెంచుకున్నాము. వాడికి అడిగినదల్లా కాదనకుండా ఏది కావాలంటే అది కొనిచ్చేవాడిని. నాభార్య ఊర్మిళ కూడా వాడిని బాగా గారం చేసేది. స్కూల్లో బాగానే చదివేవాడు. కానీ ప్రతిదానికి మొండి మంకుతనం పట్టేవాడు. తను అనుకున్నది చేసితీరాలి. అన్నీ తనకే కావాలి అనే స్వార్థం ఉండేది. వయసుతో పాటు అన్నీ నేర్చుకుంటూ, తెలుసుకుంటాడులే అనుకుంటూ నా పెంపుడు కొడుకు అభిలాష్ ను గారం చేస్తూ వచ్చాను. కాలేజీ లో మంచి మార్కులు తెచ్చుకున్నాడు. స్నేహితులతో మంచిగా కలివిడిగా ఉంటూ అన్ని విషయాలు ఇట్టే పసిగట్టేవాడు. ఇంజనీరింగ్ చదువుతానని పట్టుపట్టి బి.టెక్ పూర్తి చేసాడు. నేను మహదానందంగా నా సంపాదనంతా వాడికే ఖర్చు పెట్టేవాడిని. నా భార్య ఊర్మిళ కూడా "మనల్ని ఉద్ధరించడానికి మా కోసమే ఈ భూమి మీదకు వచ్చావురా బిడ్డ " అంటూ సంబరపడేది. రేపు నా ఉద్యోగభారం తీరిపోతే, ఇంక మమ్మల్ని చూసుకునేది వీడే కదా. నేను తనువు చాలిస్తే పున్నామ నరకం నుంచి తప్పించి, తల కొరివిపెట్టాల్సిన వాడు వీడే కదా అనుకునేవాడిని. అభిలాష్ చదువు పూర్తి కాగానే జాబ్ తెచ్చుకుని, తల్లిదండ్రుల చేతికి అంది వస్తాడు కదా అని మేము భావించాము. కానీ అతని ఆలోచనలు వేరే దిశలో సాగాయి. తన స్నేహితులు అమెరికా వెడుతుండటం చూసి తను కూడా వెళ్ళి తీరాలని పట్టుబట్టి నా దగ్గర ఉన్న చిన్న పొలం అమ్మించేసాడు. అమ్మగా వచ్చిన డబ్బుతో అమెరికా వెళ్ళి అక్కడ ఎమ్.ఎస్ చేసి మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

ఇక్కడ ఆ వెర్రి తల్లి ఊర్మిళ కొడుకు ఎప్పటికపుడు వస్తాడు. పెళ్ళి చేసుకుంటే వచ్చే కోడలు, పిల్ల పాపలతో ఇల్లు కళకళలాడాలి అని ఎదురుచూసేది. ఎప్పటికపుడు రేపొస్తా, మాపొస్తా అంటూ ఉండేవాడు గాని తల్లిదండ్రులైన మా యోగక్షేమాలగురించి పెద్దగా పట్టించుకునేవాడు కాదు అభిలాష్.

ఇలా ఉండగా నా భార్యకి దిగులుతో, కొడుకు గురించి ఆలోచనలతో, బెంగతో మంచం పట్టింది. డాక్టర్లకు చూపించినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. ఈ వయసులో కావలసింది అనుబంధం, తనకు అత్తయ్య అని కోడలు చేత పిలిపించుకోవాలనే ఆరాటం. మా విషయంలో జరిగినట్లు కాకుండా రేపు కొడుకు, కోడలికి కలిగే సంతానం పాపో, బాబో పుడితే ఎత్తుకుని, ముద్దాడి పెంచి, పెద్దచేయాలని ఆరాటపడింది. ఆ కోరిక తీరకుండానే నన్ను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోయింది నా ఊర్మిళ. అభిలాష్ వచ్చి మళ్ళీ వారం తిరక్కుండానే హడావిడిగా వెళ్ళిపోయాడు. వాడు వచ్చి నాకు భరోసా ఇస్తాడు అనుకున్నాను. మనసులో ఏ విషయం బయటపెట్టడు. స్వంత మనిషి అనుకున్నాను, వృద్ధాప్యంలో నాకు ఒంటరితనం ఉండదు. నాకు పెంచుకున్న కొడుకు ఉన్నాడు కదా! అని అనుకున్నాను. నిరాశగా రోజులు వెళ్ళదీస్తుంటే, రిటైర్మెంట్ నన్ను పూర్తిగా ఒంటరివాడిని చేసింది. ఆ పరిస్థితుల్లో ఇంక ఇలా ఉండలేనని భావించి, అభిలాష్ కి ఫోన్ చేసి తనతో కూడా వచ్చేస్తానని లేదా నువ్వైనా ఇక్కడకు వచ్చెయ్యమని గట్టిగా గొడవ చేసాను. శెలవు పెట్టుకుని వచ్చాడు. బ్యాంకులో ఉన్న నా ఆస్తంతా తన పేర రాయించుకున్నాడు. నన్ను తనతో కూడా అమెరికా తీసుకువెడతానని నమ్మబలికాడు. అక్కడితో ఊరుకోకుండా నాకున్న ఒకే ఒక ఆధారం ఇల్లు అమ్మించేసాడు. పూర్తిగా డబ్బంతా తన పేర ట్రాన్స్ఫర్ చేయించేసుకున్నాడు బ్రతక నేర్చిన అతి తెలివితేటలతో. నేను వాడితో వెడతాను కదా ఈ ఆస్తి నేనేమి చేసుకుంటాను అని గుడ్డిగా నమ్మాను. “నాన్నా! ముందు మనం ముంబాయ్ వెడదాం, ఎంబసీ కి వెళ్ళాలి” అన్నాడు. నన్ను రైలు స్టేషన్ కి తీసుకెళ్ళి, వెయిటింగ్ రూము లో కూర్చోబెట్టి, “నేను కొన్ని డాక్యుమెంట్లు తెచ్చుకోవాలి, అరగంటలో వస్తాను” అని వెళ్ళాడు. రెండు రోజులైనా రాలేదు..

అప్పుడు నాకు అర్థమయింది. నా కొడుకు చేతిలో నేను దారుణంగా మోసపోయానని. ఐనా అనుమానం తీరక,స్టేషన్ మాస్టర్ దగ్గరకి వెళ్ళి వాకబు చేసాను. ఆయన రికార్డులు చూసి అభిలాష అన్న వ్యక్తి రెండురోజుల క్రితమే బొంబాయి వెళ్ళిపోయాడు. అతడి పేరు మీద ఇందులో ఏ.సి. కోచ్ లో బెర్త్ రిజర్వ్ అయినట్లుగా వుంది' అని చెప్పారు.

నాకు అమాంతం నేల క్రింద కదులుతున్నట్లనిపించింది.శరీరంలో నవనాడులు క్రుంగిపోయాయి. నా పెంపకంలో ఏమిటి లోపం అని మధనపడ్డాను. పేగు తెంచుకుని బిడ్డలే తల్లిదండ్రులను సరిగా చూసుకోని ఈ రోజుల్లో పెంపుడు కొడుకు కు తనతో బంధం ఏర్పరుచుకోలేదని నెత్తి, నోరు బాదుకున్నాను.

నా చేతిలో చిల్లిగవ్వ లేదు. తినడానికి తిండి లేదు. నాకంటూ ఎవరూ లేరు ఈ భూమ్మీద అనిపించింది. పిచ్చిపట్టినవాడిలా ఉన్మాదినైపోయి స్టేషన్ లో కనిపించిన రైలులోకి ఎక్కేసాను. ఎదురుగుండా సీట్లో ఖరీదైన దుస్తులలో ఒక భూకామందు కూర్చున్నాడు. చేతిలో సూట్ కేసు చూసాను. నిద్రలోకి జారుకున్నాడు. అదను చూసి ఆ పెట్టె తీసుకుని వెంటనే రైలు దిగిపోయాను. బయటికి వచ్చి ఆటో ఎక్కుదామనుకునేలోపు నన్ను ఇద్దరు పోలీసులు చుట్టుముట్టి బేడీలు తగిలించారు. హమ్మయ్యా! నేను అనుకున్నట్లుగానే జరిగింది, నా పథకం పారింది. నా శేషజీవితం జైల్లో గడిపేయచ్చు. తిండికి, నిద్ర, రేపటిగురించి బెంగ తీరుతుంది అనుకున్నాను ఆ పరిస్థితిలో. కానీ ఇక్కడకు వచ్చాక నాకున్న బాధ రానురాను పెరిగిపోయింది. మనస్సు స్థిమితంలో లేదు. నా జీవితం ఇకపై వ్యర్థం అనిపిస్తోంది అంటూ గట్టిగా ఏడ్చేసాడు లక్ష్మణరావు. బయటనుంచి జైలర్ జరిగిన విషయాన్ని పూర్తిగా విన్నాడు. అరె! ఎంత పొరపాటు జరిగిపోయింది. బ్రతుకుతెరువు కోసం జైలును ఆశ్రయించాడా ఈ వ్యక్తి. మానవత్వం పూర్తిగా మంటగలిసిపోయిందా.......

తండ్రి అన్న ఆప్యాయత కూడా లేకుండా, అనుబంధంతో పెంచుకున్న కొడుకు పాశాలను త్రెంచేసాడా? లేదు, ఆ ద్రోహిని అలా వదిలిపెట్టకూడదు అని జైలర్ శేఖర్ లో కోపం రగిలింది. ఈ విషయం గురించి పై అధికారులతో చర్చిస్తాను. నేను చేసే వృత్తికి న్యాయం చేయాలి, నిబద్ధతకు కట్టుబడినవాడిని అని దృఢంగా అనుకున్నాడు.

తక్షణమే జైలర్ శేఖర్ లక్ష్మణరావు దగ్గరకు వెళ్ళి కొడుకు వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. లక్ష్మణరావుని సముదాయించాడు.

“నాకు తల్లిదండ్రుల విలువ తెలుసు. మీరు నా తండ్రిలాంటి వారు. మీరేమి బాధపడకండి. మీకు తప్పక న్యాయం జరిగేటట్లు చూసే బాధ్యత నాది” అని జైలర్ శేఖర్ భరోసా ఇచ్చాడు. అనుకున్నట్లుగానే పై అధికారితో మాట్లాడి ఫైల్ ముందుకు కదిలేలా చూసి మొత్తానికి ఎలాగైతేనేం అభిలాష్ ఆచూకీ వివరాలు కనుక్కోగలిగారు.

కోర్టునుండి నోటీసులు వెళ్ళడంతో అభిలాష్ తిరిగి రాక తప్పలేదు. కోర్టులో జడ్జిగారు జరిమానా విధిస్తూ తండ్రినుంచి అక్రమంగా లాక్కున్న డబ్బు తిరిగి ఇచ్చివేయకపోతే కఠినచర్య తీసుకుంటారని హెచ్చరించారు

అంతే కాదు, ఇక నుంచి ప్రతినెలా అమెరికా నుంచి లక్ష్మణరావుకు మెయింటెన్స్ నిమిత్తం కొంత సొమ్ము పంపుతూ వుండాలని అంటూ, లక్ష్మణరావును ‘నీకు నెలనెలా జరుగుబాటుకు ఎంత అయితే సరిపోతుంది అనుకుంటున్నావు?’ అని అడిగారు.

లక్ష్మణరావు చేతులు జోడించి జడ్జిగారితో అన్నాడు, ‘అయ్యా, నా డబ్బు నాకిప్పించండి.  అది చాలు నాకు.  ఆ తుచ్ఛుడి సొమ్ము ఒక్క పైసా తిన్నా నాకు అరగదు.  అటువంటి కృతఘ్నుడి మొహం చూసినా పంచమహాపాతకాలు చుట్టుకుంటాయి.’ అన్నాడు.

‘సరే’ అని జడ్జిగారు రావలసిన మొత్తం లక్ష్మణరావుకు ముట్టచెప్పమని తీర్పు ఇచ్చారు.

అభిలాష్ గత్యంతరం లేక లక్ష్మణరావు అకౌంట్లో డబ్బు జమ చేసాడు. తండ్రితో మాట్లాడటానికి కూడా
ముఖం చెల్లలేదు.

లక్ష్మణరావుని జైలునుంచి విడుదల చేసారు. తోటి ఖైదీ విశ్వ ఆనందించాడు జరిగిన పరిణామానికి.

జైలర్ శేఖర్ లక్ష్మణరావు దగ్గరకు వెళ్ళి, "మీరు ఒంటరి కాదు. మా ఇంటికి రండి. మీకు కొడుకు లేడు అనుకోవద్దు. నన్ను మీ స్వంత కొడుకులా భావించండి. చిన్నతనంలోనే తండ్రి ప్రేమకు దూరమైన నాకు మీ తండ్రి ప్రేమ ప్రసాదించండి. నాకు మీ డబ్బు కూడా అక్కరలేదు. అది మీ అవసరాలకు వాడుకోండి" అన్నాడు.

దానికి లక్ష్మణరావు " వృద్ధాప్యంలో కలిగిన అగచాట్లను చవి చూసాను. ఈ దుస్థితి మరెవరికీ రాకూడదు. వృద్ధాశ్రమంలో వారి అభివృద్ధికోసం విరాళంగా ఇస్తాను బాబు. ఈ రోజు మానవత్వానికి చిరునామా ఎక్కడ ఉందో నీ ద్వారా తెలుసుకున్నాను శేఖర్!" అంటూ ఆనందభాష్పాలతో లక్ష్మణరావు అతని వెంట నడిచాడు.

❖❖❖❖❖



# కామేశ్వరి



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra times are finishing and Varjyam times are start to finish - Standard or Daylight Saving Time (AEST/NZDT) as applicable in Australia.

## డిసెంబర్ 2020

శ్రీ శార్వరి కార్తీక బ పాడ్యమి నుండి మార్గశిర బ పాడ్యమి వరకు

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిథి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

పంచాంగ కర్తలు: నేతి శివరామకృష్ణ శాస్త్రి (సిడ్నీ) & క్రా భాస్కర శర్మ (మెల్బోర్న్)

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆది**<br>రా - 16:30 to 18:30 | **School Holidays**<br>Vic: 19 Dec - 28 Jan<br>NSW: 18 Dec - 28 Jan | **6**<br>బ పంచమి 1:39<br>ఆశ్లేష 20:17<br>వ 8:55 - 10:32 | **13**<br>బ త్రయోదశి 9:22<br>విశాఖ 9:34<br>వ 13:10 - 14:36 | **20**<br>శు షష్ఠి 20:19<br>ధనిష్ఠ 1:7<br>వ 8:45 - 10:27 | **27**<br>శు ద్వాదశి 9:45<br>కృత్తిక 18:51<br>వ 5:27 - 7:14 |
| **సోమ**<br>రా - 7:30 to 9:30 | **Festivals & Holidays**<br>20 – Subrahmanya Shasti<br>25 – Christmas<br>26 – Boxing Day<br>30 – Datta Jayanti | **7**<br>బ షష్ఠి 1:8<br>మఖ 20:2<br>వ 8:10 - 9:45 | **14●**<br>బ చతుర్దశి 6:13<br>అనురాధ 7:8<br>వ 12:14 - 13:41 | **21**<br>శు సప్తమి 21:40<br>శతభిషం 2:34<br>వ 9:30 - 11:14 | **28**<br>శు త్రయోదశి 11:48<br>రోహిణి 21:8<br>వ 12:22 - 14:7 |
| **మంగళ**<br>రా - 15:00 to 16:30 | **1** కార్తీక<br>బ పాడ్యమి 22:13<br>రోహిణి 13:59<br>వ 5:11 - 6:56<br>వ 20:4 - 21:48 | **8**<br>బ సప్తమి 0:13<br>బ అష్టమి 22:42<br>పుబ్బ 19:15<br>వ 3:47 - 5:20 | **15**<br>బ అమావాస్య 3:13<br>జ్యేష్ఠ 4:58<br>వర్జ్యం లేదు<br>**హేమంత ఋతువు** | **22**<br>శు అష్టమి 23:43<br>పూర్వాభాద్ర 4:34<br>వ 15:11 - 16:57 | **29**<br>శు చతుర్దశి 13:19<br>మృగశిర 22:58<br>వ 3:10 - 4:53 |
| **బుధ**<br>రా - 12:00 to 13:30 | **2**<br>బ విదియ 23:48<br>మృగశిర 16:3<br>వర్జ్యం లేదు | **9**<br>బ నవమి 20:43<br>ఉత్తర 18:4<br>వ 2:6 - 3:37 | **16** మార్గశిర<br>శు పాడ్యమి 0:30<br>శు విదియ 22:19<br>మూల 3:1<br>వ 1:33 - 3:1<br>వ 12:1 - 13:31 | **23**<br>శు నవమి పూర్తి<br>ఉత్తరాభాద్ర 7:7<br>వ 20:37 - 22:25 | **30●**<br>శు పూర్ణిమ 14:23<br>ఆరుద్ర పూర్తి<br>వ 7:53 - 9:35 |
| **లక్ష్మి**<br>రా - 13:30 to 15:00 | **3**<br>బ తదియ పూర్తి<br>ఆరుద్ర 17:52<br>వ 1:5 - 2:48 | **10**<br>బ దశమి 18:19<br>హస్త 16:21<br>వ 1:52 - 3:21<br>వ 23:39 - 1:7 | **17**<br>శు తదియ 20:40<br>పూర్వాషాఢ 1:31<br>వ 9:15 - 10:48 | **24**<br>శు నవమి 2:7<br>రేవతి 10:7<br>వర్జ్యం లేదు | **31** మార్గశిర<br>బ పాడ్యమి 14:58<br>ఆరుద్ర 0:26<br>వ 12:51 - 14:31 |
| **శుక్ర**<br>రా - 10:30 to 12:00 | **4**<br>బ తదియ 0:54<br>పునర్వసు 19:7<br>వ 6:30 - 8:11 | **11**<br>బ ఏకాదశి 15:30<br>చిత్ర 14:16<br>వ 19:20 - 20:48 | **18**<br>శు చవితి 19:47<br>ఉత్తరాషాఢ 0:44<br>వ 4:42 - 6:17 | **25**<br>శు దశమి 4:45<br>అశ్విని 13:7<br>వ 8:37 - 10:25<br>వ 23:53 - 1:41 | **Sydney**<br>Sun Rise Set<br>1 5:38 19:50<br>8 5:38 19:56<br>15 5:39 20:01<br>22 5:42 20:04<br>29 5:46 20:07 |
| **శని**<br>రా - 09:00 to 10:30 | **5**<br>బ చవితి 1:27<br>పుష్యమి 19:55<br>వ 3:23 - 5:2 | **12**<br>బ ద్వాదశి 12:25<br>స్వాతి 12:2<br>వ 17:3 - 18:30 | **19**<br>శు పంచమి 19:37<br>శ్రవణం 0:33<br>వ 4:38 - 6:16 | **26**<br>శు ఏకాదశి 7:20<br>భరణి 16:2<br>వర్జ్యం లేదు | **Melbourne**<br>Sun Rise Set<br>1 5:52 20:26<br>8 5:51 20:33<br>15 5:52 20:38<br>22 5:55 20:42<br>29 5:59 20:45 |

shadananam kumkuma raktavarnam mahamathim divya mayuravahanam |
rudrasya soonum surasainya nadham guham sadaham saranam prapadye ||

## పాట నేర్చుకుందామా/పాడుకుందామా

చిత్రం: అభిమానం (1959)

సంగీతం : ఘంటసాల

గీతరచయిత : శ్రీశ్రీ

నేపధ్య గానం : ఘంటసాల, పి. సుశీల

పల్లవి :

ఊయలలూగీ నా హృదయం... తీయని పాట పాడేనే

ఊయలలూగీ నా హృదయం...

తీయని పాట పాడేనే... ఊయలలూగీ నా హృదయం

చరణం 1 :

తీవలతో సరాగాల తేలీ... పూవులతో సయ్యాటాడె గాలీ

తీవలతో సరాగాల తేలీ... పూవులతో సయ్యాటాడె గాలీ

ఎలమావి చేరీ.... చివురాకు మేసీ

ఎలమావి చేరీ.... చివురాకు మేసీ... కోయిల చనవుగ కూసేనే

ఊయలలూగీ నా హృదయం... తీయని పాట పాడేనే

ఊయలలూగీ నా హృదయం...

చరణం 2 :

రాగసుధాతరంగాల డోలా... వేడుకలా విహారాల వేళా

రాగసుధాతరంగాల డోలా... వేడుకలా విహారాల వేళా

చిన్నారి చెలియా... విన్నానమరయా

చిన్నారి చెలియా... విన్నానమరయా

నా మది పరవశమాయేనే....

ఊయలలూగీ నా హృదయం... తీయని పాట పాడేనే

ఊయలలూగీ నా హృదయం...

https://www.youtube.com/watch?v=atiyfkq3iGg

❖❖❖❖❖

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

# INDAUS IMMIGRATION

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

## What we do for Students

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***

Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com

# “నేను”

-చాందినీ బళ్ళా, సిడ్నీ

నాకెందుకు నేనన్న గర్వం.
గుప్పెడంత ఇసుకలో ఒక చిన్న రేణువు కాదా!!
నేను ఏమంత గొప్ప అని..
నాకెందుకు నేనన్న గర్వం..

నాకెందుకు నేనన్న స్వార్థం.
ఇప్పటికిప్పుడు పోతే పట్టించుకునే దిక్కుందా!!
నేను ఏమి దిగి రాలేదు కదా!
నాకెందుకు నేనన్న స్వార్థం..


నాకెందుకు నేనన్న పంతం.
నేను ఏమి అసాధ్యురాలిని కాదు కదా!!
నలుగురిలో ఒకటి కాదా!!
నాకెందుకు నేనన్న పంతం..

నాకెందుకు నేనన్న అంత ప్రేమ.
ఒక చిన్న కణం సోకితే తట్టుకోలేని శరీరం కాదా!!
శక్తి లేని వంటిపై మక్కువేల!!
నాకెందుకు నేనన్న అంత ప్రేమ!!

❖❖❖❖❖

రాబోయే 2021 సంవత్సరానికి శుభస్వాగతం పలుకుదామా..,






SYDNEY TELUGU ASSOCIATION


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE Initial Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

❖❖❖❖❖



## బాలవాహిని

### ౬. అటల్ బిహారి వాజపేయి

*భరతావని ప్రధానివై*
*విలువలకూ ప్రధానివై*
*సంస్కరణలు సాధించిన*
*కవితా రస హృదయుమా!*
*భవ్య కీర్తి వాజపేయి*
*అభివందన చందనం!*



★ జననం :- 1924 డిసెంబరు 25, గ్వాలియర్.

★ మధ్యతరగతికి చెందినవారు. గొప్ప వక్త, గొప్ప కవి.

★ బహుభాషావేత్త (హిందీ, ఆంగ్ల, సంస్కృతం) ప్రజ్ఞానిధి.

★ బ్రహ్మచారి.

★ రాష్ట్ర స్వయం సేవక్ (ఆర్.ఎస్.ఎస్.)లో ఉన్నత శిఖరం.

★ 1996-2004 మూడుసార్లు ప్రధాని (భారతీయ జనతాపార్టీ)
(1) 1996 మే (2) 1998-99 (3) 1999 అక్టోబర్ 13.

★ 1992లో పద్మ విభూషణ్.

★ 1994లో ఉత్తమ పార్లమెంటేరియన్.

★ 2015లో రాష్ట్రపతే స్వయంగా వెళ్ళి మంచం మీద ఉన్న వాజపేయికి 'భారతరత్న' బహూకరించారు.

★ ప్రధానిగా అనేక సంస్కరణలు చేశారు. (1. రహదార్లు, ప్రాజెక్ట్ 2. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ప్రాజెక్ట్ ఈ రెండు ప్రధానమైనవి, వారికిష్టమైనవి).

★ అనేక పదవులు, అనేక బిరుదులు, అనేక రచనలు వారి స్వంతం.

★ నిర్యాణం :- 2018 ఆగస్ట్ 16, న్యూఢిల్లీ.

**సూక్తి :- పలుకు సంస్కారభరితమై వరలవలెను!** (11)

డా. మీగడ రామలింగస్వామి, వైజాగ్

❖❖❖❖❖


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au


BIRYANI HOUSE
PARADISE
Biryani House
BIRYANI HOUSE
14 George Street North Strathfield
Open 7 Days for Lunch and Dinner
Call us : 0297635282

❖❖❖❖❖


తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని
2TripleO
తెలుగువాణి
FM 98.5 MHz
DAB 2000 Languages
Telugu Association, Sydney
08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]
Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or
You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/
The program can also be listened over phone-audio by dialling: +61 2 8080 5650
via TuneIn App on Android | iPhone
తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని
2TripleO FM98.5 MHz
DAB 985
Saturdays 08:00 – 10:00AM Sydney Time
27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 - 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంధ సేవలతో రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
వినండి. వినిపించండి. వింటూ ఉండండి.
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్న వారు;
కారక్రమాలకు ఆర్ధికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్న వారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్న వారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:
శ్రీ సారధి మోటమఱ్ఱి, 0430 022 130 or vani@sydneytelugu.org
https://www.facebook.com/TeluguVaniSydney

❖❖❖❖❖


Sweet
UTSAV
Sweet UTSAV
When Only The Best Will Do
6/17 Brumby Street, Seven Hills, NSW, 2147 Tel: (02) 8608 7146 Mob: 0450 740 277

❖❖❖❖❖